Mana Telangana

ఆదివారం
మన తెలంగాణ
www.manatelangana.news
అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 253
4, ఆదివారం
మార్చి, 2018

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

దొందూ దొందే



కాంగ్రెస్, బిజెపిలను చీల్చిచెండాడిన ముఖ్యమంత్రి కెసిఆర్

'ప్రత్యామ్నాయ వేదిక కోసం చొరవ తీసుకుంటా'

• దేశంలో రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైంది • ప్రబలమైన మార్పు రావాలి • ప్రత్యామ్నాయ ఫ్రంట్ లేదా మరో సాధనం కోసం ప్రజల ఎదురు చూపులు • ఇందుకు తగిన చర్యలు అవసరం • సీతారాం ఏచూరితో మాట్లాడా • మరికొన్ని పార్టీలతో సంప్రదింపులు జరుగుతున్నాయి • రాష్ట్రాల పర్యటన చేస్తా • గుణాత్మకమైన పరివర్తన దిశగా అడుగులు పడాలి • మోడీని తూలనాడలేదు : ప్రగతి భవన్ మీడియా భేటీలో సిఎం అంతరంగ ఆవిష్కరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : ''దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పులు రావాలి. ఆ ప్రబల మార్పునకు ప్రత్యామ్నాయ ఫ్రంటా లేక మరొక రకమైన పని ముట్టా అన్నది ఇప్పుడే చెప్పలేము. ఏడు దశాబ్దాలుగా పాలనలో ఉన్న కాంగ్రెస్, బిజెపిలు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. ఈ రెండూ దొందూ దొందే. డెబ్బై ఏండ్లయినా దేశంలో గుణాత్మకమైన మార్పు రాలేదు. ఇది రావాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం సీరియస్ చర్యలు జరగాలి. డెబ్బై ఏండ్లలో ఐదారేండ్లు సంకీర్ణ ప్రభుత్వాలు పాలన సాగించినా మిగిలిన కాలమంతా కాంగ్రెస్, బిజెపిలు మాత్రమే ఉన్నాయి'' అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. టిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం కెసిఆర్ మీడియా సమావేశంలో దేశ రాజకీయాల్లో రావాల్సిన గుణాత్మకమైన మార్పు గురించి విస్తృతంగా వ్యాఖ్యానించారు. పార్టీలకు సరైన విధానం లేకపోవడం వలన, ప్రజాకోణం నుంచి ఆలోచించకపోవడం వలన సమాజంలో రావాల్సినంత మార్పు రాలేదన్నారు. మన అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని, చట్టాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఇప్పటివరకు తీసుకున్న చర్యలేవీ లేవన్నారు. ప్రజలే చరిత్ర నిర్మాతలు కాబట్టి వారి అవసరాలకు అనుగుణంగా, జీవితాలు మెరుగుపడే విధంగా మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ పౌరుడిగా తాను కూడా ఇదే మార్పు కోరుకుంటున్నానని, చాలా మంది ఆర్థిక నిపుణులు, వివిధ పార్టీల నేతలు కూడా ఈ అభిప్రాయంతోనే ఉన్నారని పేర్కొన్నారు. పరిస్థితులు అనుకూలించి నాయకత్వం వహించాల్సిన బాధ్యతను తనపైన పెడితే అందుకు సిద్ధమేనని చెప్పారు. సరైన సమయంలో ఈ ప్రత్యామ్నాయం సరైన రూపం తీసుకుంటుందన్నారు. ఈ సమూల పరివర్తనకు అవసరమైతే తానే చొరవ తీసుకుంటానని తెలిపారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే నాయకత్వం వహిస్తా. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ ప్రజా అవసరాలు తీర్చడంలో, గుణాత్మకమైన

తరువాయి 6లో



106 సీట్లు మావే

కాంగ్రెస్‌కు పది కంటే రావు
బిజెపికి ఒక్కటీ రాదు
రెండు సర్వేలు చేయించాం : ముఖ్యమంత్రి

6

త్రిపురలో బిజెపి

నాగాలాండ్, మేఘాలయలో హంగ్

3

సోషల్ మీడియాలో సంతన్న హోరు

• సంతోష్‌కు రాజ్యసభ సీటు ఖాయమని, ఉద్యమంలో ఆయన పాత్ర అమోఘమని సోషల్ మీడియాలో వ్యాఖ్యల వెల్లువ



3

సిఎం కెసిఆర్ ఆదేశాలకు అనుగుణంగా భగీరథ పనులు



మన తెలంగాణ / హైదరాబాద్ : తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఆవాసాలకు ముందుగా భగీరథ నీళ్ల సరఫరా చేయాలనే సిఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా పనులు జరగాలని ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ ఈఎన్‌సి సురేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మిగిలిన చిన్న చిన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని జిల్లాల ఎస్ఈ, ఈఈ లతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమయం తక్కువగా ఉన్నందున కార్మికుల సంఖ్యను రెట్టింపు చేసే విధంగా వర్క్ ఏజెన్సీలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. దశల వారీగా గ్రామాలకు నీళ్లను అందిస్తూ ఈ నెల 20 నాటికి చివరి ఆవాసానికి శుద్ధి చేసిన తాగు నీటిని అందించేలా పనులు చేయాలన్నారు. మిషన్ భగీరథ ప్రధాన పనులు సంతృప్తికరంగానే సాగుతున్నాయని, 'ఇంట్రా విలేజ్' పనులు మాత్రం ఆశించినంత వేగంగా జరగడం లేదన్నారు. 'ఇంట్రా విలేజ్' పనులు త్వరగా పూర్తి కావడానికి బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, దీంతో పాటే కొత్త రేట్లను ఖరారు చేసిందని తెలిపారు. కరీంనగర్ క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఛార్జ్ మోమో ఇవ్వాలని సంబంధిత చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడవద్దని, ఎవరి ముందు తలదించుకునే పరిస్థితిని తెచ్చుకోవద్దన్నారు.



ప్రాంతీయ పార్టీలకు చెంపపెట్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: దక్షిణాదిలో బిజెపికి స్థానమే లేదని చెప్పిన ప్రాంతీయ పార్టీలకు తాజా ఎన్నికల ఫలితాలు ఒక చెంప పెట్టు లాంటిదని బిజెపి అధికార ప్రతినిధి కృష్ణసాగర్ అన్నారు. కర్నాటకలో కూడా బిజెపి పాగా వేయబోతుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఎంఎల్ఎ రాజాసింగ్, బిజెపి నాయకులు సుధాకర్‌శర్మతో కలిసి కృష్ణాసాగర్ మాట్లాడుతూ నాగలాండ్‌లో 1.8 ఓట్లు కలిగి ఉండగా, త్రిపురలో 1.5 శాతం ఉన్న ఓట్లు ఉన్న బిజెపి ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని చెప్పారు. ప్రధానిపై సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎంఎల్ఎ రాజా సింగ్ మాట్లాడుతూ అయోధ్య రామమందిరంపై 2019 సంవత్సరం లోపు కోర్టు తీర్పు వెలువడనుందని, రామమందిర నిర్మాణానికి అనుకూలంగానే తీర్పు వెలువడే అవకాశం ఉన్నదన్నారు.

ప్రమాణాలు పాటించాల్సిందే

కాలుష్యంపై ఫార్మా పరిశ్రమలకు మంత్రి కెటిఆర్ దిశా నిర్దేశం



మన తెలంగాణ / హైదరాబాద్ : ఫార్మా కంపెనీలు నిర్దేశిత కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించాల్సిందేనని, లేదంటే ఆయా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటి. రామారావు హెచ్చరించారు. ఫార్మా అభివృద్ధితో పాటు వాతావరణ కాలుష్యాన్ని కాపాడడానికి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి వెల్లడించారు. కాలుష్య కారక పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించడం, క్లష్టర్ల వారీగా ఆయా పరిశ్రమల అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఫార్మా పరిశ్రమలకు ఎల్లప్పుడూ చేయూత అందిస్తూ వస్తోందని తెలిపారు. బల్క్‌డగ్

మ్యాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం పిసిబి కార్యాలయంలో మంత్రి కెటిఆర్ సమావేశం అయ్యారు. చెరువులు, జల వనరుల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా వారిని కెటిఆర్ కోరారు. పటాన్ చెరువు, బొల్లారం వంటి పారిశ్రామిక కేంద్రాల్లో ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్ కార్యక్రమాల్లో పాలు పంచుకునేందుకు ఈ సందర్భంగా పరిశ్రమ వర్గాలు ముందుకు రావడాన్ని కెటిఆర్ స్వాగతించారు. ఫార్మా ప్రతినిధులు తమ కంపెనీల విస్తరణ ప్రణాళికలను మంత్రికి తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను, సవాళ్లను ప్రభుత్వ సహకారాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో పాటు తాము అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే దిశగా వెళ్తున్నామని, కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించే దిశగా ముందుకు వెళ్తున్నామని ఫార్మా ప్రతినిధులు కెటిఆర్‌కు తెలియజేశారు. దీనికి కెటిఆర్ సమాధానమిస్తూ తమ ప్రభుత్వం భారతదేశ ఫార్మా రాజధానిగా హైదరాబాద్ నగరానికి ఉన్న పేరును నిలుపుకునేందుకు అవసరం అయిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ముచ్చెర్లలో హైదరాబాద్ ఫార్మాసిటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫార్మా సిటీతో ఫార్మా రంగం అభివృద్ధితో పాటు కాలుష్య సమస్యను పూర్తిగా అరికట్టేలా అత్యుత్తమ సాంకేతిక పద్దతులను ఉపయోగించుకుంటామని ఫార్మా ప్రతనిధులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

'బాలల' రక్షణకు చర్యలు తీసుకోండి

మన తెలంగాణ/ హైదరాబాద్ : కోర్టుల్లో సాక్ష్యాలు చెప్పేందుకు వచ్చిన బాలబాలికలకు భయం, బెరుకు లేని వాతావరణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రాష్ట్రాల్లోని బాలల హక్కుల కమిషన్స్‌లో ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసును తగిన చర్యలు తీసుకోవాలని గత వారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సెక్రటరీ అన్ని హైకోర్టులకు లేఖలు రాశారు. దీనిని ఉమ్మడి హైకోర్టు బెంచ్ విచారించి.. బాలలపై లైంగిక వేధింపులు., బాల్య వివాహాలు, ఇతర కేసుల్లో బాలల్ని విచారించేప్పుడు కోర్టుకు వచ్చామనే భావన వారికి రానీయకుండా తెలుగు రాష్ట్రాలు చర్యలు తీసుకుని దానిపై పూర్తి సమాచారాన్ని తమకు నివేదించాలని ఆదేశించింది. రెండు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి తలసాని



మనతెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన అందరికి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. సచివాలయంలోని శనివారం పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండి లక్ష్మారెడ్డిలతో ఆయన సమావేశం నిర్వహించారు. కులవృత్తులకు ముఖ్యమంత్రి కెసిఆర్ 5 వేల కోట్ల రూపాయలతో గొల్ల, కురుమలకు గొర్రెలు పంపిణీచేస్తున్నారని తెలిపారు. మత్స్య వృత్తిపై ఆధారపడిన వారి కోసం గతేడాది 21కోట్లు, ఈ ఏడాది 52కోట్లు చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కొత్త జిల్లాల వారీగా మత్స్యకారుల నూతన సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాత తొమ్మిది జిల్లాల జిల్లా స్థాయి గొర్రెల పెంపకందారుల సొసైటీల్లో మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల సొసైటీల పదవీకాలం ముగిసిందన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల సొసైటీ పదవీకాలం వచ్చే ఏడాది ముగుస్తాయని చెప్పారు. జిల్లా స్థాయి సొసైటీలే కాకుండా రాష్ట్రంలో మొత్తం 8025 గొర్రెల పెంపకందారుల సొసైటీలు ఉన్నాయన్నారు. వీటిలో 3257 పాతసొసైటీలు, 7037 కొత్త సొసైటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 3820 మత్స్య సహకార సొసైటీలు ఉండగా వీటిలో 946 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. 153సొసైటీలు పర్సన్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నడుస్తున్నాయన్నారు. వీటన్నింటికి సహకార చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వానికి చేరిన పంచాయతీల వ్యవహారం

- **పంచాయతీలుగా మారనున్న 1000 తండాలు, 1500 అనుబంధ గ్రామాలు**
- **మున్సిపాలిటీల్లో విలీనం కానున్న 300 పంచాయతీలు**
- **ఇప్పటికీ వస్తున్న కొత్త విజ్ఞప్తులు**

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన కొత్త పంచాయతీల జాబితా ఎట్టకేలకు ప్రభుత్వం వద్దకు చేరుకుంది. జిల్లాల నుంచి ప్రతిపాదనల జాబితాలు రాగా వాటిని పంచాయతీ రాజ్ శాఖాధికారులు పరిశీలించి తుది జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి అందచేశారు. ప్రస్తుతం వీటి తుది పరిశీలన జరుగుతోంది. జిల్లా స్థాయిలో కొత్త పంచాయతీల జాబితా పూర్తయి, రాష్ట్ర స్థాయికి చేరినప్పటికి ఇప్పటికి కలెక్టర్లకు,నేరుగా రాష్ట్ర పంచాయతి రాజ్ అధికారులకు తమ గ్రామాలను పంచాయతీలుగా మార్చాలంటూ విజ్ఞప్తులు వస్తూనే ఉన్నాయి. అయితే వీటిని అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదు. కొన్నింటి విషయంలో రాజకీయ ఒత్తిళ్లు కూడా వస్తున్నాయని పంచాయతీరాజ్ అధికారి ఒకరు చెప్పారు. జిల్లాల నుంచి 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభా ప్రాతిపదికన కూడా కొత్త పంచాయతీల ప్రతిపాదనలు కొన్ని వచ్చాయి. అయితే రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ అధికారులు పరిశీలనలో వాటిని తొలగించి మిగిలిన వాటి ప్రతిపాదనలను మాత్రమే ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపిన పంచాయతీల జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం పంచాయతీల సంఖ్య దాదాపు 13వేలకు చేరుకోనుంది. వీటిలో కొత్త పంచాయతీలు 3500 నుంచి 4వేల లోపు ఉండబోతున్నాయి. 500 జనాభా ఉన్న తండాలను గ్రామపంచాయతీలుగా మారుస్తామన్న ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చారు. ఈ కొత్త పంచాయతీల ప్రతిపాదనల్లో దాదాపు వెయ్యి తండాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 8684 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటికి 21,768 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో 500 జనాభాకు పైగా ఉన్న దాదాపు 1500 గ్రామాలు కొత్త పంచాయతీలుగా మారబోతున్నాయి. దాదాపు 300 గ్రామపంచాయతీలు మున్సిపాల్టీల్లో విలీనం కానున్నాయి.300 నుంచి 500లోపు జనాభా ఉన్న మరికొన్ని తండాలు, ఆవాసాలు కూడా కొత్త పంచాయతీల ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన తండాలే ఎక్కువగా కొత్త పంచాయతీల ప్రతిపాదనల జాబితాలో ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 8684 గ్రామ పంచాయతీల జనాభా మొత్తం జనాభా 2,19,77,989. వీటిలో 1000లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు 825 ఉన్నాయి. వీటి సంఖ్య గణనీయంగా పెరగనుంది. పంచాయతి రాజ్ చట్టం ప్రకారం 500 కంటే తక్కువ జనాభా ఉన్న వాటిని పంచాయతీలుగా మార్చరాదు. అయితే కొత్త వాటి ప్రతిపాదనల్లో 500జనాభా కంటే తక్కువ ఉన్నవి ఉన్నాయి. వీటిని ప్రభుత్వం ఆమోదిస్తుందా లేదా అనేది చర్చనీయాంశం.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్‌కు 4,73,480 మంది హాజరు

మనతెలంగాణ/ హైదరాబాద్ : ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఇంగ్లీష్ పేపర్–1) పరీక్షలకు 4,93,996 మంది రాయాల్సి ఉండగా, 4,73,480 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పరీక్షలకు 20,516(4.15 శాతం) గైర్హాజరయ్యా.రని పేర్కొన్నారు. ఈ పరీక్షకు సెట్–ఎ ప్రశ్నపత్రాన్ని ఇచ్చామని, 10 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు.


సైబర్ నేరాలపై మహిళల్లో అవగాహన

- **టిఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు కె.కేశవరావు**



మన తెలంగాణ / హైదరాబాద్ : మహిళలపై సైబర్ నేరాలు, వేధింపులు పెరిగిపోతున్నాయని వీటి నివారణ చర్యల్లో భాగంగా సైబర్ నేరాలపై మహిళల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని టిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు డాక్టర్ కె.కేశవరావు అన్నారు. మహిళల పట్ల సైబర్ నేరాలపై తెలంగాణ మహిళా కమిషన్ శనివారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించింది. మహిళా కమిషన్ చైర్ పర్సన్ త్రిపురాన వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో కెకె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో సోషల్ అవేర్నెస్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు మహిళా కమిషన్ కార్యక్రమాలు తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో టెక్నాలజీ సహకారంతో సైబర్ క్రైమ్‌కు పాల్పడడం పెరిగిపోతోందని దీని నివారణకు పర్యవేక్షణ అవసరం ఉంద న్నారు. అంతకు ముందు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం మాట్లాడుతూ నానాటికి మహిళలపై ఆఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పురుషులతో పాటు మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం ఉండాలని రాజ్యాగం చెబుతున్నా నేటికి మ హిళ అంటే చిన్న చూపు చూస్తున్నారన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా ఎన్ని శిక్షలు వేస్తున్నా మార్పు రావడం లేదన్నారు. సైబర్ క్రైం తగ్గించడానికి పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లు తేవాలని ఆమె కేశవరావుకు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలపై మహిళల్లో అవగాహన కల్పించడానికి ఈ వర్క్‌షా.ప్ నిర్వహించారు. సైబర్ నేరాలపై నల్సార్ లా యూనివర్శిటీ అసిసెటంట్ ప్రొఫెసర్ డా. కె.వి.కె సాంథి, ప్రజ్వల ఎన్‌జివో సభ్యురాలు డా.సునీత కృష్ణన్, స్వేచ్ఛ ఎన్‌జివో ప్రతినిధి వై కిరణ్ చంద్ర సైబర్ నేరాలపై వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు . ఈ కార్య క్రమంలో షీ టీమ్ కు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

తెలుగు వర్శిటీ ప్రతిభా పురస్కారాలు ప్రదానం



మనతెలంగాణ/ హైదరాబాద్ : మనల్ని మనం గౌరవించుకునే సంప్రదాయాన్ని తెలుగు విశ్వవిద్యాలయం కొనసాగిస్తుందని, దీనిని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని గిరిజన, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ ఆకాంక్షించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, కళా ప్రక్రియల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు శనివారం 2016 ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. వసంతరావు దేశ్‌పాండే(నవల/కథ), వేణు సంకోజు(కవిత్వం), నియోగి(విమర్శ), మాసురామ్ రవికాంత్(చిత్రకళ). శివ రామాచారి(శిల్పకళ), డాక్టర్ వనజా ఉదయ్(నృత్యం), కె.ఎస్.ఆర్.బాలకృష్ణ శాస్త్రి(సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు(నాటకరంగం), అంగళకుర్తి రాంమూర్తి(జానపద కళారంగం), డాక్టర్ జి.ఎం.రామశర్మ(అవధానం) అయినంపూడి శ్రీలక్ష్మి(ఉత్తమ రచయిత్రి)లకు మంత్రి అజ్మీరా చందూలాల్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.వి.సత్యనారాయణలు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పురస్కార గ్రహీతలకు రూ.20,116 నగదు, శాలువా, పురస్కార పత్రంతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భాషపైన, తెలంగాణ సంస్కృతిపైన సిఎం ప్రత్యేక శ్రద్ద పెట్టి చూస్తుంటారని, వాటి అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుస్తారని అన్నారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు విపరీతమైన స్పందన వచ్చిందని గుర్తు చేశారు. సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, మన కళలు, సాహిత్యాన్ని కాపాడటంలో తెలుగు వర్సిటీ ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. ఎలాంటి పైరవీలకు తావు ఇవ్వకుండా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారిని ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ, కళ చాలా గొప్పదని, అది చిరకాలం ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు వర్సిటీ విసి ఎస్.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, పారదర్శకంగా ప్రతిభా పురస్కారాల ఎంపిక జరిగిందని తెలిపారు. ఆయా రంగాలలో విశిష్ట సేవలందించిన వారిని ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల, విస్తరణ సేవా విభాగం ఇన్ ఛార్జ్ రింగు రామమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు అవకాశం

మనతెలంగాణ/ హైదరాబాద్ : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫారెస్ట్ కోర్సుల ప్రవేశాలకు మే 2వ తేదీ నుంచి నిర్వహించనున్న ఎంసెట్ పరీక్షకు ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు ఆలస్యం రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. సమర్పించిన దరఖాస్తుల సవరణకు ఏప్రిల్ 6 నుంచి 9వ తేదీ వరకు అవకాశం ఉంటుంది. రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 11 వరకు, రూ. వెయ్యి అపరాధ రుసుంతో ఏప్రిల్ 18 వరకు, రూ.5,000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు, రూ.10 వేల అపరాధ రుసుంతో ఏప్రిల్ 28 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఏప్రిల్ 20 నుంచి మే 1వ తేదీ వరకు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో 10 టెస్ట్ జోన్లు ఏర్పాటు చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం, కర్నూలులో టెస్ట్ జోన్లు ఏర్పాటు చేశారు.

మెయిల్ ఐడి తప్పనిసరి

రాష్ట్రంలో తొలిసారి ఎంసెట్ ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున దరఖాస్తుకు ఇ–మెయిల్ ఐడి తప్పనిసరి చేశారు. విద్యార్థులు ఎంసెట్ దరఖాస్తు సమయంలో తప్పనిసరిగా వాడుకలో ఉన్న మెయిల్ ఐడి సమర్పించాలి. లేనిపక్షంలో ఎంసెట్‌కు సంబంధించిన విలువైన సమాచారాన్ని పొందలేకపోతారు. ఈ సారి పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా మెయిల్‌కే పంపించనున్నారు. ఆన్‌లైన్ పరీక్ష జవాబు పత్రం(రెస్పాన్స్ షీట్)ని కూడా మెయిల్ ఐడికే పంపిస్తారు.

హజ్ యాత్రికులకు నేడు శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : హజ్ యాత్రకు వెళ్ళనున్న భక్తులకు ఆదివారం రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీలోని దారుషిఫాలో ఈ ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.ఎ షుకూర్ తెలిపారు. హజ్ యాత్ర సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, హజ్ కమిటి ఏర్పాట్లు, ఇతర అంశాలపై భక్తులకు సూచనలు చేయనున్నారు. హజ్ కమిటీ చైర్మన్ మొహమ్మద్ మసిఉల్లా ఖాన్ అధ్యక్షతన ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్లు, పాల్గొంటున్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం అత్యధికంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఆదిలాబాద్, భద్రాచలం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, రామగుండంలలో ఇది న యోవయ్యింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రత వివరాలు ఇలా ఉన్నాయి. హకీంపేట 35 డిగ్రీలు, హన్మకొండ 37, హైదరాబాద్ 36, ఖమ్మం 37, మెదక్ 38, నల్గొండ 35 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యింది.



రైతాంగానికి ఏం చేశారు?

మనతెలంగాణ/హైదరాబాద్: రైతాంగానికి కేం ద్రంలోని బిజెపి ప్రభుత్వం, టిఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమా అని బిజెఎల్‌పి నేత జి.కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సవాల్ విసిరారు. పంటల నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేసిందని, 14కోట్ల ఎకరాలకు భూ సార పరీక్షలు నిర్వహించామ న్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ కిట్ పథ కంలో కూడా కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నాయని, దేశంలో ఏ ఒక్క కార్యక్రమం కూడా నరేంద్ర మోడి పేరు తో లేదని వివరించారు. సిఎం స్థాయిని దిగజార్చేలా ప్రధానమంత్రి స్థాయిని అవమానించేలా కెసిఆర్ మాట్లడారని, దేశ ప్రజల మనో భావాలను దెబ్బతీసేలా ఉన్నదన్నా రు. కెసిఆర్ అనుచిత ప్రవర్తన పట్ల ప్రజలలో వస్తు న్న వ్యతిరేకత కారణంగానే కెసిఆర్ కుటుంబ సభ్యులు వెంటనే ప్లేటు ఫిరాయించారని, అందు లో భాగమే కెసిఆర్ నోరు జారారని, మాట దొర్లిందని వారు చెబుతున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కెసిఆర్ వెంటనే ప్రధానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్‌లో రెండు సీట్లు ఓడిపోతేనే కెసిఆర్ ప్లేటు ఫిరాయించారని, ఇప్పుడు త్రిపురలో అధికారంలోనికి వచ్చామని, అక్కడ తమ బలం చూసి ఏం మాట్లాడుతారని కిషన్ రెడ్డి ప్రశ్నిం చారు. రాబోయే 2019 ఎన్నికల్లో తెలంగాణలో కూడా బిజెపి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మేఘాలయ ఓటరు విలక్షణ తీర్పు !

- **వరుసగా 9 ఎన్నికల్లో ఇదే తీరు**
- **ప్రభుత్వ ఏర్పాటులో స్వతంత్ర ఎంఎల్‌ఎలూ కీలకమే**
- **దేశంలోనే ప్రప్రథమంగా సిఎం అయిన ఇండిపెండెంట్**

షిల్లాంగ్ : మేఘాలయలో ఓటర్లు ఎప్పుడూ విలక్షణమైన తీర్పును ఇస్తూ ఉంటారు. ఎవరికీ ఆధిక్యాన్ని కట్టబెట్టకుండా వరుసగా భిన్నమైన ఫలితాలనే అందిస్తుంటారు. ఇక్కడ మొట్టమొదటిసారిగా 1972లో జరిగిన శాసనసభ ఎన్నికలను మినహాయిస్తే తొమ్మిది ఎన్నికల్లో వరుసగా ఓటర్లు ఎవరికీ స్పష్టమైన మెజార్టీని ఇవ్వలేదు. 1978 నుంచి జరిగిన తొమ్మిది ఎన్నికల్లో చిత్రంగా కాంగ్రెస్ పార్టీ మాత్రం అతిపెద్ద పార్టీగానే నిలుస్తూ వస్తున్నది. 2013 ఎన్నికల్లో ఆ పార్టీకి లభించిన అత్యధిక సీట్ల సంఖ్య 29. మొత్తం 60 స్థానాలు కలిగిన అసెంబ్లీలో అప్పుడు ఆ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు కేవలం రెండు సీట్ల దూరంలోనే ఆగిపోయింది. 2018లో జరిగిన ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలను గెల్చుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, 2012లో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నుంచి బహిష్కరణకు గురైన అనంతరం అప్పటి లోక్‌సభ స్పీకర్ పిఎ సంగ్మా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) ని ఏర్పాటు చేశారు. 2013లో ఎన్‌పిపి కేవలం రెండు స్థానాలను మాత్రమే గెల్చుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ (21) తర్వాత స్థానంలో (19 చోట్ల విజయం) నిలిచింది. ఎన్‌పిపి సాధించిన విజయాలు రాష్ట్రం నలుమూలలా కావడం ఇక్కడ విశేషంగా చెప్పాలి. గారో హిల్స్ ప్రాంతం నుంచి 11 స్థానాలను, ఖాసీ, జైన్‌టియా హిల్స్ నుంచి 9 సీట్లను గెల్చుకుంది. ఎన్‌పిపి విజయాల ప్రగతితో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేలా పరిస్థితులు మారుతున్నాయి. 2013 ఎన్నికల్లో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.2018 ఎన్నికల విషయానికి వస్తే ప్రాంతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు సాధించిన విజయాలు ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంగా మారుతున్నాయి. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా వీరే ఇప్పుడు నిర్ణాయక శక్తులుగా మారారు. యుడిపి కూటమి గతంలో 13 స్థానాలను గెల్చుకోగా, ఇప్పుడు ఆ సంఖ్య 8కి పడిపోయింది.

అయనప్పటికీ ఇప్పుడు ఆ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కింగ్‌మేకర్‌గా నిలుస్తోంది. మేఘాలయలో గతంలో ముగ్గురు యుడిపి ముఖ్యమంత్రులు పాలన సాగించారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా మేఘాలయ రాజకీయాల్లో కీలక భూమికను పోషిస్తున్నారు. మొత్తం 60 స్థానాలు కలిగిన అసెంబ్లీకి మొట్టమొదటగా జరిగిన ఎన్నికల్లో 19 మంది స్వతంత్రులు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో ఈ సంఖ్య 13. 2001లో జరిగిన ఎన్నికల్లో గెలిచిన స్వతంత్ర అభ్యర్థి ఏకంగా ముఖ్యమంత్రి కావడం గమనార్హం. ఫ్లిండర్ అండర్సన్ ఖోంగ్లామ్ (సోహ్రా నుంచి ఇండిపెంటెండ్ ఎంఎల్‌ఎ — సోహ్రాకు బయటి ప్రపంచంలో చిరపుంజిగా గుర్తింపు) దేశంలోని ఏ రాష్ట్రంలోనే లేని విధంగా ఏకంగా ముఖ్యమంత్రి అయ్యా రు. కాగా, 2018 ఎన్నికల్లో గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య 3కు తగ్గిపోయింది (1983లో ఇదే విధంగా ఉంది). అయితే ఇప్పుడు ఈ ముగ్గురు కూడా ముఖ్యమంత్రిని నిర్ణయించే వారిలో కీలకంగా మారా రు. బిజెపికి మేఘాలయ విజయం చిక్కని రాష్ట్రంగానే ఉంది. అయితే 2018లో ఆ పార్టీకి వచ్చిన ఉత్తమ ఓటింగ్ శాతం గతంలో ఎన్నడూ లేదు. మొత్తం పోల్ అయిన ఓట్లలో 10 శాతం ఓట్లను బిజెపి దక్కించుకుంది. 2003 తో (5.4 శాతం)పోలిస్తే ఇది రెట్టింపు అయినట్టు. అయి తే, సీట్ల పరం గా చూస్తూ 1998 లో వచ్చిన మూడు కంటే ఇప్పుడు తక్కువ కావడం ఇక్కడ గమనార్హం.

త్రిపురలో విరబూసిన కమలం

- **వామపక్షాల కోటలో బిజెపి పాగా, నాగాలాండ్, మేఘాలయలో హంగ్**
- **ఈశాన్య అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడి**



అగర్తలా/షిల్లాంగ్: త్రిపుర, నాగాలాండ్, మేఘాలాయలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఈ ఎన్నికలలో అసాధారణ రీతిలో వామపక్షపు కంచుకోట త్రిపురలో బిజెపి విజయం సాధించింది. నాగాలాండ్‌లో హంగ్ ఏర్పడింది. ఇక ఇప్పటివరకూ మేఘాలయాలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు ఎక్కువ స్థానాలు దక్కించుకున్న పార్టీగా మారింది. ఇక్కడ చిన్న పార్టీలు 13 సీట్లు, ఇండిపెండెంట్లు మూడు స్థానాలను దక్కించుకుని ప్రభుత్వ స్థాపనలో కీలకంగా మారారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు అనుగుణంగానే త్రిపుర అసెంబ్లీలో ఇప్పుడు బిజెపి సొంతంగా 32 స్థానాలను గెల్చుకుంది. 60 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బిజెపి సొంతంగా ఆధిక్యత చాటుకోగా , బిజెపి మిత్రపక్షం ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) ఏడు సీట్లలో గెలుపొంది, ఒక స్థానంలో మెజార్టీతో ఉంది. ఓట్ల లెక్కింపు చివరి దశలో బిజెపి త్రిపురలో 32 స్థానాలలో గెలుపొందిన, బిజెపి మరో మూడు స్థానాలలో ఆధిక్యతలో ఉందని వెల్లడైంది. త్రిపుర, నాగాలాండ్‌లలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటూ రాలేదు. సిపిఎం ఈసారి ఎన్నికలలో 11 స్థానాలలో గెలుపొంది, మరో ఐదు స్థానాలలో ఆధిక్యతలో ఉంది. త్రిపుర రాజకీయాలలో ఇంతకాలమూ నామమాత్రంగా ఉన్న బిజెపి, గత అసెంబ్లీ ఎన్నికలలో ఒక్క సీటూ రాని పార్టీ ఇప్పుడు పాతికేళ్ల నుంచి అధికారంలో ఉన్న సిపిఎంను ఓడించి అధికార పగ్గాలు చేపట్టనుంది. మూడు రాష్ట్రాల్లోనూ 60 అసెంబ్లీ స్థానాలు ఉండగా వివిధ కారణాలతో అన్నింటిలోనూ 59 స్థానాల చొప్పున ఎన్నికలు జరిగాయి. త్రిపురలో గెలుపు పట్ల ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం పార్టీ అధ్యక్షులు అమిత్ షా వ్యూహరచన కారణమని, విజయ రూపకల్పనలో ఆయన శిల్పి అని అభివర్ణించారు. పార్టీ నూతన ప్రధాన కార్యాలయంలో బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

నాగాలాండ్‌లో హంగ్ ...ఎన్‌పిఎఫ్‌కు ఛాన్స్ : నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో అక్కడ హంగ్ ఏర్పడింది. పార్టీలు కానీ, ఎన్నికలకు ముందు ఖరారయిన కూటములు కానీ పూర్తి స్థాయిలో బలం చాటుకోలేక చతికిలపడ్డాయి. అయితే ఇక్కడ ఎన్‌పిఎఫ్ 24 స్థానాలను దక్కించుకుని, మరో మూడింట్లో ఆధిక్యతతో నిలిచి ఎక్కువ స్థానాల పార్టీగా నిలిచింది. ఇక్కడ బిజెపికి తొమ్మిది స్థానాలు వచ్చాయి. మరో రెండింట్లో ఆధిక్యతలో ఉంది. ఇక మిత్రపక్షం ఎన్‌డిపిపి 11 స్థానాలలో గెలిచి, నాలుగింట్లో ఆధిక్యతలో ఉంది. ఈ దశలో ఎన్‌పిఎఫ్ నేత, ముఖ్యమంత్రి టిఆర్ జిలియాంగ్ బిజెపి మద్దతుకు ప్రతిపాదన పంపించారు. ప్రభుత్వం ఏర్పాటులో సహకరించాలని, ప్రభుత్వంలో చేరాలని ఆహ్వానించారు. దీనితో ఈ దశలో ఇక్కడ సంకీర్ణం ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతోంది. ఎన్నికలకు ముందే బిజెపి ఇక్కడ ఎన్‌పిఎఫ్‌తో తెగతెంపులు చేసుకుని, నీఫియూ రియో నాయకత్వంలోని ఎన్‌డిపిపితో చేతులు కలిపింది. ఈ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాలేదు. తాము ఇప్పటికీ బిజెపి ఆధ్వర్యంలోని ఈశాన్య ప్రజాస్వామ్య కూటమిల భాగస్వాములుగానే ఉన్నామని, రాష్ట్రంలో కొత్త ప్రభు త్వం ఏర్పాటుకు బిజెపి సహకరిస్తుందని ఆశిస్తున్నామని జిలియాంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వంలో చేరాలని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బిజెపి నాయకత్వ కూటమితో తాము తెగతెంపులు చేసుకోలేదని ఆయన ఎన్‌డిటివికి చెప్పారు.

మేఘాలయాలో కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు

మేఘాలయాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఇప్పటివరకూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆధిక్యతను చాటుకోలేకపోయిం ది. అయితే 21 స్థానాలు దక్కించుకుని ఏకైక అతిపెద్ద పార్టీగా మారింది. శరద్ పవార్ నాయకత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఒక్క సీటు, బిజెపి రెండు సీట్లు పొందాయి. నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయన్స్ భాగస్వామ్యం అయిన నేషనల్ పీపుల్స్ పార్టీ 19 స్థానాలు గెలుపొందింది. ఈ రాష్ట్రంలో చిన్న పార్టీలు 13 స్థానాల లో, ఇండిపెండెంట్లు మూడు స్థానాల్లో గెలుపొందారు. దీనితో వీరే ఇక్కడ ప్రభుత్వ స్థాపనలో కీలకం కానున్నారు. రాష్ట్రంలో 2009 మే నుంచి కాంగ్రెస్ అధికారం లో ఉంది. ఇక్కడ తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు సాధాసాధ్యాలను పరిశీలించేందుకు పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్‌ను హుటాహుటిన షిల్లాంగ్‌కు పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ స్థాపనకు అవకాశాలు బాగా ఉన్నాయని, అసెంబ్లీ వేదికగా బలనిరూపణకు తగు సంఖ్యలో ఎమ్మెల్యేల మద్దతు తమకు ఉందని కమల్‌నాథ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

అధిక స్థానాలు పొందిన పార్టీగా కాంగ్రెస్‌ను ప్రభుత్వ స్థాపనకు గవర్నర్ విధిగా ఆహ్వానించాల్సి ఉందని , గవర్నర్ నిర్దేశించిన సమయంలో సభలో బలం నిరూపించుకుంటామని ఆయన టీవీ ఛానల్స్ వారితో చెప్పారు.బిజెపి పోటీలో లేదని,ప్రజాతీర్పు సార్థకం అయ్యేరీతిలో తాము స్పందిస్తామని కమల్‌నాథ్ చెప్పారు.



పీపుల్‌ప్లాజాలో పోలీస్ ఎక్స్‌పో

హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో పోలీస్ ఎక్స్‌పోను తెలంగాణ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీ షీమ్స్ అద్భుతంగా పని చేస్తున్నాయని ఆయన అన్నారు. షీటీమ్స్‌తో హైదరాబాద్ ప్రతిష్ఠ పెరిగిందని చెప్పారు. బాధితులకు షీ టీమ్స్ అండగా నిలబడుతున్నాయని ఆయన అభినందించారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని ఆయన వెల్లడించారు. షీటీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలంగాణ డిజిపి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ చీఫ్ స్వాతిలక్రా, సినీ నటి రాశిఖన్నా తదితరులు పాల్గొన్నారు.



సోషల్ మీడియాలో సంతన్న హోరు


సోషల్ మీడియాలో వైరలవుతున్న దృశ్యాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాల్లో గెలుపు టిఆర్‌ఎస్‌దేనని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. ఆ మూడు పదవులకు పోటీచేసే అభ్యర్థులెవరనేది ఇంకా అధికారికంగా వెల్లడికాకపోయినప్పటికీ పార్టీ ఆవిర్భావం మొదలు కెసిఆర్‌కు వెన్నంటి ఉన్న జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు ఖాయం అనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే రాజ్యసభ సభ్యుడు కావడానికి ఆయనకున్న అర్హతేంటి అంటూ కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడంతో సోషల్ మీడియాలో చర్చలు ఊపందుకున్నాయి. 'కెసిఆర్‌కు ఆత్మలా వెన్నంటి ఉండి తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర తెరపైన కనిపించకపోయినా పార్టీకి ఆయన చేసిన సేవ ఎలాంటిదో ఆ పార్టీ కార్యకర్తలుగా మాకందరికీ తెలుసు' అని టిఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు కిషోర్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఇదే తరహాలో టిఆర్‌ఎస్ కార్యకర్తలు సోషల్ మీడియాలో సంతోష్‌కు అనుకూలంగా ఎన్నో పోస్టింగ్‌లను పెట్టి తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్‌కు నీడలా ఉన్న ఫోటోలను విస్తృత ప్రచారంలోకి తీసుకొచ్చారు. రాష్ట్ర సాధనలో కెసిఆర్ రథసారధిగా ఉంటే, ఆయనకు నీడలా ఉన్న సంతోష్ తన వ్యక్తిగత జీవితాన్ని సైతం పట్టించుకోకుండా రాష్ట్రం కోసం, పార్టీ కోసం వెచ్చించారని అభిమానులు ప్రచా రం చేస్తున్నారు. ఇంతకంటే అర్హతలు ఏం కావాలని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా దశాబ్దకాలంగా పార్టీలో క్రియాశీల కార్యకర్తగా ఉన్నారని, 2009లో కెసిఆర్ దీక్ష సమయంలో నీడలా నిలిచారని ఫోటోలతో సహా వివరిస్తున్నారు. కుమారుడు కాబట్టి కెటిఆర్‌ను రాజకీయాల్లోకి ఆహ్వానించి ఉండకపోతే 'బంగారు తెలంగాణ' నిర్మాణంలో ఈ రోజు ఆయనను ఒక సమర్థ నాయకుడి గా చూడగలిగేవారమా అని కిషోర్‌గౌడ్ ప్రశ్నించారు. అదే తరహాలో ఇప్పుడు రాజ్యసభ సభ్యుడిగా సంతోష్ కూడా భవిష్యత్తులో పార్టీ నాయకుడిగా, రాష్ట్ర అభివృద్ధిలో ఒకరిగా ఉంటారుకదా అని ప్రస్తావించారు. ఎంతో మంది సాధా రణ కార్యకర్తలు కెసిఆర్ ఉద్యమ నాయకత్వంలో నాయకులుగా ఎదిగారని, ఇప్పుడు సంతోష్ ప్రస్థానం కూడా అలాంటిదేనని వ్యాఖ్యానించారు. ఎన్నో కీలక సమయాల్లో పార్టీలో సంతోష్ పోషించిన పాత్రను మరువలేమని, పరీక్షా సమయాల్లో సైతం వెనకడుగు వేయకుండా పార్టీతో, కెసిఆర్‌తోనే కొనసాగారని ఉదహరించారు. రాజ్యసభ సభ్యుడిగా సంతోష్ పేరు దాదాపు ఖరారైన నేపథ్యంలో ఆయనపై విపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి టిఆర్‌ఎస్ కార్యకర్తలు, సంతోష్ అభిమానులు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ధీటైన సమాధానాలు ఇస్తున్నారు.


సోషల్ మీడియాలో

ముగ్గురు పిల్లలకు చైనా చట్టం!

బీజింగ్:భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని దేశ జనాభాను పెంచేందుకు పౌరులు ముగ్గురు పిల్లల్ని కనేందుకు మరో చట్టాన్ని తీసుకురావాలంటూ దక్షిణ చైనాలోని గ్వాంఝూ ప్రజాప్రతినిధి అక్కడి చట్టసభలో ప్రతిపాదించారు. రెండేళ్ల క్రితం వన్ చైల్ విధానానికి స్వస్థి చెప్పి దేశ పౌరులకు ఇద్దరు పిల్లల్ని కనే అవకాశం కల్పించిన విధానం వలన ఎలాంటి ప్రయోజనాలు కలగలేదని ఆయన తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో తగినన్ని జననాల సంఖ్య పెరగకపోవడమే దీనికి ప్రధాన కారణమంటూ ఆయన అన్నారు. ఇద్దరు పిల్లల విధానం వలన 2016లో జననాల సంఖ్య బాగానే పెరిగినా, 2017లో తక్కువగా నమోదయ్యాయి.

కుంచెపోటు



24లక్షల క్వింటాళ్ల కందుల కొనుగోలు



- **164 మండలాల్లో గోడౌన్ల నిర్మాణానికి చర్యలు**
- **సమీక్ష సమావేశంలో మంత్రి హరీశ్‌రావు**

మన తెలంగాణ/ హైదరాబాద్ : గోడౌన్ లు లేని 164 మండలాల్లో 5 ఎకరాల అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్లకు లేఖలు రాయాలని మార్కెటింగ్ అధికారులను మంత్రి టి. హరీశ్ రావు ఆదేశించారు.అయితే ఆయా ప్రదేశాల్లో గోడౌన్ల వసతి డిమాండ్ ను సరిగ్గా అంచనా వేయాలని ఆయన కోరారు.దీనికి సంబంధించి 15 రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని మంత్రి కోరారు.ఇప్పటివరకు 1315 కోట్ల రూపాయల విలువ చేసే 24.13 లక్షల క్వింటాళ్ళ కందులను తెలంగాణ ప్రభుత్వం సేకరించినట్టు మార్కెటింగ్ మంత్రి హరీశ్ రావు చెప్పారు.శనివారం సెక్రెటేరియట్ లో కందుల కొనుగోళ్ళను సమీక్షించారు. తెలంగాణ రైతులకు మద్దతుధర కల్పించడంలో, కందుల సేకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై హరీశ్ రావు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కందుల కొనుగోళ్ల వ్యవహారంలో కేంద్రం ఉదాసీనతపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలపై స్పందన లేదన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే 24 లక్షల క్వింటాళ్ళకు పైగా కందులు కొనుగోలు చేసినా, ఇంకా దాదాపు మరో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల కందులు మార్కెట్ కు వస్తున్నట్టు చెప్పారు.ఈసారి 2.51 లక్షల హెక్టార్లలో రైతులు కంది పంట వేశారని తెలిపారు.కేవలం 75 వేల మెట్రిక్ టన్నుల సేకరణకే కేంద్ర ప్రభుత్వం అంగీకరించినందుకు,కందుల కొనుగోళ్లలో పరిమితులు విధించినందుకుహా హరీశ్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కంది రైతుల బకాయిల చెల్లింపునకు గాను ప్రభుత్వం రూ.600 కోట్ల బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిందన్నారు.అత్యంత త్వరగా కందిరైతుల బకాయిలు చెల్లించాలని మార్క్ ఫెడ్,హాకా సంస్థలను మంత్రి కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలోనిహా 330 గోడౌన్లలో 185 గోడౌన్ లు మాత్రమే వినియోగంలో ఉన్నాయని,మిగతా 145 గోడౌన్లన్నింటినీ ఖరీఫ్ లోగా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. గోడౌన్ లు మంజూరు అయినప్పటికీ భూసేకరణ పూర్తికాని ప్రాంతాల్లో , ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని కోరారు.ఇందుకు గాను స్థానిక శాసన సభ్యులు,జిల్లా మంత్రులతో చర్చించాలని మార్కెటింగ్ అధికారులను హరీశ్ రావు ఆదేశించారు.ప్రైవేట్ గోడౌన్ లలో 4 లక్షల మెట్రిక్ టన్నుల సరకులు ఉండడం పట్ల మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్‌పై కేబినెట్ సబ్ కమిటీ ఈ నెల 6న సమావేశం అవుతున్నందున నాబార్డు,మార్కెటింగ్, హార్టీకల్చర్ సంస్థలు ఉమ్మడిగా ఈ అధ్యయనం చేయాలని కోరారు.ఏ ప్రాంతం లో ఎక్కువగా ఏ పంట పండిస్తున్నారు,దిగుబడి ఎంత వస్తున్నది,ఆ ప్రాంతా ల్లో ఉన్న సాగునీటి వసతి,మార్కెటింగ్ సదుపాయాలపై ఒక నివేదిక సమర్పించాలని హరీశ్ రావు సూచించారు. మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి,హా జాయింట్ డైరెక్టర్లు లక్ష్మణుడు, మార్కెటింగ్ ఎస్.ఇ. ఉమామహేశ్వరరావు, జె.డి.రవికుమార్, వరంగల్ ఇంచార్జ్ జె.డి. శ్రీనివాస్, మార్క్ ఫెడ్, హాకా, నాబార్డు, వేర్ హౌజింగ్ తదితర శాఖలహా అధికారులు పాల్గొన్నారు.

కెసిఆర్‌కు మోడీ తప్ప గత్యంతరం లేదు

- **మహబూబ్‌నగర్ నుంచే పోటీ చేస్తా**
- **కాంగ్రెస్ సీనియర్ నేత జైపాల్‌రెడ్డి**



మన తెలంగాణ/ హైదరాబాద్ : బిజెపిని, ప్రధానమంత్రి మోడీని సిఎం కెసిఆర్ తూలనాడడం, బిజెపితో పోరాటాలు చేస్తామని ప్రగల్భాలు పలకడం అంతా వట్టిదేనని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు బిజెపి, మోడీ తప్ప మరో గత్యంతరం లేదని, వచ్చే ఎన్నికల ముందు కలవకపోయినా ఎన్నికల తరువాత టిఆర్‌ఎస్‌కు వచ్చే రెండో మూడో ఎంపి సీట్ల మద్దతును బిజెపికే ఇస్తారని ఆయన జోస్యం చెప్పారు. తాను మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచే పోటీ చేస్తానని, తనకు జాతీయ రాజకీయాలు అంటేనే ఇష్టమని చెప్పారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన వివరించారు. గాంధీభవన్‌లో శనివారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఇటీ వల కెసిఆర్ కేంద్రంపైన, ప్రధానమంత్రి నరేంద్ర మోడీపైన కుస్తీ చేసినట్టు నటిస్తున్నారని, అది కేవలం లాలూచీనని, ఇది నిజమైన పోరాటం కాదన్నారు. అది కేవలం రెండు పార్టీల లాలూచి కుస్తీనేనని, ఇది ప్రగతిశీల శక్తులను, అల్ప సంఖ్యాక వర్గాలను మోసం చేసేందుకు చేసే కుట్రలో భాగ మని విమర్శించారు. టిఆర్ ఎస్ అవకాశవాద పార్టీ, కెసిఆర్ రాజకీయ అవకాశవాది ఆయన మోడీనే కాదు, రాహుల్ గాంధీని కూడా ఏకవచనంలో సంబోధించారని ఆయన అవకాశమున్నట్టు మాట్లాడుతారని ఏద్దేవా చేశారు. ఎప్పటికైనా టిఆర్ ఎస్‌తో బిజెపితో కలిసిపోతుందని ఆ రెండు పార్టీలు ఒక్కటేనని ఆయన అన్నా రు. 2014లో కూడా బిజెపితో పొత్తు పెట్టుకునేందుకు, కలిసి పనిచేసేందుకు కెసిఆర్ దాదా పు బతిమాలాడరని, అయినా బిజెపి తిరస్కరించిందని ఆయన అన్నారు.


సాహితీవేత్త ప్రఫుల్ల దాస్ కన్నుమూత

కేంద్రపారాగా : సాహితీవేత్త ప్రఫుల్ల దాస్ శనివారం మృతి చెందారు. ఒడిషాలోని కేంద్రపారా జిల్లాలో రాజ్‌కనికాలోని ఆయన నివాసంలో ఆయన చనిపోయినట్లు కుటుం బ సభ్యులు తెలిపారు. బ్రహ్మచారిగా ఉన్న దాస్ వయోవృద్ధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాహితీరంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రఫుల్ల దాస్‌కు ప్రతిష్టాత్మక సరళ పురస్కారం లభించింది. రాజులు, జమిందార్లపై రైతాంగ పోరాటం వంటి ఇతివృత్తాలతో సాగిన ఆయన రచనలకు విశేష స్పందన లభించింది. దేశ స్వాతంత్రోద్యమ చరిత్ర విశ్లేషణలతో కూడిన రచనలు కూడా చేశారు. వామపక్ష భావజాలంలో ఆయన చేసిన రచనలు అణగారిన వర్గాలకు ఆశాదీపాలుగా మారాయని ఆయన మృతి పట్ల ఒడిషా సిపిఎం సంతాపం వ్యక్తం చేసింది.



సర్పంచ్‌ల సమ్మేళనం

మహబూబ్‌నగర్: పట్టణంలోని అప్పన్నపల్లిలోని వైట్ హౌజ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల సర్పంచుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి మంత్రి జూపల్లి , ఎంపీ జితేందర్ రెడ్డి, ఎంఎల్సీ కసిరెడ్డి, జెడ్పీ చైర్మ న్ భాస్కర్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, పంచాయతీ రాష్ట్ర కార్యదర్శి నీతు ప్రసా ద్, హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి జూపల్లి, మిషన్ భగీరథతోనే తాగునీటికి శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.



"స్వతంత్రంగా ఆలోచించే స్త్రీ మాత్రమే ఎవరూ చేరలేని గమ్యాన్ని చేరగలదు. – ఐన్‌స్టీన్"

సంపాదకీయం

త్రిపుర మార్పు

శనివారం నాడు ప్రకటించిన మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఊహించిన దానికి భిన్నంగా లేవు. ఇటీవల కొంత కాలంగా వెలువడుతున్న అంచనాలను బట్టి ముందుగా అనుకున్నదే అయినప్పటికీ త్రిపురలో సిపిఐ(ఎం) ఓటమి వామ కేంద్రక ప్రజాస్వామిక వాదులకు, ప్రగతిశీల శక్తులకు ఒకంతట మింగుడుపడనిది. త్రిపుర సిపిఐ(ఎం) కంచుకోటగా చరిత్రకెక్కింది. దాని చిరకాల ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అతి నిరాడంబర జీవనశైలి, మచ్చలేని వ్యక్తిత్వం, పాలనల సమ్మోహక శక్తికి గాఢంగా ఆకర్షితమైన రాష్ట్రం త్రిపుర. బిజెపి ఏమి చేసింది, ఎలా సాధించింది, అది ఎటువంటి పార్టీ అనే వాటిని పక్కనబెట్టి ఆలోచిస్తే త్రిపుర విజయం దాని కిరీటంలో కలికితురాయి వంటిదని అంగీకరించక తప్పదు. ప్రజల తీర్పును వారి అభీష్టానికి రుజువుగానే తీసుకోవాలి.

20ఏళ్లుగా త్రిపురకు అవిచ్ఛిన్నమైన పాలనను అందించిన మాణిక్ సర్కార్ వ్యక్తి గత జీవనశైలి ప్రపంచాన్ని ఆకట్టుకున్నది. ముఖ్యమంత్రిగా తనకు వచ్చిన వేతనాన్ని మొత్తం పార్టీకి ఇచ్చేసేవారు. అది ఇచ్చే కేవలం 2వేల రూపాయలతో జీవనం సాగించేవారు. ఆయన బ్యాంకు ఖాతాలో నిల్వ 2వేల రూపాయలే. అగర్తలా శివారుల్లో సోదరితో కలిసి సొంతం చేసుకున్న చిన్న స్థలం ఆయన సంపద. మాణిక్ సర్కార్ పాలన కూడా అసమానమైనదేనని అనిపించింది. సరిహద్దు రాష్ట్రం కావడంవల్ల సీమాంతర ఉగ్రవాదం, తిరుగుబాట్లకు ఆలవాలమైన త్రిపురలో శాంతిని, మతసామరస్యాన్ని నెలకొల్పారని, సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేసిన తొలి ముఖ్యమంత్రి అని ఆయన పేరు తెచ్చుకున్నారు. అవినీతి చెలరేగకుండా చూశారు. దాదాపు 90శాతం అక్షరాస్యతను సాధించారు. భూతల స్వర్గాలు, కష్టాలు లేని కాపురాలు అనే ఆదర్శాల డొల్లతనం తెలిసిందే. అంత కాకపోయినా, ఉన్నంతలో దేశంలోనే మంచి ముఖ్యమంత్రి అనిపించుకున్న మాణిక్ సర్కార్ సారథ్యంలో సిపిఎం ఇంత సుదీర్ఘకాలం తరువాత అక్కడ ఓటమి చెందడం మతతత్వ శక్తిగా ముద్రపడిన భారతీయ జనతాపార్టీ చేతిలో పరాజయం పాలవడం విశేష పరిణామమే. అన్ని మతతత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేయడంలో వైఫల్యం ఫలితమనుకోవాలి.

వ్యక్తుల మంచితనం ప్రజలపై సమ్మోహనశక్తిగా పనిచేయడం ఎల్లవేళలా సాధ్యం కాదని, స్వతహాగా ఎవరు ఎంతటి గొప్పవారైనా కాలానుగుణమైన, మెరుగైన పాలన ఇవ్వలేకపోతే ఓటమి తప్పదని త్రిపుర పరిణామం రుజువు చేస్తున్నది. మంచివాడేకాని సత్వర మార్పు తేలేకపోతున్నాడనే అభిప్రాయం మాణిక్ సర్కార్ గురించి వ్యతిరేక ప్రచారం తీవ్రంగా జరిగి ఉండాలి. అయిదేళ్ల క్రితం 2013లో జరిగిన ఎన్నికల నాటికే ఈ అసంతృప్తి కొంత చోటుచేసుకుని కాంగ్రెస్ పార్టీకి పరిస్థితి అందివచ్చినా దానిని అది పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయింది. త్రిపురలో గత ఎన్నికలలో ఒక సీటు గెలుచుకోలేకపోయినా బిజెపి ఈసారి పాలక పార్టీగా అవతరించటానికి కేంద్రంలో అది అధికారంలో ఉండడం, దాని వెన్నుదన్ను సైద్ధాంతిక మార్గదర్శి అయిన ఆర్ఎస్ఎస్ చేసిన బలమైన క్షేత్రస్థాయి కృషి దోహదపడ్డాయని చెప్పవచ్చు. ఉద్యోగులు, యువతరం ఆశలు, ఆకాంక్షలకు అనువైన పెద్దపెద్ద వాగ్దానాలు చేయడం వంటివి కూడా కారణం అయివుండవచ్చు.

మేఘాలయలో కాంగ్రెస్ ఈసారి తిరుగులేని శక్తిగా అవతరించి, అధికారం చేజిక్కించుకుంటుందన్న అంచనాలు పూర్తిగా వాస్తవం కాలేదు. అక్కడ అది మళ్లీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇంకొకసారి హంగ్ అసెంబ్లీ ఏర్పాటు కావడం అనివార్యంగా కనిపిస్తున్నది. మేఘాలయలో ఈసారి 21స్థానాలు తెచ్చుకున్న కాంగ్రెస్ తో పోటాపోటీగా నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పిపి)12 సీట్లు గెలుచుకోవడం విశేషం. నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి గట్టి పోటీ ఇస్తుందని ఎదురు చూస్తున్న కాంగ్రెస్ ఈ మూడురాష్ట్రాల అందుకు అవసరమైన స్థాయిలో తనకుతాను రుజువు చేసుకోలేకపోవడం గమనార్హం.


ప్రముఖుల డిగ్రీల మాయ

చూపు

ప్రపంచంలో ఏ ప్రధానమంత్రి చేయని పని మోడీజీ చేశారు. ఆయన విద్యార్థుల కోసం ఒక పుస్తకం రాశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులు పరీక్షలను ఎదుర్కొనే ఒక పాతిక చిట్కాలు, సలహాలు, సూచనలతో రాసిన పుస్తకం ఇది. చాలా గొప్ప పని చేశారు కదా. పిల్లలకు చదువుల ఒత్తిడి చాలా ఉంది. మరి మోడీజీ స్వయంగా పరీక్షల ఒత్తిడి ఎలా ఎదుర్కొని ఉంటారో? ఆయన ఈ చిట్కాలు పాటించే ఉంటారు. పరీక్షలు పాసయ్యే ఉంటారు. డిగ్రీ సాధించే ఉంటారు. కాని దురదృష్టమేమంటే, ఆయన డిగ్రీ పెద్ద సస్పెన్సు గా మారింది.

మొన్న ఢిల్లీ విశ్వవిద్యాలయం హైకోర్టుకు చెప్పిన మాటతో ఈ సస్పెన్సు మరికాస్త పెరిగింది. 1978 సంవత్సరంలో బి.ఎ.పరీక్షలు రాసిన విద్యార్థుల వివరాలు చెప్పలేమని, విద్యార్థుల నమ్మకాన్ని కాపాడవలసిన బాధ్యత తమపై ఉంటుందని చెప్పింది. 1978 సంవత్సరంలోనే మన ప్రధానమంత్రిగారు ఆ విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ.పాసయ్యారని చెబుతున్నారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ చట్టం క్రింద అంజలీ భరద్వాజ్, నిఖిల్ డే, అమృతా జోహరీలు దాఖలు చేసిన పిటీషనుకు ప్రతిస్పందనగా ఢిల్లీ విశ్వవిద్యాలయం ఈ మాటలు చెప్పింది. కేంద్ర సమాచార కమీషన్ 2016లో విశ్వవిద్యాలయానికి ఒక ఉత్తర్వు జారీ చేస్తూ 1978 సంవత్సరం విద్యార్థుల రికార్డులు పరిశీలించే అవకాశం కల్పించింది. ఈ అవకాశం ఇచ్చిన వారు మాడభూషి శ్రీధర్. ఆ వెంటనే ఆయన్ను అక్కడి నుంచి తప్పించేశారు. ఇప్పుడు యూనివర్శిటీ అధికారులు ప్రైవసీ సాకు చూపించి ఆ రికార్డులు చూపించలేం అంటున్నారు. ప్రధాని మోడీ డిగ్రీ గురించి ఇంత దాపరికం ఎందుకు? ఫిబ్రవరి 28వ తేదీన ఢిల్లీ యూనివర్శిటీ హైకోర్టుకు ఈ విషయం తెలియజేసింది. దీంతో ప్రధాని మోడీ గారి డిగ్రీ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఎగ్జామ్ వారియర్ నిజంగానే పరీక్షల యోధుడా కాదా అన్న సందేహం మొదలైంది. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ., గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ. చేసినట్లు చెబుతున్నారు. ఈ రెండు విశ్వవిద్యాలయాలు కూడా మోడీ తమ దగ్గర చదువుకున్నారని ప్రకటనలు ఇచ్చాయి. కాని అందుకు సంబంధించిన రికార్డులు చూపించడానికి మాత్రం సిద్ధంగా లేవు. ఆయన ప్రమాణ పత్రాల్లో పేరు, పుట్టినతేదీ, చివరకు ఆయన స్పెషలైజేషన్ "ఎంటైర్ పొలిటికల్ సైన్సు" వీటి గురించి చాలా అనుమానాలు చాలామందిలో ఉన్నాయి. ఇది విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠకు, విశ్వసనీయతకు సంబంధించిన సమస్యగా ఇప్పుడు మారింది.

చట్టపరంగా చూస్తే ప్రధాని మోడీ విశ్వవిద్యాలయంలో చదువుకోవలసిన అవసరమేమీ లేదు. భారత ప్రధానికి విద్యార్హతలుండాలన్న నియమం ఏదీ లేదు. కాని ప్రతిజ్ఞ చేసి అబద్దం చెప్పడం అన్నది చట్టవిరుద్ధమే అవుతుంది. ఒక వివాదం తలెత్తిన తర్వాత దానిపై విచారణ జరిగి సందేహాలు లేకుండా చేయాలి. అప్పుడే విశ్వసనీయత పెరుగుతుంది. ఇప్పుడు ఈ విశ్వవిద్యాలయాలు గోపనీయతను పాటిస్తూ, రికార్డులు చూడ్డానికి వీల్లేదనడంతో వాటి విశ్వసనీయత ప్రశ్నార్థకమైపోయింది. అనేకమంది విద్యార్థులు కష్టపడి ఈ విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు పొందుతున్నారు. వారందరి సర్టిఫికేట్లపై ఇప్పుడు అనుమానాలు రావచ్చు. ఇది కేవలం భారతదేశానికి సంబంధించిన సమస్య అనుకుంటే పొరబాటు. భారత విశ్వవిద్యాలయాల విశ్వసనీయత విదేశాల్లో చాలా ముఖ్యం. లేకపోతే ఇక్కడ చదువుకున్న విద్యార్థుల పట్ల విదేశాల్లో అనుమానాలు మొదలవుతాయి. విదేశాల్లో ఉద్యోగాలు వెదుక్కునే వారికి సమస్యలు ప్రారంభం కావచ్చు. రాజకీయాధికారం ఉన్న కొందరి వివాదాల కారణంగా కష్టపడి చదువుకున్న విద్యార్థుల డిగ్రీలు కూడా అనుమానాస్పదంగా మారడం వాంఛించదగ్గ పరిణామం కాదు. తమ దగ్గర చదువుకున్నారని చెప్పిన తర్వాత రికార్డుల పరిశీలనకు విశ్వవిద్యాలయం అనుమతించకపోవడం, వివాదాస్పదమైన తర్వాత కూడా అనుమతి నిరాకరించడం అనుమానాలకు తావిస్తోంది. మన మీడియా కూడా భజన చేయడం తప్ప ఇలాంటి వివాదాల విషయంలో అంతర్జాతీయంగా ప్రతిష్ఠ దెబ్బతింటున్న సమస్యల్లో నోరెత్తకుండా ఉంటుంది.



ఇలాంటి పరిస్థితే మన పొరుగుదేశం పాకిస్తాన్ లోను వచ్చింది. 2008లో పర్వేజ్ ముషర్రఫ్ ఎన్నికల చట్టాల్లో మార్పులు చేసి పార్లమెంటు సభ్యులకు కనీసం యూనివర్శిటీ డిగ్రీ విద్యార్హత ఉండాలని చట్టం చేశారు. 2010లో పాకిస్తాన్ మీడియా 54 మంది పలుకుబడి కలిగిన పార్లమెంటు సభ్యుల డిగ్రీలు ఫేక్ అని బయటపెట్టింది. వెంటనే అక్కడి సుప్రీంకోర్టు దీనిపై దృష్టిపెట్టి విచారణకు ఆదేశించింది. అప్పట్లో ఈ విచారణను అక్కడి విద్యాశాఖమంత్రి కూడా ఎదుర్కొన్నాడు. 2012లో మళ్ళీ చట్టాన్ని మార్చి పార్లమెంటుకు పోటీ చేయడానికి విద్యార్హతలు అవసరం లేదని తీసేశారు. కాబట్టి దొంగ డిగ్రీల వ్యవహారం సద్దుమణిగింది. ఒక ఉన్నత విద్యాసంస్థ ఇచ్చే డిగ్రీ సక్రమమైన మార్గాల్లో ఇచ్చిన డిగ్రీ అన్న విశ్వసనీయత చాలా ముఖ్యం. అప్పుడే ప్రపంచంలో దానికి విలువ ఉంటుంది. లేకపోతే మొత్తం దేశంలోని విద్యావ్యవస్థ విశ్వసనీయత దెబ్బతింటుంది.

కీన్యాలో రాజకీయ నాయకులకు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవడం సరదా. అసలు యూనివర్శిటీ ముఖం చూడకపోయినా డాక్టర్ అని తగిలించుకుంటారు. కీన్యాలో కౌంటీ గవర్నరు కావాలంటే డిగ్రీ పాసై ఉండాలి. 2013లో కీన్యాలో హయ్యర్ ఎడ్యుకేషన్ కమీషన్ బడా బడా రాజకీయ నాయకులకు కూడా దొంగ సర్టిఫికేట్లు ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెప్పేసింది. ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా కీన్యా విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను పెంచింది. ఇరాన్ లో 2008లో చాలా పలుకుబడి ఉన్న కేబినేట్ మంత్రి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ఇచ్చిన డిగ్రీగా దొంగ సర్టిఫికేటు చూపించినందుకు పార్లమెంటు ఆయన్ను పదవి నుంచి బహిష్కరించింది. దొంగ సర్టిఫికేట్లన్నవి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. కాని వాటి పట్ల ఎలా వ్యవహరిస్తామన్నది దేశంలో విద్యావ్యవస్థ విశ్వసనీయతకు చాలా ముఖ్యం. ఏప్రిల్ 2012లో హంగరీ అధ్యక్షుడు పాల్ షీమిట్ రాజీనామా చేయవలసి వచ్చింది. ఎందుకంటే, ఆయన చదువుకున్న సిమ్మెల్ వెల్ విశ్వవిద్యాలయంలో ఆయన సమర్పించిన పిహెచ్ డీ థీసిస్ లో వేరే పుస్తకాల నుంచి కాపీ చేసి రాసిన పేరాగ్రాఫులున్నాయని విశ్వవిద్యాలయం గుర్తించి, ఆయన పిహెచ్ డీని రద్దు చేయడం. జర్మనీలో రక్షణ మంత్రి కార్ల్ థియోడర్ జు గుటెన్ బర్గ్ కూడా ఇదే కారణంతో తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. యాంజిలా మార్కెల్ కు వారసుడిగా చాన్సలర్ కావలసిన స్థాయిలో ఉన్నప్పుడు జరిగిన వ్యవహారం ఇది. జర్మనీలోనే అన్నెట్ షావాన్ విద్యామంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. 2008లో వర్జీనియా విశ్వవిద్యాలయం ఒక కౌంటీ గవర్నర్ కుమార్తెకు అక్రమంగా డిగ్రీ ఇచ్చిందన్న ఆరోపణల తర్వాత యూనివర్శిటీ ప్రెసిడెంటుతో సహా అనేకమంది రాజీనామాలు చేయవలసి వచ్చింది.

టర్కీ అధ్యక్షుడు తయ్యిబ్ ఎర్దోగాన్ మార్మారా యూనివర్శిటీ నుంచి డిగ్రీ తీసుకున్నట్లు చెప్పుకున్నారు. కాని ఆయన హైస్కూలు చదువు ఇమామ్ హాతిప్ స్కూలులో చదివారు. ఇమామ్ హాతిప్ స్కూలు మార్మారా విశ్వవిద్యాలయంలో చదివే అనుమతి విద్యార్థులకు ఇవ్వదు. కాబట్టి ఆయన డిగ్రీపై అనుమానాలున్నాయి. టర్కీ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడికి కనీసం డిగ్రీ విద్యార్హత ఉండాలి. ఆరోపణ రుజువైతే ఆయన రాజీనామా చేయాల్సిందే. కాని తయ్యిబ్ ఎర్దోగాన్ దాదాపు నియంతలా టర్కీని పాలిస్తున్నారు. కాబట్టి విచారణ ముందుకు సాగడం లేదు. మోడీ ప్రభుత్వం కూడా అదేబాటలో నడుస్తుందా?

* సబా

కొత్త పిఆర్‌సి వేయండి



మేకిరి దామోదర్
9573666650

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిలా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు 10 సం॥లకు ఒకసారి, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు 5 సం॥రాలకు ఒకసారి వేతనాలను పెంచడానికి వీలుగా ఆయా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక, వస్తు వినిమయాన్ని మార్కెట్ ధరలను అంచనా సిఫారసు చేయడానికి వేతన (స్థిరీకరణ) సవరణ సంఘాన్ని నియమించి గడువును విధించాల్సి ఉంది. ఆ లోపు పి.ఆర్.సి. (పే రివిజన్ కమీషన్) వారు సమకాలీన ఆర్థిక, స్థితిగతులకు మారిన ధరలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుంది. ఆ తర్వాత ప్రభుత్వం వేతనాల స్థిరీకరణకు పూనుకుంటుంది. పదో పి.ఆర్.సి. బకాయిలనే ఈ ఏడాది డిసెంబర్ వరకు 18 దఫాలు గా నిర్ణయించారు.

వాస్తవంగా 2018 జులై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 11వ పి.ఆర్.సి. అమలు కావాల్సి ఉంది. ఉద్యోగులు గతంలో తాము నష్టపోయిన వివరాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని పోవాలని భావిస్తున్నారు. 1974 పి.ఆర్.సి.లో 60 నెలలు, 1978లో 13 నెలలు, 1986లో 30 నెలలు, 1993లో 30 నెలలు, 1999లో 21నెలలు, 2005లో 23 నెలలు, 2010లో 21నెలలు, 2015లో 13 నెలలు, ఇలా 1958 నుండి నేటి వరకు 211 నెలలు అంటే సుమారు 3 పి.ఆర్.సి.లకు పైగా ఆర్థికపరమైన నష్టాన్ని భరిస్తున్న వాస్తవాన్ని కాదనగలరా! ప్రభుత్వా లు కావాలని అనేక అసంబంధమైన కొర్రీలను సాకుగా చూపుతూ ఉద్యోగుల కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం న్యాయమా! 30సంవత్సరాలకు పైగా వృత్తిలో సేవలందించే వారికి మీరిచ్చేది ఇదేనా ?

తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించడానికి సుదీర్ఘ పోరాటాలు జరిపినాము. తొలిదశ ఉద్యమం నాటి నుండి 2014 తెలంగాణ రాష్ట్రం సాధించేవరకు జరిగిన అవిశ్రాంత ఉద్యమ పోరాటంలో ఉద్యోగుల పాత్ర చాలా కీలకమైనదని గతంలో అనేకసార్లు ముఖ్యమంత్రి గారు ప్రకటించారు. నాడు.. ఉద్యమ జ్వాలలు సబ్బండ వర్ణాలకు చేరుటకు తెలంగాణ ప్రజలను జాగృతి పరుచుటలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిది.(ఫ్రెండ్లీ గవర్నమెంట్) పి.ఆర్.సి. వేయడానికి, ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కాలయాపన చేయడం వలన ఆయా వర్గాలు అభద్రతకు లోనవుతున్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పాలనలో భారతదేశంలోనే మొదటి స్థానం(ముందంజ)లోని వెల్లడాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెప్పడం అభినందనీయం. దీనికి ప్రధాన కారకులైన ఉద్యోగుల వేతన సవరణ(స్థిరీకరణ)సంఘాన్ని వేయడాన్ని ఎందుకు కాలయాపన చేస్తున్నారు. జనవరి 2018లోనే పి.ఆర్.సి. నియామకమంటూ కమీషనర్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, సుమారు 3 పి.ఆర్.సి.లకు పైన ఉద్యోగులు ఆర్థికనష్టాన్ని మోయవల్సి వస్తుంది. సంఘాలు మౌనదీక్ష వీడరా! ఉద్యోగుల పక్షాన ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనమండలి సభ్యులు మౌనం వీడండి. మీకు పదవులు కట్టబెట్టిన ఉద్యోగుల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించండి. మీ ఉదాసీన వైఖరుల వలన మూడు పి.ఆర్.సి.లకు పైగా ఆర్థిక నష్టంతోపాటు, సమస్యలు చాంతాడులా పెరిగిపోతున్నాయి.

రాష్ట్రప్రభుత్వం వేతన సవరణ (స్థిరీకరణ) సంఘం (పే రివిజన్ కమీషన్)ను నియమించిన తర్వాత ఉద్యోగు(సంఘా)లతో అనేక దఫాలు చర్చించడం వారి విన్నపాలను పరిశీలించడం, ఆర్థిక శాఖలను వినియోగ వస్తువుల ధరలను అంచనా వేయడం గతంలోని లోటుపాట్లను సవరిస్తూ, ప్రస్తుతం వారికి జరుగుతున్న నష్టాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఇస్తుంది. దీనికి 6 నెలల నుండి ఒక సంవత్సరం పడుతుంది. ఈలోగా ఐ.ఆర్(ఇంటీరియల్ రిలీఫ్ ఫండ్) ను ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు చర్చలు జరిపి ప్రకటిస్తారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ఉద్యోగులకు కాలపరంగా గాని, ఆర్థిక పరంగా గాని నష్టం జరగకుండా! నిర్ణయాలు ప్రకటించాల్సిన బాధ్యత ఉంది. ఎలాగు కేంద్రప్రభుత్వం వారు ఆదాయపన్ను మినహాయింపులో ఉద్యోగులకు ఎలాంటి వెసులుబాటు కల్పించలేకపోవడం, ఉద్యోగవర్గాల్లో నిరాశకు గురిచేసింది. పాలకులు ప్రతి ఆరు మాసాలకు మార్కెట్ ధరల ప్రకారం ఇవ్వాల్సిన డి.ఎ.లను కూడా ఒక వరంగా భావించడం, యథాలాపంగా రావలసిన వాటికి కూడా ఉద్యోగులు పోరాటాలు చేయాల్సి రావడం పాలకులకు క్షేమం కాదు. ప్రజల నుండి పాలకులు ఉద్యోగులను వేరుచేసి చూపడం ఆపాలి. ఉద్యోగు లు వృత్తి నిబద్ధతతో అవినీతి రహితంగా పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేసినవారుగా, పాలకులకు పేరుతెచ్చిన వారుగా గుర్తింపు పొందుతారు. కొలిక్కి రాని ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ రావణకాష్టంగా మారింది. కోర్టుల చుట్టూ తిరుగుతున్న విద్యాశాఖ అధికారులు, దీని మూలంగా పదోన్నతులు రాక ఏళ్లుగా ఎదురుచూస్తున్న వైనం మారదాయె? అనుబంధంగా పండిట్ లు, పి.ఇ.టి.ల సమస్యలతో పాటు ఇంకా అనేక సమస్యలు అలాగే అపరిష్కృతంగా ఉన్నాయి, 2004 రాష్ట్ర ప్రభుత్వం నియామకాల్లో సి.పి.ఎస్. విధానంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ అన్ని శాఖల్లోని ఉద్యోగులకు బతుకు గుదిబండగా మారి, పోరాటాలు నిత్యకృత్యంగా మారడం నిజం కాదా ! ఈ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు తోసేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాల జీవితాలు (పదవి విరమణ) మరణించిన వారికి వచ్చే పెన్షన్ చూస్తే సామాజిక వర్గాలకు ఇచ్చే పెన్షన్ కంటే తక్కువ వస్తుందని బోరుమని విలపిస్తూ రోడ్డునపడ్డారు. నేడు దీనికి అన్ని వర్గాల మద్దతును కూడగడుతున్నారు. 30సంవత్సరాలకుపైగా ఉద్యోగాల సేవల నందించిన సగటు ఉద్యోగి కనీసం ఒక సొంత ఇల్లును కట్టుకోలేని స్థితిలో జీవితాలను వెళ్లదీస్తుంది నిజం కాదా! ఉద్యోగులకు సొంత ఇంటికల కలగానే మిగిలింది కాదనగలరా! నిరుద్యోగులకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి తక్షణమే భర్తీ చేసి వారి చిరకాల వాంఛను తీర్చవలసిన బాధ్యత పాలకులది. స్వరాష్ట్ర పోరాట ఫలాలు అందేలా చేయడానికి వెంటనే పూనుకొని నిరుద్యోగులకు జీవితాల్లో వెలుగులు నింపాలి. దళిత గిరిజన, వెనుకబడిన వర్గాల వారు ఉద్యోగ నియామకాల్లో వయస్సు వెసులుబాటు వలన ఆలస్యంగా చేరినందున వారికి ఉద్యోగ సర్వీసు కాలం స్వల్పంగా ఉండడంతో ఆర్థిక ప్రయోజనం పూర్తి స్థాయిలో పొందలేకపోవుచున్నారు. కావున ఈ పి.ఆర్.సి. కమీషన్‌లో ఉద్యోగుల వయస్సును 60ఏండ్లకు పెంచాలని భావిస్తున్నారు. అదే విధంగా ఉద్యోగ పదవి విరమణలో పొందే (ఫుల్ పెన్షన్) పూర్తి స్థాయి ప్రయోజనాలు పొందుటకు స్లాబులను తగ్గించాల్సి ఉందని పై తరగతుల వారు భావిస్తున్నారు. దశలవారీగా అభివృద్ధిలో రాష్ట్రం ముందుకు దూసుకుపోతున్న వేళ... అందులో భాగస్వాములైన ఉద్యోగులకు ఇచ్చిన మాటలకు కట్టుబడి వాటిని పరిష్కరిస్తూ 11 పి.ఆర్.సి. వెంటనే వేసి కాలయాపన జరగకుండా ఐ.ఆర్. ప్రకటించి 2018 జులై 1 ప్రామాణికంగా ముందుకెళ్లి గత పాలకుల్లా కాలం వృథా చేయరాదని ఆశిస్తున్నారు. నూతనంగా రాష్ట్రం ఏర్పడి ఆత్మగౌరవ పాలనలో అభివృద్ధి పథాన నడు(పి)స్తున్న సందర్భంగా కొత్తగా వేసే 11వ పి.ఆర్.సి.పైన ఉద్యోగుల కుటుంబాలు పాలకులపై సంపూర్ణ విశ్వాసంతో సానుకూల నిర్ణయాలు వస్తాయని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

30సంవత్సరాలకుపైగా ఉద్యోగాల సేవల నందించిన సగటు ఉద్యోగి కనీసం ఒక సొంత ఇల్లును కట్టుకోలేని స్థితిలో జీవితాలను వెళ్లదీస్తుంది నిజం కాదా! ఉద్యోగులకు సొంత ఇంటికల కలగానే మిగిలింది కాదనగలరా! నిరుద్యోగులకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి తక్షణమే భర్తీ చేసి వారి చిరకాల వాంఛను తీర్చవలసిన బాధ్యత పాలకులది. స్వరాష్ట్ర పోరాట ఫలాలు అందేలా చేయడానికి వెంటనే పూనుకొని నిరుద్యోగులకు జీవితాల్లో వెలుగులు నింపాలి. దళిత గిరిజన, వెనుకబడిన వర్గాల వారు ఉద్యోగ నియామకాల్లో వయస్సు వెసులుబాటు వలన ఆలస్యంగా చేరినందున వారికి ఉద్యోగ సర్వీసు కాలం స్వల్పంగా ఉండడంతో ఆర్థిక ప్రయోజనం పూర్తి స్థాయిలో పొందలేకపోవుచున్నారు. ఈ పి.ఆర్.సి. కమీషన్‌లో ఉద్యోగుల వయస్సును 60 ఏండ్లకు పెంచాలని భావిస్తున్నారు. అదే విధంగా ఉద్యోగ పదవి విరమణలో పొందే (ఫుల్ పెన్షన్) పూర్తి స్థాయి ప్రయోజనాలు పొందుటకు స్లాబులను తగ్గించాల్సి ఉందని పై తరగతుల వారు భావిస్తున్నారు.

1) 1958 పి.ఆర్.సి. (1) వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల జీతాల మధ్య వ్యత్యాసం తొలగింపు యన్.జి.జి.ఓలకు రూ॥5% ఎక్కువ సిఫారసు చేయాలి.

2) 1961 డి.ఎ.మెర్జ్‌డ్ స్కేళ్లు ఉపాధ్యాయుల వేతనం యన్.జి.జి.ఓల జీతాలు సమానం చేయాలి.

3) 1969 పి.ఆర్.సి. (2) ఉపాధ్యాయుల వేతనం యన్.జి.జి.ఓల జీతాల కన్నా ఒక స్టేజిపైన నిర్ణయం, పే స్కేల్సులో (ఈ.బి.) తొలగింపు.

4) 1974 పి.ఆర్.సి. (3) ఉపాధ్యాయుల వేతనం యన్.జి.జి.ఓల జీతాలతో సమానం చేయాలి.

5) 1978 పి.ఆర్.సి. (4) ఉపాధ్యాయుల వేతనం యన్.జి.జి.ఓల జీతాలకన్నా ఒక స్టేజిపైన తేవాలి.

6) 1982 (రీగ్రూపింగ్ స్కేల్సు) ఉపాధ్యాయులకు రీ గ్రూప్‌డ్ స్కేల్స్ జి.ఓ.1000 (ఎస్) విడుదల 19 రకాల స్కేళ్లను 3 కేటగిరీలుగా కుదింపు.

7) 1986 పి.ఆర్.సి.(5) ఉపాధ్యాయులకు రీగ్రూపింగ్ స్కేళ్లకు ఆమోదం.

8) 1993 పి.ఆర్.సి. (6) మాస్టర్ స్కేళ్ల ప్రతిపాదన ఫిట్‌మెంట్ 10%.

9) 1999 పి.ఆర్.సి. (7) ఐ.ఆర్.11%, ఫిట్‌మెంట్ 25%.

10) 2005 పి.ఆర్.సి.(8) నష్టపోయిన పి.ఆర్.సి., ఐ.ఆర్. 8.5%, ఫిట్‌మెంట్ 16%, ఆర్థిక లాభం 2 నెలల తర్వాత.

11) 2009 పి.ఆర్.సి. (9) టీచర్లకు ప్రత్యేక స్కేళ్లు ఎన్.జి.ఓల కన్నా 2,3 స్కేల్సుపైన, అప్రెంటిస్ విధానం రద్దుకు ప్రతిపాదన, పెన్షనర్ బతికి ఉండగా భార్య మరణిస్తే అంత్యక్రియల ఖర్చు చెల్లింపు సిఫార్సు.

12) 2015 పి.ఆర్.సి. (10) తెలంగాణ రాష్ట్రంలో మొదటి పి.ఆర్.సి. ఫిట్‌మెంట్ 43% (తెలంగాణ ఇంక్రిమెంట్). ఉండాలి.

అగ్రవర్ణాలకే అక్షయ పాత్ర?

"ప్రజాస్వామ్యానికి మరో పేరు సమానత్వం" అంటారు డా.బి.ఆర్. అంబేద్కర్, అంటే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు చేసే ప్రతి పని (ఆర్థికం కానీ రాజకీయం కానీ) బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమే కావాలి. ఎవరైతే ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగాల పరంగా వెనుకబడి ఉన్నారో వాళ్ళ కోసం పని చేయడమే ప్రజాస్వామ్యం. తెలంగాణలో దళితులు, బిసిలు, ఎస్‌టిల (మైనార్టీల దగ్గరున్న భూమి చాలా తక్కువ) దగ్గర అర ఎకరం మొదలుకొని ఒక ఎకరం, రెండు ఎకరాల భూమి చిన్న చిన్న కమతాలరూపంలో వుంది. 14శాతం మంది అగ్ర వర్ణాల దగ్గర పెద్ద కమతాలున్నాయి. అయిదు ఎకరాల నుండి ముప్పై ఎకరా లు అంత కంటే ఎక్కువ భూమిని కలిగిన కుటుంబాలు కూడా ఉన్నాయి. దీనివల్ల 'లక్ష్మీపుత్రులకు' సంవత్సరానికి వేలల్లో, లక్ష ల్లో ఈ పథకం ద్వారా డబ్బులు వస్తాయి. క్రింది కులాలకు అందే సాయం అరకొరగానే ఉంటుంది. ఈ విషయం ప్రభుత్వానికి తెలుసు ఏ సామాజిక వర్గం చేతిలో ఎంత భూమి ఉందో ప్రభుత్వం 2014లో చేసిన జన గణన సర్వేని ముందు పెట్టుకున్నా అర్థం అవుతుంది. వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న క్రింది కులాలకు మేలు చేయాలి అని అనుకుంటే కనీసం కౌలు రైతుల కోసం ప్రభుత్వం ఆలోచించేది. కౌలు రైతుల చట్టంలో ఏమైనా ఇబ్బందులుంటే మార్పులు చేసే అధికారం చేతిలోనే ఉంది, కానీ చేయ్యరు. కౌలు రైతుల చట్టంలో ఇబ్బందులున్నాయి అందుకే సాయం చేయటం కుదరదు అంటున్నారు. ఎందుకంటే తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలలో మెజార్టీగా కౌలు వ్యవసాయం చేసేది క్రింది కులాలు అయితే భూములు మాత్రం అగ్రకులాలవి. ఈ అగ్ర కులాలకు భూమి మీద బ్రతికే అవసరం ఎప్పుడో పోయింది, తమ సామాజిక హోదా కోసం, రాజకీయ పెత్తనం కోసమే వీళ్ళు భూములను తమ వద్ద పెట్టుకున్నారు. ఈ సామాజిక వర్గం రెండవ తరం, మూడవ తరం వాళ్ళుకు ఈ భూమే అవసరం లేదు, వీళ్ళు ఇంజనీరింగ్, డాక్టర్‌లు చేసి విదేశాలకు వెళ్ళారు, అంతేకాదు తెలంగాణలోని ఏ కార్పోరేట్ సంస్థకైనా వెళ్ళండి అగ్రభాగాన ఉంది ఈ సామాజిక వర్గాల వాళ్ళే.

ఎవరికైతే ఈ భూముల మీద బతకాల్సిన అవసరమే లేదో, ఈ భూముల మీద అదనపు ఆదాయం వస్తూ వుందో, వాళ్ళకు డబ్బులు పంచడమంటే ఇందులో రాజకీయంగా ఈ సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవడం కోసమే అనే అభిప్రాయానికి తావు కలుగుతున్నది.

– ఏశాల శ్రీనివాస్, 9603402858

సమస్యల నిలయాలుగా అంగన్ వాడీ కేంద్రాలు!

ఎడిటర్‌కు లేఖ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 ఫిబ్రవరి నుండి అన్ని సంక్షేమ హాస్టళ్ళు, స్కూళ్ళకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు అదే మాదిరిగానే అన్ని అంగన్‌వాడీలకు సన్నబియ్యం సరఫరా చేస్తామని ప్రకటించింది. అది ఆచరణలో అమలు కావ డం లేదు. దొడ్డు బియ్యాన్ని చిన్నారులు తినలేక ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం ఆరోగ్య లక్ష్మి. పథకం కింద గర్భిణీలకు, బాలింతలకు ప్రతిరోజూ 200 మిల్లీలీటర్ల పాలు, ఒక కోడిగుడ్డు, ఒక పూట భోజనాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అలా సరఫరా చేసే పాలల్లో ఏ మాత్రం నాణ్యత లేకపోవడంతో అవుతుండడం వల్ల గర్భిణీలు, బాలింతలు ఆ పాలను తీసుకోవడంలో ఆసక్తి చూపలేకపోతున్నారు. అంగన్‌వాడీ టీచర్లను బాలింతలు ప్రశ్నిస్తే, మాకేం తెలియదు. సంబంధిత కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. ఇందులో మేము చేసేదేమిలేదని సమాధానం. కొన్ని సెంటర్లలో గుడ్డు సరిగా అందించడం లేదని, అయితే ఆ గుడ్లని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ధరలు గిట్టుబాటు కాకపోవడంతో రోజూ సరఫరా చేయలేకపోతున్నామని వారి వాదన. వాస్తవంగా బాలింతలకు, గర్భిణీలకు ప్రతిరోజూ 50గ్రాములు కలిగిన గుడ్డును అంగన్ వాడీ కేంద్రాల్లో టీచర్లు అందించాలి. కానీ, 30–40గ్రాముల చిన్న సైజు గుడ్లను అందిస్తున్నారనిబాలింతలు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో దొడ్డురకం భోజనం పెట్టడం వలన ఆ భోజనం తీసుకోలేకపోతున్నామని చెబుతున్నారు. చాలా చోట్ల అంగన్‌వాడీలకు పక్కా భవనాలు లేక ఇరుకైన అద్దె గదుల్లో కాలం వెల్లదీస్తున్న పరిస్థితి. అలా అద్దె తీసుకొన్న ప్రాంతాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో చిన్నపిల్లలు బయటకు వెళ్ళాల్సి వస్తుంది. వారిని ఆరుబయటకు తీసుకెళ్ళలేక ఆయాలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కొన్ని చోట్ల ఆయాలు లేక వారి పని కూడా టీచర్లే చేస్తున్న పరిస్థితి. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా అంగన్‌వాడీలపై దృష్టి సారించి వెంటనే ప్రక్షాళన దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– శ్రీనివాస్ చిరిపోతుల

మాతృస్వామ్య సమాజం అంతరించిన తర్వాత పురుషాధిక్య సమాజంలో మహిళల కృషిని తక్కువ చేసి చూపడమే కాక కించపరచడం పరిపాటి అయిపోయింది. మహిళలు పరాధీనలుగా మిగిలిపోయారు. మన జీవితాలను అనుక్షణం ఆవహిస్తున్న మీడియా కూడా మహిళలను రెండు సందర్భాలలో మాత్రమే పరిగణిస్తుంది. ఒకటి: వారు ఏదైనా మహత్కార్యం సాధించినప్పుడు. రెండు: వారి మీద అఘాయిత్యాలు జరిగినప్పుడు. మిగతా సమయాల్లో మహిళలను పురుషుల నీడలో బతకవలసిన వారిగా మాత్రమే చూస్తుంది. కేశాలంకరణ, సౌందర్యపోషణ, పిల్లల పెంపకం మాత్రమే మన పత్రికల్లోని మహిళా పేజీలకు ప్రధానమైన ఇతివృత్తాలైపోయాయి.



ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 4 మార్చి | 2018


మహిళా మణులు

చరిత్ర మరచినా ధరిత్రి మరువజాలదు

వేదకాలంలో గార్గి, మైత్రేయి అద్భుతమైన తత్వవేత్తలుగా నిలిచారు. క్లియోపాత్ర నుంచి మొగల్ సామ్రాజ్యంలో ఏకైక పాలకురాలు రజియా సుల్తాన్, ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీ బాయి, దళిత స్వాతంత్ర్య యోధురాలు ఉదా దేవి, అవధ్ రాజ్యాన్ని పరిరక్షించిన బేగం హజ్రత్ మహల్, రాణి కిట్టూరు చెన్నమ్మ, వేశ్యగా ఉండి రాణి అయిన బేగం సమ్రు వరకు రాజ్యాలేలిన మహిళలు ఎందరో ఉన్నారు. దేశం స్వాతంత్ర్యం సంపాదించిన తరుణంలో సంస్థానాలను భారత యూనియన్లో విలీనం చేయాలన్న పోరాటంలో ట్రావంకోర్ లో అసమానమైన పోరాట పటిమ ప్రదర్శించిన అచ్చమ్మ చెరియన్ వంటి వారూ ఉన్నరు. తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకిపట్టి పోరాడిన మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి వంటి వారే కాదు, వామపక్ష తీవ్రవాద ఉద్యమంలో ప్రాణాలర్పించిన పంచాది నిర్మల నుంచి ప్రాణాలకు తెగించి పోరాడిన చంద్రమ్మలాంటి వారికీ కొదవ లేదు. ఈ క్రమంలో చరిత్ర నమోదు చేయని స్త్రీల సంఖ్య అపారం. ఆధునిక కాలంలో సిరిమావో బండార్ నాయకే, చంద్రిక కుమారతుంగ, ఇందిరా గాంధీ, ప్రతిభా పాతిల్, గోల్డా మీర్, మార్గరెట్ థాచెర్, బేనజీర్ భుట్టో, ఖాలీదా జియా,షేక్ హసీనా, థెరెసా మే వరకు దేశాధినేతలుగా ఉన్న మహిళలు కొల్లలు.

రెండు సార్లు నోబెల్ బహుమతి సంపాదించిన మేడం క్యూరీ నుంచి ఇటీవ భారత అగ్ని క్షిపణుల రూపకర్త టెస్సీ థామస్ దాకా శాస్త్ర రంగంలో మహిళల కృషి అద్వితీయమైంది. 'మహిళలు రైలు మార్గాల నిర్మాణంలో భాగస్వాములైనప్పుడు అంతరిక్షంలోకి ఎందుకు వెళ్ల కూడదు' అని సవాలు చేసి అంతరిక్ష యానం చేసిన తొలి మహిళా వ్యోమగామిగా ప్రసిద్ధురాలైన వలెంటీనా తెరిష్కోవా నుంచి అమరురాలైన భారత సంతతికి చెందిన అమెరికా మహిళ కల్పనా చావ్లా వరకు అంతరిక్ష రంగంలో చరిత్ర సృష్టించినవారు అనేక మంది.


మరో వైపరీత్యమూ ఉంది. అత్యంత ప్రాచీన పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం అమలవుతోందనుకుంటున్న ఇంగ్లాండ్ లో మహిళలకు ఓటు హక్కు వచ్చి సరిగ్గా వంద సంవత్సరాలే అయింది. అదీ మొదట 30 ఏళ్లు దాటిన వారికి, పట్టభద్రులైన వారికి, ఆస్తి ఉన్న వారికి మాత్రమే. అత్యంత గొప్ప ప్రజాస్వామ్య దేశం అనుకునే అమెరికాలో కూడా 1920లో తప్ప మహిళలకు సంపూర్ణమైన ఓటు హక్కు రాలేదు. దీని కోసం అమెరికా మహిళలు దాదాపు శతాబ్దం పాటు పోరాడవలసి వచ్చింది. మన దేశంలో మాత్రం దీనికి భిన్నంగా స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే నిర్నిబంధంగా అందరికీ ఓటు హక్కు దక్కింది. బ్రిటన్ లో మహిళలకు ఓటు హక్కు కోసం సుదీర్ఘ పోరాటం చేసిన వారిలో ఎమ్మెలైన్ పంకర్స్ట్, మిల్లిసెంట్ ఫవెట్ ప్రధాన కారకులంటారు. కాని దశాబ్దాల పాటు సాగిన ఆ పోరాటంలో భారత సంతతికి చెందిన సోఫియా దులీప్ సింగ్ పాత్ర కీలకమైంది. మహిళలకు ఓటు


ఎమ్మెలైన్ పంకర్స్ట్


చంద్రమ్మ


ఉదా దేవి


ఆరుట్ల కమలాదేవి


అక్కమ్మ చెరియన్

మహిళా స్వాతంత్ర్య యోధులు అనగానే అని బెసెంట్, సరోజినీ నాయుడు వంటి వారి గురించే గుర్తు చేస్తుంటారు. కాని అనేక మంది వీర గాథలు మరుగున పడిపోయాయి. స్వాతంత్ర్య పోరాటంలో ప్రఖ్యాతులైన వారిలో ఉన్నత వర్గాలు, మధ్య తరగతి వారికన్నా అతి సామాన్యుల పాత్రే ఎక్కువ. కాని వారిని చరిత్రగర్భంలో కలిపేశారు. వారిలో నిస్వార్థంగా పోరాడిన వారు, ప్రాణ త్యాగం చేసిన వారు చాలా మంది ఉన్నారు.

హక్కు లేదు కనుక పన్నుల చెల్లింపు నిరాకరణ ఉద్యమంలో ఆమె ప్రధాన భూమిక పోషించారు. అందువల్ల ఆమె ఆస్తులను జప్తు చేసి వేలం వేశారు. పన్నుల చెల్లింపు నిరాకరణ ఉద్యమకారులైన మహిళలు వేలంలో ఆ ఆస్తులను కొని లోకం దృష్టికి ఈ అంశాన్ని తీసుకొచ్చారు. ఎమ్మెలైన్ పంకరస్ట్ తో కలిసి సోఫియా దులీప్ 1910లో జరిగిన ప్రదర్శనకు నాయకత్వం వహించారు. ఇది బ్లాక్ ఫ్రైడేగా ప్రసిద్ధమైంది. ఆ సమయంలో తెల్ల జాతీయులైన మహిళలు ఈ ఉద్యమానికి చాలా వరకు దూరంగానే ఉన్నారు. నిజానికి బ్రిటన్ లో ఓటు హక్కు కోసం భారతీయ మహిళలు కొనసాగించిన ఉద్యమం వలసవాద వ్యతిరేక ఉద్యమంలో భాగమే. అదే సమయంలో భారత్ లో 1917 తర్వాత స్త్రీలు ఓటు హక్కు కోసం ఉద్యమించారు. ఇందులో భారత కోకిల సరోజినీ నాయుడు పాత్ర అద్వితీయమైంది. మన దేశంలో జరుగుతున్న వలసవాద వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ఇవ్వడానికి సోఫియా దులీప్ సింగ్ అనేక సార్లు భారత్ లో పర్యటించారు. మానవాళిని ప్రగతి పథంలో నడిపించిన మహిళలు, స్ఫూర్తిప్రదాతలూ ఉన్నారు. వారిలో చాలా మంది పురుషాధిక్య సమాజ దమ్ముల కింద పడి నలిగిపోతే మరి కొంత మంది వారి సామాజిక వెనుకబాటుతనం వల్ల విస్మృతులయ్యారు. వ్యక్తులుగానే కాక పోరాటం పురుషులకే ప్రత్యేకం అనుకున్న సమయంలో కూడా వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలు వీరోచిత పోరాటాలు చేశారు. అందుకే అంతరిక్ష పరిశోధకులుగా, పైలెట్లుగా, పర్వతారోహకులుగా, రాజకీయ కార్యకర్తలుగా, స్త్రీవాదులుగా, కళాకారులుగా, రాజ్యాధినేతలుగా భారత మహిళలు సత్తా చాటారు.

'నాకు శాంతి, ప్రశాంతత అంటే ఇష్టం. నాకు రాజకీయాలు, కల్లోలాలు అంటే ఇష్టం లేదు. మహిళలం పరిపాలనకు తగిన వాళ్లం కాదు. మనం మంచి స్త్రీలమైతే పురుషులకు సంబంధించిన ఈ వృత్తులకు దూరంగా ఉండాలి. కాని ఒక్కొక్క సారి మహిళలు కూడా వీటిలో కల్పించుకోవాల్సి వస్తుంది. నేను అలా చేస్తాను. ఆ పని చాలా తీవ్రంగానే చేస్తా' అన్నారు విక్టోరియా రాణి (1819–1901). మహిళలు ఏం చేయాలి, చేయకూడదు అన్న ఆమె అభిప్రాయం ఆమె ప్రాపంచిక దృక్పథానికి సంబంధించిన విషయం కావచ్చు. కాని చేస్తే సవ్యంగా చేయాల్సిందేనన్న అభిప్రాయాన్ని సమర్థించవలసిందే.

కీర్తిమంతులైన మహిళల గురించి ఇదివరకే చాలా మాట్లాడుకున్నాం. నిశ్శబ్దంగా, కీర్తి కాంక్ష బొత్తిగా లేకుండా, కేవలం వారు చేసిన కృషివల్లే తలచుకోవలసిన కొందరి గురించైనా ప్రస్తావిస్తేనే మహిళా దినోత్సవానికి సార్థకత.

ప్రథమ స్వాతంత్ర సంగ్రామంలో


రాణి చెన్నమ్మ: 1857 నాటి ప్రథమ భారత సంగ్రామంకన్నా 56 ఏళ్ల ముందు 1824లోనే సంస్థానాధీశురాలు కిట్టూరు రాణి చెన్నమ్మ (1778–1829) ఈస్టిండియా కంపెనీ దాష్టీకంపై సాయుధ తిరుగుబాటు చేశారు. సంతానం లేని రాజ వంశస్థుల రాజ్యాలను బ్రిటిష్ వారు కబళించడాన్ని ప్రతిఘటించారు. జైలు శిక్ష అనుభవించారు. ఆమె పోరాటానికి చిహ్నంగా కర్నాటకలో ప్రతి అక్టోబర్ లో, కర్నాటక ఉత్సవాలలో భాగంగా కిట్టూరు ఉత్సవం నిర్వహిస్తారు. ఆమె గుర్రపు స్వారి, కత్తి సాము, విలువిద్యలో మేటి. ఆమె భర్త మల్లసర్జ దేశాయ్ 1816లో మరణించిన తర్వాత చెన్నమ్మ శివలింగప్పను దత్తత తీసుకున్నారు. కాని ఈస్టిండియా కంపెనీ అతడిని వారసుడిగా అంగీకరించకుండా ఆయనను ప్రవాసం పంపింది. చెన్నమ్మ ఈ ఆదేశాలను తిరస్కరిస్తే 20,000 మంది బ్రిటిష్ సైనికులు కిట్టూరుపై దాడి చేశారు. ఆ యుద్ధంలో బ్రిటిష్ వారు ఓడిపోయారు. కాని రెండో సారి 12 రోజులపాటు జరిగిన యుద్ధంలో చెన్నమ్మ సేనలు ఓడిపోయాయి. ఆమెకు బైళోంగల్ కోటలో యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

ఉదా దేవి: 1857 తిరుగుబాటు అనగానే ఝాన్సీ లక్ష్మీ బాయి, హజ్రత్ మహల్ లాంటి వారే గుర్తొస్తారు. కాని అగ్ర కులాలకు చెందని వారు సైతం వీరోచితంగా పోరాడారు. ప్రస్తుత ఉత్తర ప్రదేశ్ లో భాగమైన అవధ్ సమీపంలో దళిత కుటుంబలో జన్మించిన ఉదా దేవి పోరాట పటిమ నిరుపమానమైంది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం సాగుతున్నప్పుడు ఉదా దేవితో పాటు ఇతర దళితులు హజ్రత్ మహల్ తోడ్పాటుతో యుద్ధ రంగంలోకి ఉరికారు. గోమతి నది ఒడ్డున ఉన్న బ్రిటిష్ ఆయుధాగారాన్ని కాపాడుకోవడానికి తెల్ల వాళ్లు నానా యాతన పడవలసి వచ్చింది. బ్రిటిష్ సేనలు సికందర్ బాగ్ రాజభవనాన్ని ముట్టడించాయి. 2000 మంది తిరుగుబాటుదార్లు అమరులయ్యారు. ఆ కోటను స్వాధీనం చేసుకున్న తర్వాత ఒక బ్రిటిష్ సైనికాధికారి తమ సైనికులకు తుపాకి గుళ్లు తగలడం గమనించాడు. ఒక చెట్టు చాటున పురుషుల దుస్తుల్లో ఉన్న వ్యక్తి తుపాకి పేలుస్తున్నట్టు గమనించి జరిపిన కాల్పుల్లో ఓ వ్యక్తి నేలకొరిగింది. ఆమే ఉదా దేవి. దళితులు ఇప్పటికీ ఆమె సాహస కృత్యాన్ని మననం చేసుకుంటూనే ఉంటారు.

ట్రావన్కోర్ ఝాన్సీ: స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో మునుపటి సంస్థానాలన్నింటినీ భారత యూనియన్ లో మిళితం చేసే క్రమలో మొరాయించిన సంస్థానాలలో ట్రావన్కోర్ సంస్థానం కూడా ఉంది. తమ సంస్థానాన్ని విలీనం చేయాలన్న ఉద్యమంలో అచ్చమ్మ చెరియన్ నిర్వహించిన పాత్ర అద్వితీయం. ఆమె సాహసం మహాత్మా గాంధీ మెప్పు కూడా పొందింది. 1938లో ట్రావన్కోర్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడినప్పుడు ఆ సంస్థానం దివాన్ సి.పి. రామస్వామి అయ్యర్ ఈ ఉద్యమాన్ని ఉక్కు పాదంతో అణచివేసే ప్రయత్నం చేశారు. 1938 ఆగస్టు 26న ఆయన స్టేట్ కాంగ్రెస్ ను రద్దు చేయడంతో శాసనోల్లంఘన ఉద్యమం తలెత్తింది. స్టేట్ కాంగ్రెస్ అప్పటి అధ్యక్షుడు పట్టం థాను పిళ్లేతో సహా వరసగా పద కొండు మంది కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులను అరెస్టు చేశారు. ఉద్యమం పేకమేడలా కూలిపోవడం మొదలైంది. పదకొండవ అధ్యక్షుడైన కుట్టనాడ్ రామకృష్ణ పిళ్లే తాను అరెస్టు కావడానికి ముందు అచ్చమ్మ చెరియన్ ను అధ్యక్షురాలిగా నియమించారు. అప్పుడే ఆమె సమ్మెకారుల సంఘం ఏర్పాటు చేశారు. అప్పుడు ఆమెకు 29 ఏళ్లే. ట్రావన్కోర్ మహారాజా జన్మదిన వేడుకలకు నిరసనగా కాంగ్రెస్ మహా నిరసన ప్రదర్శన ఏర్పాటు చేసింది. దానికి నాయకత్వం వహించింది అచ్చమ్మ. ఆమె దుర్గా దేవి అవతారమెట్టారు. 'ఈ ఉద్యమానికి నాయకురాలిని నేను. ఇతరులను కాల్చేయడానికి ముందు నన్ను కాల్చేయండి' అని సింహగర్జన చేశారు. ఆమె నాయకత్వంలో తెల్లని ఖద్దరు జుబ్బాలు, గాంధీ టోపీలు ధరించిన వేలాది మంది కార్యకర్తలు రాజభవనాన్ని ముట్టడించారు. రాజు ఖైదీలను విడుదల చేసి, కాంగ్రెస్ మీద నిషేధం ఎత్తివేయక తప్ప లేదు. స్టేట్ కాంగ్రెస్ మొదటి వార్షికోత్సవంలో పాల్గొన్నందుకు అచ్చమ్మను, ఆమె సోదరి రోశమ్మను 1939లో అరెస్టు చేశారు. ఏడాది పాటు జైలులో ఉంచి చిత్రహింసలు పెట్టారు. విడుదలైన తర్వాత మరింత ఉధృతంగా ఆమె కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 1947లో టావన్కోర్ నుంచి ఏకగ్రీవంగా శాసన సభకు ఎన్నికయ్యారు. 1950లో ఆమెకు టికెట్ ఇవ్వనందుకు నిరసనగా కాంగ్రెస్ కు రాజీనామా చేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాలలో వస్తున్న మార్పులు సహించలేక రాజకీయాలనుంచి తప్పుకున్నారు.

మైన్ పురి కుట్ర కేసు, కకోరి కుట్ర కేసులో బ్రిటిష్ వారు ఉరి తీసిన రాం ప్రసాద్ బిస్మిల్ గురించి అందరికీ తెలుసు. కాని ఆయన తల్లి మూలమతి గురించి తెలియదు. ఆమె కొడుకు పోరాటానికి బాసటగా నిలిచారు. గోరఖ్ పూర్ జైలులో బిస్మిల్ ను ఉరి తీసే ముందు నీలాంటి కొడుకు ఉన్నందుకు గర్విస్తున్నాను అని మూలమతి చెప్పారు. బిహార్ లోని సరన్ కు చెందిన తారా రాణి శ్రీవాస్తవ సామాన్య మహిళ. స్వాతంత్ర్యోద్యమంలో భర్తతో కలిసి నిరసనలో పాల్గొన్నప్పుడు ఆమె భర్తను కాల్చేశారు. ఆమె తొణకలేదు. మృత్యు ముఖంలో ఉన్న భర్తకు సపర్యలు చేస్తూనే అనేక అడ్డంకులను అధిగమించి పోరాటంలో పాల్గొన్నారు. అబది బానో బేగం సంప్రదాయ ముస్లిం కుటుంబానికి చెందిన వారు. ఆమెను బీ అమ్మా అని కూడా అనే వారు. ఆమె కొడుకుని అరెస్టు చేసినప్పుడు ఎప్పుడూ ఇంట్లోంచి అడుగు బయట పెట్టని బానో లక్నో లో బ్రహ్మాండమైన బహిరంగ సభలో బురఖా వేసుకుని ఉత్తేజకరమైన ప్రసంగం చేశారు. కకోరీ కుట్ర కేసులో రాజ్ కుమారి గుప్తా పాత్ర గురించి తెలిసింది చాలా తక్కువ మందికే. ఆమె రహస్యంగా చంద్రశేఖర్ ఆజాద్ కు మద్దతు ఇచ్చే వారు. సందేశాలు, ఆయుధాలు చేరవేసే వారు. అలాంటి సందర్భంలో తన మూడేళ్ల కొడుకును ఎత్తుకుని ఆయుధాలు దాచుకుని వెళ్తుండగా ఆమెను అరెస్టు చేశారు. ఆమె అత్తింటి వారు ఆ తర్వాత ఆమెను పట్టించుకోకపోవడం ఓ విషాదం. పార్వతి గిరిని పశ్చిమ ఒరిస్సా మదర్ థెరీసా అంటారు. పదహారవ ఏటనే ఆమె స్వాతంత్ర్య సమరంలోకి దూకి క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రెండేళ్లు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం సంఘ సేవలో మునిగిపోయారు. భోగేశ్వరి ఫుకనానీని అస్సాంలో '60 ఏళ్ల మృత వీరురాలు' అంటారు. తన ఆరుగురు కొడుకులను, ఇద్దరు కూతుళ్లను కూడా అదే బాటలో నడిపించారు. విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు బ్రిటిష్ వారు ఆమెను కాల్చేశారు. అస్సాంకు చెందిన మరో వీర నారి కనక లత బారువా. ఆమెను వీరబాల అనే వారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో ఆమె మృత్యువాహినిలో చేరారు. 1942 సెప్టెంబర్ 20న జాతీయ పతాకం చేతబూనినందుకు ఆమెను కాల్చేశారు.

బెంగాల్ కు చెందిన మాతంగిని హజ్రా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న వారిలో అధికశక్తిశాలిగా భావించే వారు. ఆమెను కాల్చేసిన తర్వాత కూడా జాతీయ పతాకాన్ని వదలకుండా ఊపిరి ఆగిపోయేదాకా వందేమాతరం అని నినదించారు.


ఆర్.వి.రామారావు
9676999856

పుడమి ప్రియ పుత్రికలు

గ్రామీణ మహిళల జీవితాలు ఎంత శ్రమ చేసినా సుంత సుఖం లేకుండా ఇప్పటికీ వేదనాభరితంగానే కొనసాగుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది గానీ, దళితులకు, అణగారిన సామాజిక వర్గాల ప్రజలకు, స్త్రీలకు ఇప్పటివరకు చెప్పుకోదగిన స్వేచ్ఛ లభించలేదు. ఇటువంటి అంధకార భారతంలో అక్కడక్కడ మెరుపుల్లా స్వశక్తితో విశేష ఫలితాలు సాధించి కుటుంబాలను పోషించుకుంటున్న గ్రామీణ స్త్రీ రత్నాల ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. పల్లెల్లో తమకున్న సెంటు, కుంట భూమిలోనే రసాయనిక సాగుపద్ధతులను విడనాడి సేంద్రియ విధానంలో స్వయంగా సాగుచేస్తూ సత్ఫలితాలు సాధిస్తోన్న ఈ మహిళలు నిజంగానే పుడమితల్లి ప్రియపుత్రికలు.

ఆరోగ్యం, ఆదాయం...



'' సేంద్రియ పద్ధతుల్లో అనేక పంటలను కలిపి సాగు చేయడం నేర్చు కున్నా. నా భర్తకు సుగర్, రక్తపోటు సమ స్యలున్నాయి. అందుకే మా కుటుంబానికి మంచి పౌష్టికాహారం కోసం సేంద్రియ సేద్యం చేస్తున్నా. 3 ఎకరాల్లో 15 రకాల పంటలను సాగుచేస్తున్నా. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పంటల దిగుబడి 2 రెట్లు పెరిగింది. ఖర్చు పోను ఎకరాకు రూ. 16 వేల ఆదాయం వస్తోంది. ఎకరంలో చెరకు పంటను కూడా సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్నాం.'' అంటారు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం ఖాసింపూర్ గ్రామానికి చెందిన అనిత.

భర్త ఎడారి దేశానికి వలస వెళితే...

అబ్దుల్ హమీద్ కి మోమిన్‌పేట(రంగారెడ్డి జిల్లా) 5 ఎకరాలు భూమి ఉంది కానీ, సాగునీటి వసతి లేక పడావుగా మిగిలిపోయింది. సాగు చేసే ప్రయత్నం చేసినా విత్తనాలు, కూలీలకు ఖర్చు పెట్టిన పెట్టుబడి కూడా మిగిలేదికాదు. ఈ బాధలు పడలేక బతుకుతెరువు కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాడు. అపుడు అతడి భార్య షహనాజ్‌బేగం తమ నేలను అలా వదిలేయకుండా సాగు బాధ్యత తీసుకుంది. ఐదేళ్ల క్రితం వెల్‌చాల్ గ్రామంలో 'రీడ్' సంస్థ వాటర్‌షెడ్ కార్యక్రమాలు మొదలుపెట్టి వాననీటిని నేలలోనే ఇంకింపచేసే పనులు చేశారు. దీంతో భూగర్భ జాలాలు పెరిగాయి. దీంతో షహనాజ్‌బేగం బీడు భూమిని సాగులోకి తెచ్చింది. వారి పొలంలో ఎండిపోయిన బోర్‌లో జలసంరక్షణ వల్ల నీటిమట్టం పెరిగింది. ఇపుడు వారి బంజరు నేల మామిడి,సపోటాతో, అంతరపంటలతో కళకళలాడుతోంది

ఉల్లి చేలో పల్లె నవ్వింది



నాలుగు ఎకరాల రైతు నాగమణి. కానీ అదంతా బీడు నేల. ఇలాంటి పరిస్థితుల్లో వీరి పొలాలకు ఎగువలో 4 ఫారంపాండ్స్, 2 చెక్ డ్యామ్స్, రాక్ ఫిల్ డ్యామ్స్ నిర్మించారు. దీంతో గత సంవత్సరం కురిసిన వాన నీరు పల్లపు ప్రాంతానికి పోకుండా ఎక్కడికక్కడే ఇంకిపోయింది. బంజరు భూమిగా ఉన్న పర్వతాపూర్ (వికారాబాద్ జిల్లా) ప్రాంతంలో వాటర్ షెడ్ వల్ల జలకళ సంతరించుకుంది. నాగమణి తన భర్త గోపాల రెడ్డితో కలిసి ఉల్లి సాగుచేస్తూ ఎకరానికి 80 వేలు ఆదాయం పొందుతున్నారు. పసుపు, పెసర కూడా పండిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు.

వంద గ్రామాలకు నీళ్లు తెచ్చిన మహిళా శక్తి



ఎనిమిదేళ్ల క్రితం మహదేవపురం(దుమ్ము గూడెంమండలం, భద్రాద్రిజిల్లా)సాగునీరు, తాగునీటి సదుపాయం లేక కరవు తాండవ మాడేది. ఇదంతా లక్ష్మీదేవమ్మ చూస్తూ ఊరుకోలేదు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తమ పంచాయితీలోని బట్టిగూడెం,దబ్బనూతల గ్రామాలను తిరిగి సమస్య గురించి తెలుసుకుంది. అదే సమయంలో ఆ గ్రామంలో అడుగు పెట్టిన ఏఎస్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రమదానంతో పనులు చేస్తే వలసలు ఆగుతాయని చెప్పారు. తానే పలుగు పార పట్టింది. ఆమె ఒక్కడుగు ముందుకు వేస్తే ఆమె వెనుక ఊరంతా కదిలింది. ఎనిమిది నెలల తరువాత ఊరు మారడం మొదలైంది. స్వచ్ఛంద సంస్థల శిక్షణతో జలసంరక్షణ పద్ధతులు తెలుసుకున్నారు. 15మంది మహిళలతో బృందంగా ఏర్పడి మహదేవపురం వాటర్ షెడ్ గ్రామాభివృద్ధి కమిటీగా ఏర్పడ్డారు.రాతికట్టలు,ఫారంపాండ్స్, పొలం చుట్టూ కందకాలు తవ్వడం, చెక్‌డ్యామ్‌ల ద్వారా పై నుంచి వచ్చే జలాన్ని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలని నిర్ణయించుకుంది లక్ష్మీదేవమ్మ. ఇపుడా గ్రామం పాడి,పంటలతో కళకళలాడుతోంది.

మా కంది బహు రుచి

జహీరాబాద్ బాద్‌కి చెందిన శోభమ్మ తన ఇంటి నుంచి కిలోమీటర్ దూరంలో ఒక చిన్న వాగు దాటి పొలంలోకి వెళ్లి పనులు చేస్తుంది. రెండు ఎకరాల్లో కంది పంటను సాగు చేస్తున్నది శోభమ్మ. ''గతంలో నేను రసాయనాలతోనే పండించేదానిని. ఇప్పుడు సుభాష్ పాలేకర్ పద్ధతిలో ప్రక తి వ్యవసాయం చేస్తున్నా. గతంలో నేను పండించిన కందిపప్పు కంటే ఇప్పుడు పండిస్తున్న కందిపప్పు ఎక్కువ రుచిగా వుంటోంది.

రోజు కూలీ.. రైతుగా మారింది




ఖమ్మం జిల్లా,జగన్నాథపురం మండలం,రాజాపురం గ్రామంలో కేవలం రెండెకరాలున్న పేద రైతు దంపతులు బొగ్గం జయమ్మ, నర్సింహారావు. అలాంటి కరవు నేలను చదును చేసుకునే స్తోమత లేని ఆమె భర్త సమీప పట్నానికి వలస పోయాడు. ఇలాంటి పరిస్థితిల్లో జయమ్మ గ్రామ సభలో తన సమస్యను చెప్పుకుంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నిధులు మంజూరు కాగా తమ భూమిని సాగుకు అనువుగా మార్చింది. భర్తను వెనక్కి రప్పించి ంది. నర్సింహారావు తన భార్య జయతో కలిసి రాత్రిపగలు భూమిని అభివృద్ధి చేసే పనుల్లో పాల్గొని , సాగునీటికోసం తన భూమిలోనే చిన్ననీటి కుంటను తవ్వుకుని వాననీటిని నిలువ చేసి, భూమిలో తేమను పెంచారు.

అరఎకరాలో వరి పండించి సుమారు 15 బస్తాల దిగుబడి సాధించారు. మిగిలిన ఒకటిన్నరెకరాల్లో జామాయిల్ తోటను పెంచుతున్నారు.

గతంలో కేవలం దినసరికూలీగా బతికిన ఈ దంపతులు పట్టుదలతో కష్టించి తమ బీడుభూమిని సాగు భూమిగా మార్చుకుని రైతులుగా మారారు. ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ సుస్థిర ఆదాయం పొందుతున్నారు. జయమ్మ సాధించిన ప్రగతి చూసి మిగతా రైతులు తమ భూములను అభివృద్ధి చేసుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.


శ్యాంమోహన్
9440595858

పర్యాటక ప్రాంతంగా సోమశిల : మంత్రి జూపల్లి



మనతెలంగాణ/హైదరాబాద్ : కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు టూరిజం అధికారులను కోరారు. సోమశిల టూరిజం అభివృద్ధిపై మంత్రి సమీక్షా సమావేశాన్ని హైదరాబాద్‌లోని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సోమశిల, జెట్‌ప్రోలులో బోటింగ్, హరిత హోటల్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. హోటల్‌లో ధరలు అధికంగా ఉండడం వల్ల పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. బోటింగ్‌ను కూడా పర్యాటకులను ఆకర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి సోమశిలకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటుపై పర్యాటక శాఖ దృష్టి పెట్టాలన్నారు. సోమశిలలో ఒకటిరెండు నెలల్లోనే వీలైనన్ని కాటేజీలు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఆగస్టు నాటికి సోమశిలలో 10కాటేజీలను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా పర్యాటకశాఖాధికారులు మంత్రికి తెలిపారు. హోటల్ నిర్వహణను ప్రైవేటుకు అప్పగించే అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రి దృష్టికి తెచ్చారు. హైదరాబాద్ నుంచి సోమశిలకు బస్సులో, అక్కడి నుండి శ్రీశైలంకు బోటింగ్ ఏర్పాటు చేసేలా ఆలోచన చేయాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు సూచించారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ కార్యదర్శి వెంకటేశంతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎంవి యాక్ట్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా, కార్మికుల కనీస వేతనం రూ.24 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలను నిర్వహించనున్నట్లు రోడ్డు రవాణ కార్మిక సంఘాల కోఆర్డినేషన్ కమిటీ తెలియజేసింది. ప్రభుత్వం రవాణ రంగాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తుందని కమిటీ విమర్శించింది. కార్మిక సంఘాల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం శనివారం సిఐటియు కార్యాలయంలో జరిగింది. కార్మిక సంఘాల నాయకులు బి.వెంకటేష్, బి.కృష్ణమూర్తి (ఎఐటియుసి), వి.ఎస్.రావు, పి.శ్రీకాంత్ (సిఐటియు), జి.మల్లేష్ (ఐఎన్‌టియుసి), ఎ.నరేందర్ (ఐఎఫ్‌టియు), కె.నర్సింగ్‌రావు (టిఎన్‌టియుసి), వి.కారణ్ (ఐఎఫ్‌టియు) పాల్గొన్నారు. ఎంవి యాక్ట్ సవరణ బిల్లు రవాణ రంగంలోని కార్మికుల జీవితాలను రోడ్డున పడేసే విధంగా ఉందని వారు విమర్శించారు. రాజ్యసభలో బిల్లు చర్చకు వస్తే రాష్ట్రానికి చెందిన ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకించాలని వారు కోరారు.

20న కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సు

మన తెలంగాణ / హైదరాబాద్ : రోడ్డు రవాణ సంస్థ (ఆర్‌టిసి) లను, రవాణ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మోటారు వాహనాల సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 6న అన్ని డిపోల వద్ద ధర్నాలను, 20న రాష్ట్ర సదస్సును నిర్వహించాలని టిఎస్ఆర్‌టిసి కార్మిక సంఘాలు ప్రకటించాయి. కార్మికుల కనీస వేతనం రూ.24 వేలుగా నిర్ణయించాలని, రవాణ శాఖ పెంచిన సర్వీసు ఛార్జీలను తగ్గించాలని, పెట్రోల్, డీజిల్‌లను కూడా జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని, థర్డ్ పార్టీ ఇన్సురెన్స్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆర్‌టిసి కార్మిక సంఘాల నాయకులు కె.రాజిరెడ్డి (ఎంప్లాయీస్ యూనియన్), వి.ఎస్.రావు (ఎస్‌డబ్ల్యుఎఫ్), జి.అబ్రహం (ఎస్‌డబ్ల్యుయు), బి.యాదగిరి (టిఎస్ఆర్‌టిసి కార్మిక పరిషత్), కె.వాసుదేవరావు (ఆర్‌టిసి సూపర్ వైజర్స్ అసోసియేషన్) ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఎంవి యాక్ట్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజా రవాణ సంస్థ ఆర్‌టిసిని ఆర్థికంగా ప్రభుత్వాలు ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఏప్రిల్‌లో కోదండరామ్ పార్టీ ఆవిర్భావ సభ

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి ఏర్పాటు చేయనున్న రాజకీయ పార్టీ ఆవిర్భావ సభను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు తెలిసింది. సభను హైదరాబాద్ లేదా వరంగల్‌లో నిర్వహించాలని, దీనికి భారీ జన సమీకరణ చేయాలని భావిస్తోంది.కాగా మార్చి నెలఖరు వరకు నిరుద్యోగ, రైతు సమస్యలపై జిల్లాల వారిగా సదస్సులు, సమావేశాలను నిర్వహించి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెంచాలని జెఎసి నిర్ణయించినట్లు సమాచారం. జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం జెఎసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, రైతాంగ, నిరుద్యోగ సమస్యలు, రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. కాగా మిలియన్‌మార్చ్ యాదిలో ఈ నెల 10న ట్యాంక్‌బండ్‌పై చేపట్టనున్న మిలియన్‌మార్చ్ స్ఫూర్తి సభను జయప్రదం చేయాలని, క్షేత్ర స్థాయి నుంచి జెఎసి శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని నిర్ణయంచారు. ఇటీవల అమెరికా పర్యటనలో ఉన్న కోదండరామ్ అక్కడ ఎన్ఆర్ఐలు నిర్వహించిన సమావేశ వివరాలు, రాజకీయ పార్టీకి అక్కడి వారి మద్దతు తదితర అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకొచ్చినట్లు తెలిసింది. వివిధ రాజకీయ పార్టీల నుంచి జెఎసి రాజకీయ పార్టీలో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు, ప్రధానంగా అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు తదితర అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. అలాగే రాజకీయ పార్టీ ఎజెండా అంశాలు కూడా చర్చకొచ్చాయి. అయితే మిలియన్‌మార్చ్ రోజునే పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించాలని తొలుత భావించినప్పటికీ అదే రోజు వామపక్ష, వివిధ ప్రజా సంఘాలతో కలిసి ట్యాంక్‌బండ్‌పై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ సభను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు తెలిసింది.

ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరపండి: కోదండరామ్

ఛత్తీస్‌ఘఢ్, తెలంగాణ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనను తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించి, బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ం ఏర్పడిన తర్వాత నక్సలైట్ అంశాన్ని సామాజిక రాజకీయ కోణం నుంచే పరిశీలించి పరిష్కరిస్తామని, ప్రజాస్వామిక వాతావరణాన్ని కాపాడుతామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఎన్‌కౌంటర్లు ఉండవని హామీనిచ్చారని, ఇప్పటికైనా భవిష్యత్తులో ఎన్‌కౌంటర్లు జరగకుండా చూడాలన్నారు. ఎన్‌కౌంటర్లు హింసకు దారితీస్తాయని, ప్రజాస్వామిక వాతావరణాన్ని భగ్నం చేస్తాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేసవిలో యాక్షన్ ప్లాన్ అమలు

అధికారులకు సిఎస్ ఆదేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : వేసవిలో ఏప్రిల్ నుండి జూన్ వరకు వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందన్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి ఆదేశించారు. శనివారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన హీట్‌వేవ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వేసవిలో 23 రోజులు వడగాల్పులు వీచాయని ఈ సారి కూడా మరిన్ని రోజులు అధికంగా వడగాల్పులు అధికంగా వీచే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సిఎస్ సూచించారు. వడగాల్పుల తీవ్రతపై కలర్ కోడింగ్‌తో ఎప్పటికప్పుడు ప్రజలకు, అధికారులకు సూచనలు చేయాలన్నారు. జిల్లాల్లో తగు స్థాయిలో ఓఆర్ఎస్, ఐవి, ఫ్లూయిడ్స్, ఐస్ ప్యాక్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు హెల్త్ అడ్వైజరీస్ విడుదల చేయాలన్నారు. ఆశా వర్కర్లు, ఎఎన్ఎమ్‌లు, అంగన్ వాడి సిబ్బందికి తగు శిక్షణ నివ్వాలన్నారు. సమాచార శాఖ ద్వారా వడగాల్పుల తీవ్రతపై పోస్టర్లు, కరపత్రాలు, హోర్డింగ్స్, సోషల్ మీడియా, టివి, రేడియోల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, మహిళలు, వృద్ధులు, కార్మికులు, చిన్న పిల్లలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వడగాల్పుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు సిఎస్ తెలిపారు. పశువులు, గ్రొరెలకు తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా చూడాలని, పశువుల కోసం ప్రత్యేకంగా షెడ్స్ నిర్మించే పనులను వేగవంతం చేయాలన్నారు. పశువుల కోసం ఇప్పటికే 10 వేల వాటర్ టబ్స్ ఉన్నాయని, మరో 12 వేల వాటర్ టబ్స్, 7 వేల షీప్ షెడ్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వడగాల్పులకు సంబంధించి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను చైతన్యం చేయాలని సూచించారు. ముఖ్యమైన దేవాలయాలు, మసీదులు, చర్చిలు, మాల్స్‌లో తగు సదుపాయాలు కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వీలైనన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు అందించాలన్నారు. వడదెబ్బకు గురయ్యే ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులకు మంచినీటి కొరత రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, మెట్రో రైల్వే స్టేషన్లు, బస్ స్టాప్‌లలో మంచినీటిని ఏర్పాటు చేసి ప్రజాణీకులకు అందుబాటులో ఉంచడంతో పాటు ఎమర్జెన్సీ మెడికల్ టీమ్‌లను అప్రమత్తంగా ఉంచాలని సిఎస్ సూచించారు.

సెటిలర్లూ.. కాంగ్రెస్‌కు మద్దతివ్వండి

● చైతన్య యాత్రకు స్పందన చూసి టిఆర్ఎస్‌కు బెంబేలు ● టిపిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్



మన తెలంగాణ / హైదరాబాద్ :గతంలో టిఆర్ ఎస్ తెలంగాణ వాలే జాగో, ఆంధ్రావాలే భాగో అంటూ భయపెట్టారని, ఇప్పుడు రాజకీయాల కోసం సెటర్లను దగ్గరకు తీసుకుంటున్నారని ఇది గమనించాలని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఉన్న సెటిలర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రకు ప్రజా స్పందన చూసిన టిఆర్ఎస్ బెంబెలెత్తి పోతుందని దాంతో అనవసర ఆరోపణలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి మాట్లాడుతున్నారని అన్నారు. మిషన్ భగీరథ పేరుతో కమీషన్లను బాగా తిని మంత్రి కెటిఆర్ కళ్ళు నెత్తికెక్కి మాట్లాడుతున్నారని, ఆయనను తిట్టేందుకు మా రేవంత్ రెడ్డినే సరైన నాయకుడని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం నాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ నుండి మాజీ శాప్ చైర్మన్ రాజ్ ఠాకూర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు పల్లె కృష్ణారెడ్డి, నిజామాబాద్ జిల్లా నాయకులు,పలువురు జంట నగరాల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, ఎఐసిసి కార్యదర్శి మధుయాష్కి, మాజీ హోం మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి దానం నాగేందర్, ఎంఎల్‌ఎ రేవంత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి ఉత్తమ్ కాంగ్రెస్ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై 2014 ఎన్నికలలో డబ్బులు దొరికాయని పదే పదే టిఆర్ ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ఆ కేసును హైకోర్టు కూడా కొట్టి వేసిందన్నారు. ఎన్నికలు అయిపోయాక ఏదో ఒక వాహనంలో రూ.1. 57 లక్షలుదొరికితే అవి తనవని కేసులు పెట్టారని చెప్పారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మీద కేసులున్నాయని కెటిఆర్ పదే పదే బ్లాక్ మెయిల్ చేసే విధంగా మాట్లాడుతున్నారని అధికారంలో టిఆర్ ఎస్ ఉండగా కాంగ్రెస్ నాయకుల మీద కేసులుంటే ఎందుకు భయటపెట్టడం లేదని ప్రశ్నించారు. హిమాయత్ నగర్‌లో చిన్న ఇంట్లో ఉండే ఒవైసి కుటుంబానికి ఇప్పుడు వేల కోట్ల రూపాయల ఆస్తులు, పెద్ద పెద్ద బంగళాలు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ 2019తరువాత కెసిఆర్, ఆయన కుటుంబం జైలుకు వెళ్ళడం ఖాయమని, వారి అవినీతిపై ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ అమరవీరుల కుటుంబాలకు రాజ్యసభ సీటు ఇవ్వాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ అమరవీరుల కుటుంబాల నుంచి రాజ్యసభకు పోటీ దించుతుందని చెప్పారు.

నేడు డిచ్‌పల్లి నుంచి బస్ యాత్ర కొనసాగింపు

కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం నాడు తలపెట్టిన బస్‌యాత్ర ఒంటి గంటకు బోధన్‌లో ప్రారంభం కానుంది. హోళీ, పెళ్ళి కారణంగా బస్సుయాత్రకు విరామం ఇచ్చారు. మూడు రోజుల విరామం తరువాత కొనసాగనున్న బస్సుయాత్రలో పాల్గొనేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు ముఖ్య నాయకులంతా హైదరాబాద్ నుంచి డిచ్‌పల్లి వరకు వాహనాలలో డిచ్‌పల్లి చేరుకుంటారు. అక్కడి నుంచి యాత్రా బస్‌లో బయలుదేరుతారు.ఆదివారం డిచ్‌పల్లి నుంచి బోధన్ వరకు బోదన్ నుంచి నిజామాబాద్ బస్ యాత్ర జరుగుతుందని టిపిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి తెలిపారు.



దొందూ దొందే

(మొదటిపేజీ తరువాయి)

మార్పును తీసుకురావడంలో ఘోరంగా విఫలమైంది. పార్టీలు కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడల్లా పథకాలపేర్లు మారుతున్నాయి తప్ప గుణాత్మకమైన మార్పు మాత్రం రావడంలేదన్నారు. గుణాత్మకమైన మార్పును ప్రజలు ఇప్పటివరకూ చూడలేకపోయారని, ఇది ప్రజల దురదృష్టకరమని అన్నారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరను ఇవ్వలేకపోయాయని, వాణిజ్య పంటలకు అసలే ఎంఎస్‌పి అనే విధానమే లేదని, మద్దతు ధరలను ఈ ప్రభుత్వాలు ఎందుకు పెంచవని ప్రశ్నించారు. దేశంలో ఉన్న నీటిలో 30% మాత్రమే వాడుకుంటున్నామని, ఇప్పటికీ త్రాగునీరు, సాగునీటిని ప్రజల అవసరాల మేరకు ఇవ్వలేకపోతున్నామని, అవసరమైతే రాజ్యాంగాన్ని, చట్టాన్ని మార్చుకోవాలని అన్నారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో అంకెలు మారుతున్నాయి, పెరుగుతున్నాయి తప్ప ప్రజల జీవితాల్లో మార్పేమీ రాలేదన్నారు. తాను తొలిసారిగా 2004లో ఎంపిగా ఉన్నప్పుడు కేంద్ర బడ్జెట్ నాలుగు లక్షల కోట్ల రూపాయలు ఉంటే ఇప్పుడు అది 24 లక్షల కోట్లకు పెరిగింది తప్ప ప్రజలను ప్రభావితం చేసే, గుణాత్మకమైన మార్పు దిశగా తీసుకెళ్ళే పథకాలేవీ పెద్దగా రాలేదన్నారు. సామాజిక అసమానతలు, అన్యాయం నుంచే నక్సలిజం పుట్టుకొచ్చిందని, ఇప్పటికీ అది ఉనికిలోనే ఉందని, ఇందుకు కారణం రాజకీయ పార్టీలు స్పష్టమైన మార్పు దిశగా పాలన సాగించలేకపోవడమేనని అన్నారు.

ఏచూరితోనూ మాట్లాడా : జాతీయ రాజకీయాల్లో రావాల్సిన మార్పులపై వివిధ పార్టీల నేతలతో మాట్లాడుతున్నామని, ఇప్పటికే సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో మాట్లాడానని, ఆయన సానుకూలంగా స్పందించారని కెసిఆర్ గుర్తుచేశారు. ప్రయత్నాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రజలు కోరుకుంటున్న గుణాత్మకమార్పుకు ఎంతో సమయం పట్టదని, గట్టి ప్రయత్నం జరిగితే నెలల వ్యవధిలోనే అది సాధ్యమవుతుందన్నారు.'దేశం దిశ మారాలి. శక్తివంతమైన దిశగా ప్రయాణం జరగాలి. త్వరలోనే ప్రబలమైన మార్పు ఉంటుంది. పరిస్థితులే నాయకత్వాన్ని సృష్టిస్తాయి. తెలంగాణ ఉద్యమం నన్ను నాయకుడిగా సృష్టించినట్లే జాతీయ పరిస్థితులు నాయకత్వాన్ని నిర్ణయిస్తాయి' అని అన్నారు. అవసరమైతే రాష్ట్రాలు తిరిగి అన్ని పార్టీలతో మాట్లాడతానన్నారు.

రిజర్వేషన్లపై రాష్ట్రాలకే అధికారం:దేశం మొత్తానికి రాజ్యాంగం ఒక్కటే అయినా ఒక్కో రాష్ట్రంలో రిజర్వేషన్ ఒక్కో రకంగా అమలవుతోందని, తమిళనాడులో ఇది 69% ఉంటే, మహారాష్ట్రలో 52% ఉందని, తెలంగాణలో పెంచాలని ప్రతిపాదిస్తే కేంద్రం నిరాకరించిందని సిఎం కెసిఆర్ గుర్తుచేశారు. దళితులు ఇప్పటికీ అసంతృప్తితోనే ఉన్నారని, అన్యాయానికి గురవుతున్నామన్న భావనతోనే ఉన్నారని గుర్తుచేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా ప్రయోజనం లేకపోయిందని అన్నారు. దేశం మొత్తానికి ఒకే విధానం ఉండాలి కదా అని ప్రస్తావించి రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా రిజర్వేషన్లలో మార్పులు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50% దాటవద్దని భావించినట్లయితే రాజ్యాంగాన్నే సవరించుకోవచ్చుగదా అని సూచించారు.

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం : రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చేయాలని కోరుకుంటోందని, దాన్ని వదులుకోడానికి సిద్ధంగా లేదని కెసిఆర్ వ్యాఖ్యానించారు. ప్రతిదానికీ రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడాలని కోరుకుంటున్నదని పేర్కొన్నారు. హామీలు ఇచ్చినప్పుడు తప్పనిసరిగా వాటిని అమలుచేసే బాధ్యతను తీసుకోవాలని, చిత్తశుద్ధితో వ్యవహరించారని, కానీ ఆ రెండు పార్టీలకు అది కొరవడిందన్నారు.

ఒక్క పైసా అదనంగా ఇవ్వలేదు : రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో సంపదను పోగేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తిరిగి ఆర్థిక సంఘం సిఫారసులతో పన్నుల వాటా రూపంలో మళ్ళీ రాష్ట్రాలకు ఇస్తోందని, చట్టబద్ధంగా ఇవ్వాల్సిందే ఇస్తోంది తప్ప ఈ నాలుగేళ్ళలో కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా తెలంగాణకు అదనంగా ఇవ్వలేదని కెసిఆర్ పేర్కొన్నారు. ఈ నాలుగేళ్ళ కాలంలో మొత్తం రూ. 81,362 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాయని తెలిపారు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో రెట్టింపుకంటే ఎక్కువ పొందుతోందని అన్నారు. రాజ్యాంగం ప్రకారమే కేంద్రం ఇస్తోంది తప్ప దయాదాక్షిణ్యాలతో కాదని అన్నారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ ఇది చేసి తీరాల్సిన పనేనని అన్నారు.

నా స్వప్నం ఫలించింది : తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలన్న తన స్వప్నం పద్నాలుగేళ్ళ తర్వాత ఫలించిందని కెసిఆర్ వ్యాఖ్యానించారు. ఈ దేశ రాజకీయాల్లో మూడు పార్టీలకు మాత్రం ప్రత్యేక చరిత్ర ఉన్నదని అన్నారు. ఎమర్జెన్సీ అనంతరం జనతాపార్టీ మూడు నెలల వ్యవధిలోనే ఉనికిలోకి వచ్చిందని, ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ తొమ్మిది నెలల వ్యవధిలో పురుడుపోసుకుందని, టిఆర్ఎస్ పార్టీ కూడా ఆరు నెలల కాలంలోనే ఉనికిలోకి వచ్చి పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిందని పేర్కొన్నారు.

భారత్‌కూ ఆ బలం ఉంది: మావో బతికున్నప్పుడు రెండుసార్లు చైనాలో తీవ్ర కరువు వచ్చి 15 లక్షల మంది చనిపోయారని, గత మూడు దశాబ్దాలుగా ఆ దేశ పరిస్థితిని చూస్తే చాలా మార్పు కనిపిస్తోందని, బలమైన శక్తిగా అవతరించిందని, భారత్‌కు కూడా ఆ సత్తా ఉందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక శక్తిగా మారిందని, వార్షిక బడ్జెట్ రెండు ట్రిలియన్ రూపాయలకు చేరుకుందని, విదేశీమారక ద్రవ్య నిల్వల్లో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని వివరించారు. ఆ ప్రభుత్వాలు తీసుకున్న విధాన నిర్ణయాలు, సమూ పరివర్తన దిశగా ప్రయాణం చేయడానికి వీలుగా అవలంబించిన విధానమే ఇందుకు కారణమని అన్నారు.

కేంద్రం తీరు మారాలి : కేంద్ర ప్రభుత్వం ఏదైనా హామీ ఇస్తే దానికి కట్టుబడి ఉండాలని, 'ఇస్తాం' అని మాట ఇస్తే దానిని ఇచ్చి తీరాల్సిందేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంలోగానీ, పునర్ వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అంశంలోగానీ మాటమీద నిలబడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తాము అంశాలవారీ మద్దతే ఇస్తున్నామని, ఆ అంశాలు దేశ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అవసరమని భావిస్తే కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామని గుర్తుచేశారు. పెద్దనోట్ల రద్దు విషయంలో, జిఎస్టి అమలు విషయంలో ఇదే విధానాన్ని అనుసరించామని ఉదహరించారు. తెలంగాణకు ఎయిమ్స్ ఇస్తామని లోక్‌సభ వేదికగానే కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

బిజెపికి తెలంగాణలో స్థానమే లేదు : తెలంగాణలో బిజెపికా స్థానమే లేదని, కానీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ టిఆర్ఎస్‌కు బలమైన ప్రత్యామ్నాయం అని వ్యాఖ్యానిస్తోందని కెసిఆర్ ఉదహరించారు. వరంగల్ ఉప ఎన్నికలో ఆ పార్టీ బలమెంతో తేలిపోయిందని, ఆ తర్వాత గ్రేటర్ ఎన్నికల్లో స్పష్టమైపోయిందన్నారు. ప్రజల్లోకి వెళ్ళడానికి మరో మార్గం లేకపోవడంతో టిఆర్ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నదని అన్నారు.

కేంద్రాన్ని నిలదీస్తాం : పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చాలా రావాల్సినవి ఉన్నదని, హామీల అమలులో కేంద్రం పెద్దగా పట్టించుకోవడంలేదని, రానున్న పార్లమెంటు సమావేశాల్లో నిలదీస్తామని కెసిఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర అవసరాల కోసం ఎన్నో విజ్ఞప్తులు చేశామని, మంత్రులు, ఎంపిలు ప్రయత్నించారని, అయినా ఫలితం లేదన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలిస్తామని చెప్పినా ఇప్పటివరకు లేనే లేదన్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల అనుభవాల నేపథ్యంలోనే ఈ అంశాన్ని బిల్లులో ఒత్తిడి చేసి పెట్టించుకున్నామని గుర్తుచేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి వర్తింపజేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్, ఐఐఎం... ఇలా అనేకం పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు.

మాకున్న సంపాదన చాలు : కుంభకోణాలకు పాల్పడాల్సిన అవసరం లేదని, ఉన్న సంపాదనతోనే సంతృప్తి చెందాలని తమ కుటుంబ సభ్యులమంతా ఎప్పుడో నిర్ణయించుకున్నామని కెసిఆర్ వ్యాఖ్యానించారు. తన ఆస్తుల్ని ప్రతి ఏటా ఆదాయపు పన్ను రిటన్‌లలో స్పష్టంగా పేర్కొంటున్నానని, క్రమం తప్పకుండా సమర్పిస్తున్నామని, లెక్కలు కచ్చితంగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ ఎలాంటి కుంభకోణాల చరిత్ర తమ కుటుంబంపై లేదని, ఆ అవసరం అంతకన్నా లేదన్నారు. దుర్మార్గమైన సంపాదన అవసరమే లేదన్నారు. రాజకీయాలు వేరు, వ్యక్తిగత జీవితం వేరన్నారు.

106 సీట్లు మావే : కెసిఆర్


రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితిపై రెండుసార్లు సర్వే చేయించానని, ఒక సర్వే నివేదికలో 103 సీట్లు, మరోదాంట్లో 106 సీట్లు వస్తాయని తేలిందని సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. బిజెపికి ఒక్క సీటు కూడా రాదని, కాంగ్రెస్‌కు పది సీట్లకంటే ఎక్కువ రావని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఈ సర్వే జరిగిందని, మొత్తం ఆరున్నర లక్షల మంది నుంచి అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. సన్యాసం తీసుకుంటాం, గడ్డం పెంచుకుంటాం లాంటి వ్యాఖ్యలతో తమకు అవసరమే లేదని, తమ పార్టీ ప్రభావం గురించే సర్వే చేయించుకున్నామని వివరించారు. తెలుగుదేశం పార్టీతో పొత్తు గురించి పాత్రికేయులు ప్రస్తావించగా, ఇప్పుడే దానిపై ఆలోచన అవసరం లేదని, 'నో కామెంట్' అంటూ బదులిచ్చారు

ప్రధానిని నేను దూషించలేదు



ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పర్యటన సందర్భంగా తాను చేసిన ప్రసంగంలో ప్రధానిని దూషించినట్లు బిజెపి నాయకులు విమర్శిస్తున్నారని, కానీ తాను ఎక్కడా ఆ విధంగా తులనాడలేదని, తాను చేసిన ప్రసంగం వీడియోలను పదేపదే పరిశీలించానని, ఎక్కడా కనిపించలేదని కెసిఆర్ వ్యాఖ్యానించారు. లేనిదాన్ని ఉన్నట్లుగా రాజకీయపార్టీలు చిత్రీకరిస్తున్నాయన్నారు. ప్రధానిని తులనాడాల్సిన అవసరమే లేదన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి నాయకులు ఒళ్ళు దగ్గరపెట్టుకోవాలన్నారు. 'వాడు', 'వీడు' అనే పదాలు వినియోగించిన సందర్భం వేరని, తాను వాడిన ప్రతి పదానికి కట్టుబడే ఉన్నానని స్పష్టం చేశారు. ప్రధానిపైన తనకు ప్రత్యేక గౌరవం ఉన్నదని, ఈ దేశానికి ప్రధానికి ఉన్న వ్యక్తిని దూషించే ఉద్దేశం లేనే లేదని, పైగా తామిద్దరం సన్నిహితంగా ఉండే స్నేహితులమని, తానంటే ప్రధానికి చాలా ఇష్టమని వ్యాఖ్యానించారు. దూషించే అలవాటు తనకు లేదని అన్నారు. తాను ప్రజల భాషను మాట్లాడతానని, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సంబంధించిన అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు 'వాడు', 'వీడు' అని ప్రయోగించాను తప్ప ప్రధానిని ఉద్దేశించి కాదన్నారు. ఒకరి కోసం తన భాషను మార్చుకోనని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు నిరాశావాదంలో ఉన్నాయని, రైతులతో పాటు అన్ని సెక్షన్ల ప్రజల అవసరాలను తీరుస్తూ మన్ననలు పొందుతున్నందువల్ల ఆ రెండు పార్టీలో మరో అస్త్రమేమీ లేక ఈ దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయని అన్నారు. ప్రధానిని విమర్శించవద్దని ఎక్కడా రాజ్యాంగంలో రాసిలేదని, విమర్శిస్తేనే జైలుకు పోవాల్సి ఉన్నట్లు ఒక బిజెపి ఎమ్ఎల్ఎ వ్యాఖ్యానిస్తున్నారని, తనను ముట్టుకుంటే భస్మమైపోతారని కెసిఆర్ వ్యాఖ్యానించారు. ప్రధాని సైతం తెలంగాణ పాలనను మెచ్చుకుంటున్నారని గుర్తుచేశారు. డెబ్బై నిమిషాల తన ప్రసంగంలో రెండు నిమిషాలపాటు వున్న పరుష పదాలను పట్టుకుని వేలాడుతున్నారని, మంచివాటిని జీర్ణించుకోలేకనే గాయిగాయి చేస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్‌కు పది సీట్లే వస్తాయి



కాంగ్రెస్‌కు తెలంగాణలో పది సీట్లు మించి రావని కెసిఆర్ వ్యాఖ్యానించారు. బస్సు యాత్రల్లో ఐదారువేల మందికి మించి రావడంలేదని అన్నారు. పదేండ్ల కాంగ్రెస్ పాలనలో రూ. 1.19 లక్షల కోట్ల ద్రవ్య పెట్టుబడి ఉంటే నాలుగేళ్ళలోనే టిఆర్ఎస్ రూ. 1.15 లక్షల కోట్లు కేటాయించిందని అన్నారు. టిఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలన్నీ ప్రజలకు చేరుతూ సంతృప్తి పొందుతూ ఉంటే కాంగ్రెస్‌కు చోటులేకుండా పోయిందని, ఆ నిరాశతోనే విమర్శలు చేస్తోందని అన్నారు. ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినా పది కంటే ఎక్కువ సీట్లు ఆ పార్టీకి రావన్నారు. ప్రజలు అడగకుండానే రైతులకు పెట్టుబడి, కెసిఆర్ కిట్, కల్యాణలక్ష్మి, హాస్టళ్ళలో సన్నబియ్యం.. .ఇలా ఎన్నో ఇస్తున్నామని గుర్తుచేశారు.



ఉమ్మితో షుగర్ టెస్ట్ : మంత్రి కెటిఆర్

మన తెలంగాణ/తూప్రాన్ : తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో వైద్య విధానంలో అనేక మార్పులు వచ్చాయని మంత్రి కెటిఆర్ అన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులు అంటే ప్రజలు జంకే పరిస్థితి ఉండేదని, నేడు టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు జరుపుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన కెసిఆర్ కిట్ ఎంతో ఫలితాన్ని ఇచ్చిందని, ఈ పథకం ద్వారా గతంలో కంటే 40 శాతం ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలో నూతనంగా నిర్మించిన దయబెటోమిక్స్ పరిశ్రమను శనివారం నాడు మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు 1లక్ష 80వేల కెసిఆర్ కిట్లను విజయవంతంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. సామాన్యుడికి సైతం తక్కువ ధరలో మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాలలో మెడికల్ డివైస్ పార్కును నిర్మిస్తున్నామన్నారు. దేశంలో 7.2 కోట్ల మంది షుగర్ వ్యాధితో బాధ పడుతున్నారని, ముప్పిరెడ్డిపల్లిలో నేడు ప్రారంభించిన దయబెటోమిక్స్ పరిశ్రమలో తయారైన పరికరంతో రూ.67ల కంటే తక్కువ ఖర్చుతో షుగర్ టెస్ట్‌ను ఇంటి వద్దే ఉండి కేవలం ఉమ్మి ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

యువతి దారుణ హత్య

మన తెలంగాణ/మిరుదొడ్డి : సిద్దిపేట జిల్లా, మిరుదొడ్డి మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఇంటర్ చదువుతున్న యువతి దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. డిసిపి నర్సింహారెడ్డి అందించిన వివరాల ప్రకారం రుద్రారం గ్రామానికి చెందిన జట్లకాడి సంజీవ్ రెండవ కుమార్తె సుహాసిని (18) మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నది. శుక్రవారం ఉదయం పరీక్ష రాసి వచ్చిన అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వ్యవసాయ పనుల నిమిత్తం మొక్కజొన్న చేనుకు వెళ్లిన సుహాసిని రాత్రి 10 గంటలైనా ఇంటికి రాలేదు. తండ్రి సంజీవ్ పరిసర ప్రాంతాల్లో వెతికినా కనబడక పోయేసరికి మొక్కజొన్న చేనులోకి వెళ్లి వెతకగా కాలిన శవమై కనిపించిందని తెలిపారు. దాంతో షాక్‌కు గురైన అమ్మాయి తండ్రి విషయాన్ని పోలీసులకి తెలపడంతో మిరుదొడ్డి ఇన్స్పెక్టర్ విజయ్ భాస్కర్ సంఘటనా స్థలాన్ని సందర్శించి ఉన్నతాధికారులకు తెలుపగా డిసిపి నర్సింహారెడ్డి, ఎసిపి రామేశ్వర్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అక్కడ అనుమానాస్పదంగా కిరోసిన్ డబ్బా దొరికినట్లు తెలిపారు. జాగిలాలను రప్పించిన పోలీసులు సంజీవ్ పెద్ద కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రేమికుడి ఇంటి ముందు మౌనదీక్ష



వరంగల్ రూరల్ : ప్రేమ పేరుతో తనను మోసం చేసిన ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు నిరసనకు దిగిన ఘటన వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం నర్సింగాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో గతకొంత కాలంగా ప్రేమలో ఉంది. అయితే కొన్నిరోజులుగా యువతిని దూరం పెడుతున్నాడు సదరు యువకుడు. దాంతో యువతి ప్రియుడు ఇంటి ముందు మౌన దీక్షకు దిగింది. ప్రియురాలి రాకను గమనించిన యువకుడి కుటుంబం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.

శ్రీవారి సర్వదర్శనానికి నాలుగు గంటలు

తిరుమల : తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనం కోసం ఏడు కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి నాలుగు గంటలు, కాలినడక భక్తులకు రెండు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల సమయం పడుతోంది. శుక్రవారం శ్రీవారిని 62,936 మంది దర్శించుకున్నారు. 26,438 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శుక్రవారం శ్రీవారి హుండీకి రూ.2.76 కోట్ల ఆదాయం సమకూరింది.

బిజెపికి కాంగ్రెస్ ప్రాణవాయువు

మండిపడిన పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ శనివారం సిపిఎం, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రంగా మండిపడ్డారు. త్రిపుర శాసనసభ ఎన్నికల్లో వామపక్షాలకు ఎదురైన పరాభవంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఘన విజయం సాధించడానికి అసలు కారణం ఆ పార్టీకి కాంగ్రెస్ ప్రాణవాయువును అందిస్తోందని ఆరోపించారు. సచివాలయం వద్ద విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల ఫలితాలకు నిందను మోయవలసినది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. బిజెపికి ఆక్సిజన్‌ను అందిస్తున్నది కాంగ్రెసేనన్నారు. బిజెపితో పోరాటానికి ఉమ్మడి వేదికను ఏర్పాటు చేద్దామని తాను స్వయంగా చెప్పినట్లు తెలిపారు. కానీ కాంగ్రెస్ అందుకు తిరస్కరించిందన్నారు. బిజెపి భారీగా సొమ్ము వెదజల్లిందని, బయటివారిని తీసుకొచ్చిందని, కేంద్ర బలగాలతో ఎన్నికలను నిర్వహించిందని ఆరోపించారు. ఇవిఎం యంత్రాలతో కూడా సమస్యలున్నాయన్నారు. సీపీఎం ఏమాత్రం పోరాట పటిమ చూపకపోవడం ఆశ్చర్యపరుస్తోందన్నారు. సిపిఎం పూర్తిగా బిజెపికి లొంగిపోయిందని దుయ్యబట్టారు.

పౌరసరఫరాల శాఖ సంస్కరణలు దేశానికే ఆదర్శం

కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ కార్యదర్శి రవికాంత్



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రజా పంపిణీ వ్యవస్థలో వినూత్న సంస్కరణలు తీసుకువచ్చి తెలంగాణ పౌరసరఫరాల శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ కార్యదర్శి రవికాంత్ కొనియాడారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఒపిఎంఎస్), కమాండ్ కంట్రోల్ సెంటర్, గోదాముల్లో సిసి కెమెరాలు, టి–రేషన్ యాప్ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనకు వచ్చిన రవికాంత్, ఎఫ్‌సిఐ అధికారులతో కలిసి శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖలోని కమాంట్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలపై కమిషనర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముషీరాబాద్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌లోని సిసి కెమెరాల పనితీరును, రేషన్ బియ్యం నాణ్యతను పరిశీలించారు. పంజాగుట్టలోని రేషన్ షాపులో ఇ–పాస్ విధానం అమలు తీరును అక్కడి పరిశీలించి, అక్కడి లబ్దిదారులతో మాట్లాడారు. రాష్ట్రాలపై భారం పడకుండా చూడాలని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను త్వరితగతిన విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.4,047కోట్ల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌కౌంటర్ మృతులకు శవ పరీక్షలు

- మృతి చెందిన వారిలో దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, రత్న
- మిగిలిన వారు సుకుమ, దంతెవాడ జిల్లాలకు చెందిన వారిగా గుర్తింపు



మన తెలంగాణ/ ఖమ్మం ప్రతినిధి : ఛత్తీస్‌గఢ్ తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మంది మావోయిస్టుల మృతదేహాలకు హైకోర్టు నిబంధనల నడుమ శవ పరీక్షలు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రానికే రెండు మృతదేహాలు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా మిగిలిన ఎనిమిది మృతదేహాలను శనివారం తరలించారు. వరంగల్లుకు చెందిన ఫోరెన్సిక్ నిపుణులు, భద్రాచలంకు చెందిన సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో వీడియో చిత్రీకరణల మధ్య శవ పరీక్షలను నిర్వహించారు. శవ పరీక్షకు ముందు శనివారం ఉదయం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులను గుర్తించారు. మృతిచెందిన వారిలో వరంగల్లు జిల్లా కమిటీ సభ్యుడు దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ ఉన్నారు. ఈయన హన్మకొండకు చెందిన వాడిగా గుర్తించారు. ఇతనితో పాటు మృతి చెందిన రత్న కూడా వరంగల్లు జిల్లాకు చెందిన జిల్లా కమిటీ సభ్యురాలిగా గుర్తించారు. మిగిలిన వారంతా ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమ, దంతెవాడ జిల్లాలకు చెందిన వారిగా పోలీసులు ధృవీకరించారు. రామే, మల్లేష్, కమల, కోసి, సుక్కి, బుద్రి, సోంది మొదలైన వారు మృతుల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు మృతుల కుటుంబ సభ్యులు ఎవరు మృతదేహాలను తీసుకెళ్లేందుకు రాలేదు. దీంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలను భద్రపరిచారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి బడే చొక్కారావు, ఇతర నేతలు తప్పించుకున్నట్లు సమాచారం.

ఆగని కాల్పులు: శుక్రవారం ఎన్‌కౌంటర్ తదనంతరం శనివారం కూడా ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దులు తుపాకుల మోతలతో దద్దరిల్లాయి. శనివారం ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న నేతలు సమీపంలోని కోడిపుంజుల గుట్టల్లో తలదాచుకున్నారన్న సమాచారం మేరకు ఛత్తీస్‌గఢ్ తెలంగాణకు చెందిన పోలీసు బలగాలు చుట్టు ముట్టాయి. శనివారం సాయంత్రం వరకు అటు ఛత్తీస్‌గఢ్ ఇటు తెలంగాణ ప్రాంతానికి చెందిన పోలీస్ బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుంటూనే ఉన్నాయి. ఏ క్షణం ఏం జరుగుతుందోనని ఏజెన్సీలోని ప్రజలు భీతిల్లుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన పోలీసు అధికారులతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి అంబర్‌కిషోర్ ఝూ మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరైనా ఏపే నారాయణ అలియాస్ హరిభూషణ్ ఉరఫ్ జగన్ మళ్లీ తప్పించుకున్నాడు. 2016 నుంచి జరిగిన అనేక ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న హరిభూషణ్ మరో సారి అత్యంత చాకచాక్యంగా తప్పించుకుని పోలీసులకు సవాల్ విసిరాడు. నాలుగేళ్ల నుంచి తెలంగాణలో మావోయిస్టు పార్టీని విస్తృత పరిచేందుకు ప్రత్యేక దృష్టిసారించిన ఆయన ఇటీవల భారీ ఎత్తున దళాల్లోకి రిక్రూట్‌మెంట్ చేశారు. దళాల్లో చేరిన కార్యకర్తలకు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఎప్పటికైనా కౌంటర్ తప్పదు : జగన్

హరిభూషణ్, చొక్కారావు అక్కడ లేరు

పోలీసులు జరిపిన హత్యాకాండకు కౌంటర్ తప్పదని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలతో మాట్లాడుతూ సేదతీరుతున్న సమయంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఏకపక్షంగా కాల్పులు జరిపారని తెలిపారు. ఇందులో పోలీసులు పేర్కొన్నట్లు హరిభూషణ్, బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి లేరన్నారు. కార్పొరేట్ శక్తులకు నీరు, భూమి ధారాదత్తం చేసేందుకే నియంత కెసిఆర్ బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నాడని ఇకపై మేము టిఆర్ఎస్ నేతలపై దాడులు ముమ్మరం చేస్తామని ఆ ప్రకటనలో తెలిపారు. హిందూత్వ నాయకుడు రమణ్‌సింగ్, నియంత కెసిఆర్‌లు ఆదివాసీలపై, ప్రశ్నించే వారిని నిర్మూలించేందుకు దుర్మార్గమైన దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎన్‌కౌంటర్ తర్వాత మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఎవరూ లేరని తెలిసినా ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు అబద్ధాలు ప్రచారం చేశారని, ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీసే యత్నం చేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా దాడులు చేస్తున్నాయని ప్రజల సహకారంతో దీనిని తిప్పికొడతామన్నారు.

తెలంగాణ గ్రేహౌండ్స్ కీలక భూమిక

మన తెలంగాణ/ ఖమ్మం ప్రతినిధి : తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా హరిభూషణ్ నియమితులైన తర్వా పలు ప్రాంతాల్లో రిక్రూట్‌మెంట్ జరిపారు. వందల మందిని రిక్రూట్ చేసి ఛత్తీస్‌గఢ్ అడవులకు పంపారు. ముఖ్యంగా కెకెడబ్ల్యూ (ఖమ్మం, కరీంనగర్, వరంగల్లు) ఏరియా కమిటీ కీలక భూమిక పోషించింది. భూపతిరావుపేట దాడిలో పాల్గొన్న 20మందిలో ఎక్కువ మంది తెలుగు మాట్లాడే వారే పాల్గొనడం, తెలంగాణ యాసలో మాట్లాడుతుండడం రిక్రూట్‌మెంట్‌ను ధృవీకరిస్తుంది. రిక్రూట్‌మెంట్‌ను పసిగట్టిన తెలంగాణ పోలీసులు మావోయిస్టు పార్టీపై ప్రత్యేక దృష్టిసారించారు. గోదావరి పరివాహక ప్రాంతం ఛత్తీస్ గఢ్ సరిహద్దుకే పరిమితం చేయాలన్న వ్యూహంతో ప్రత్యేక బలగాలను సరిహద్దుకు తరలించారు. తరచూ ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ, సంప్రదింపులు జరుపుతూ సంయుక్త దాడులు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ గ్రేహౌండ్స్ దళాలే కీలక భూమిక పోషించింది. వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాలు సరిహద్దుగా ఛత్తీస్‌గఢ్ అడవులలో నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి రాకుండా పోలీసులు అడ్డుకుని విజయవంతమయ్యారు. వరుస ఘటనలలో పోలీసులే పై చేయి సాధించారు. గోదావరి ఈవల దాదాపు నక్సల్స్ కార్యక్రమాలు క్రమేపి తగ్గిపోయాయి. గతంలో వరంగల్లు, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో కీలక భూమిక పోషించిన సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ చీలికలు, పేలికలై బలహీనపడింది. ఇటీవలి కాలంలో దళ కమాండర్లు లొంగిపోవడం, లేదా పోలీసులు అరెస్టు చేయడంతో దాదాపు ఎన్ది దళాలు కనుమరుగయ్యాయి. ఇదే అవకాశంగా ఖమ్మం, వరంగల్లు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో ప్రవేశించాలనుకున్న మావోయిస్టులకు వరుస ఘటనలు ప్రతికూలంగా మారుతున్నాయి. నూతనంగా మావోయిస్టు దళాల్లో చేరిన వారు సైతం ఛత్తీస్‌గఢ్ అడవులకే పరిమితమయ్యారు. వరంగల్లు జిల్లా కొత్తగూడ మండలం మర్రిగూడెంకు చెందిన హరిభూషణ్‌కు తెలంగాణ అటవీ ప్రాంతంపై గట్టి పట్టు ఉండడంతో పాటు మంచి వ్యూహకర్తగా పేరుంది. దళాల వైపు యువతను మళ్లించడంలో నిష్ణాతుడు అందుకే తెలంగాణ బాధ్యతలు ఆయనకు అప్పగించారు.

కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు

- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్



మన తెలంగాణ/ శామీర్‌పేట(మేడ్చల్ జిల్లా) : కేసుల పరిష్కారంలో ప్రత్యామ్నాయ మార్గాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి , నల్సార్ చాన్సలర్ రమేశ్ రంగనాథన్ అన్నారు. శనివారం శామీర్‌పేట నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయంలో జరిగిన 16వ స్నాతకోత్సవంలో ఎ.డి.ఆర్, ఎఫ్.డి.ఆర్ పి జి డిప్లొమా పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తు దేశవ్యాప్తంగా కోర్టులలో 3.25 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి 350 ఏళ్లు పడుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 12.35 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు 150 వరకు కేసులు పరిష్కారం అవుతున్నా అదనంగా కేసులు వస్తున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులకు సత్వర పరిష్కారం కావాలంటే మధ్యవర్తిత్వం కావాలన్నారు. న్యాయ వ్యవస్థలో కోర్టులు, జడ్జిలు తక్కువగా ఉన్నందున, కావల్సిన సౌకర్యాలు లేక కేసులు పెండింగ్ పడుతున్నాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో కొన్ని కేసులు పరిష్కరించ బడుతున్నాయని చెప్పారు. న్యాయవ్యవస్థలో కోర్టుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎడిఆర్, ఎఫ్‌డిఆర్ కోర్సులలో డిప్లొమా పూర్తి చేసిన న్యాయవాదులు మధ్యవర్తిత్వాన్ని వహించి న్యాయవ్యవస్థకు సహకరించాలని సూచించారు. ఎ.డి.ఆర్, ఎఫ్.డి.ఆర్ కోర్సులలో 157 మంది పట్టాలను ప్రదానం చేయగా పిజి డిప్లొమా ఎడిఆర్ రెగ్యులర్ కోర్సులో సయ్యద్ ముజీబ్‌కు గోల్డ్ మెడల్‌ను సాధించగా, ప్రవీణ్ కుమార్ వెండి పతకం సాధించారు. ముందుగా రమేశ్ రంగనాథన్ జ్యోతి ప్రజ్వలన చేయగా ఐసిఎడిఆర్ హైదరాబాద్ ఇంచార్జీ జె.ఎల్.ఎన్.మూర్తి స్వాగతోపన్యాసం చేశారు. నల్సార్ వైస్ చాన్స్‌లర్ ఫైజాన్ ముస్తాఫ, రిజిస్ట్రార్ బాలకిష్టారెడ్డి, నల్సార్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిగంబర కవులలో నిఖిలేశ్వర్‌కు చారిత్రక స్థానం

- నిఖిలేశ్వర్ కవితా సంపుటి ఆవిష్కరణలో పలువురు కవులు, వక్తలు



మన తెలంగాణ / హైదరాబాద్: దిగంబర కవులలో నిఖిలేశ్వర్‌కు ఒక విశిష్టమైన స్థానముందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దిగంబర కవులలో ఎవరి శైలి, ఎవరి భావం వారికున్నప్పటికీ అందులో నిఖిలేశ్వర్ స్థానానికి అరుదైన చారిత్రక నేపథ్యముందన్నారు. ఐదు దశబ్దాల నిఖిలేశ్వర్ కవిత్వాలను కూర్చి (1965– 2015) రూపొందించిన కవితల సంపుటి ''నిఖిలేశ్వర్ కవిత్వం'' పేరుతో రచించిన పుస్తకాన్ని ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత కె.శివారెడ్డి ఆవిష్కరించగా, 2015– 17 వరకు రాసిన కవిత్వాలను ''అగిశ్వాస'' పేరుతో మరో పుస్తకాన్ని, ''అనుసృజన'' అనే మరో కొత్త పుస్తకాన్ని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. కె.శివారెడ్డి మాట్లాడుతూ ''కల జీవితంలో చాలా ఉన్నతమైన చర్యని.. దాని ఆచరణ మాత్రం ఆగమ్యగోచరమైనదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంటరీ కమ్యూనిస్టులు బూర్జువాల పాలకుల కంటే తక్కువేం కాదని నిరూపించడానికి నేటి త్రిపుర ఎన్నికలే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.నవోదయ సాహితి సాంస్కృతిక సంస్థ ప్రతినిధి డాక్టర్ యస్.జతిన్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

రోడ్డు ప్రమాదాలు..నలుగురు మృతి

- మహబూబ్‌నగర్‌లో బైక్‌ను ఢీకొన్న కారు ఇద్దరు మృతి
- హైదరాబాద్‌లో బైక్ అదుపు తప్పి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



మన తెలంగాణ/పెబ్బేరు: మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్‌తోపాటు మరొకరు మృతి చెందగా, రేషన్ డీలర్ భార్య సర్పంచ్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. కొత్తకోట సిఐ కథనం ప్రకారం... సంపట్‌రావుపల్లికి చెందిన రేషన్ డీలరు ఆంజనేయులు (50), అతని భార్య సర్పంచ్ పద్మమ్మలు మహబూబ్‌నగర్ జిల్లాలో సర్పంచ్‌ల సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యేందుకు సంపట్‌రావు పల్లి నుండి మోటార్ సైకిల్‌పై పెబ్బేరుకు వెళ్తున్నారు. పెబ్బేరు నుంచి యాపర్లకు రేషన్ బియ్యాన్ని తీసుకెళ్తున లారీ (ఎపి 27 డబ్ల్యు2898) ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. అంతేకాకుండా లారీని అదుపు చేసే క్రమంలో లారీ డ్రైవర్ పక్కనే బస్టాప్ వైపు మళ్లించడంతో చిన్నగుమ్మడానికి చెందిన సుశీలమ్మ పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రేషన్‌డీలరు ఆంజనేయులు, సుశీలమ్మలు అక్కడికక్కడే మృతి చెందగా, డీలర్ భార్య పద్మమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. అదే సమయంలో కలెక్టర్ శ్వేతామహంతి గుమ్మడం నుండి పెబ్బేరు వైపు వస్తూ సర్పంచ్ పద్మమ్మను తన కారులో పెబ్బేరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. లారీలో రేషన్ బియ్యం ఉండడం వల్ల మృతదేహాలను క్రేన్ సహాయంతో తీసేందుకు దాదాపు 4 గంటల సమయం పట్టింది. గ్రామస్తులు రాస్తారోకో ధర్నా నిర్వహించారు. మృతిచెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.. శ్రీరంగాపురం ఎస్ఐ సురేష్, వీపనగండ్ల ఎస్ఐ . సాయిచంద్రప్రసాద్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

మన తెలంగాణ/అబ్దుల్లాపూర్‌మెట్ : కళాశాలకు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన అబ్దులా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన బుర్ర నర్సింహా గౌడ్ కుమారుడు బుర్ర లోకేష్‌గౌడ్(20) దేశ్‌ముఖిలో గల విజ్ఞాన్ కళాశాలలో రెండవ సంవత్సరం బిఫార్మసీ చదువుతున్నాడు. ఇదే కళాశాలలో సిఎస్ఈ మూడవ సంవత్సరం చదువుతున్న వనస్థలిపురంకు చెందిన వైష్ణవి(20), లోకేష్ గౌడ్‌లు బైక్‌పై విజ్ఞాన్ కళాశాల వైపు వెళ్తుండగా కవాడిపల్లి సమీపంకు రాగానే అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన వీరిని హాస్పటల్‌కు తరలించగా అప్పటికే ఇరువురు మృతి చెందారు. ఈ మేరకు సిఐ ముని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ అంత్యక్రియలు పూర్తి

బెంగళూరు : తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు హతమయ్యారు. మావోల కాల్పుల్లో గ్రేహౌండ్స్ కానిస్టుబుల్ సుశీల్ కుమార్ అమరుడయ్యారు. సుశీల్ అంత్యక్రియలు శనివారం కర్నాటకలోని బీదర్‌లో జరిగాయి. 20 ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లాకు వచ్చి ఇక్కడే ఆయన కుటుంబం స్థిర నివాసం ఏర్పరచుకుంది. జహీరాబాద్, సదాశివపేటలో ఆయన విద్యాభ్యాసం చేశారు. అనంతరం సుశీల్‌కుమార్ పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై పలు పోలీసు స్టేషన్లలో పని చేశారు. 2014లో ఆయన గ్రేహౌండ్స్‌కి పదోన్నతిపై వెళ్లారు. సుశీల్‌కుమార్ అంత్యక్రియలకు తెలంగాణ డిజిపి మహేందర్‌రెడ్డి, ఇంటలిజెన్స్ ఐజి నవీన్‌చంద్, సంగారెడ్డి ఎస్‌పి చంద్రశేఖర్‌రెడ్డి, బీదర్ ఎస్‌పి దేవరాజ్ తదితరులతో పాటు పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు.

నరేంద్ర మోడీ నిరాకరించారు : స్టాలిన్

చెన్నై: కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు కోసం తమిళనాడు అఖిలపక్షం, రైతు ప్రతినిధుల బృందాన్ని కలవడానికి ప్రధాని మోడీదీ నిరాకరించారని డిఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ శనివారం ఆరోపించారు. ఫిబ్రవరి 16న సుప్రీం కోర్టు తమిళనాడుకు కావేరీ జలాల కేటాయింపులను 177.25 టిఎంసిలకు తగ్గిస్తూ తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. తీర్పు మందు వరకు 2007 నుంచి తమిళనాడు వాటా 192టీఎంసీలు. అదేరోజు ఆరువారాల్లోగా కావేరీ వాటర్ రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిలో భాగంగా కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు కోసం తమిళనాడు, అఖిల పక్షం రైతు ప్రతినిధుల బృందాన్ని కలవడానికి మోదీ నిరాకరించారు. ప్రధాని తిరస్కారాన్ని ప్రస్తావిస్తూ..తమిళనాడు ప్రజలకు జరుగుతున్న అన్యాయంగా స్టాలిన్ అభివర్ణించారు. దీనిపై చర్చించడానికి ముఖ్యమంత్రి పళని స్వామి అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. 'అఖిల పక్షాన్ని కలవడానికి బదులు సంబంధిత మంత్రిని కలుస్తానని ప్రధాని సలహా ఇచ్చారు. ఇది తమిళనాడు ప్రజలకు జరిగిన తీవ్ర అన్యాయం. దీనికి సంబంధించి అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారు' అని ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అంతేకాకుండా తమిళనాడు ఎంపిలంతా రాజీనామా చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రతిపాదనపైనా ముఖ్యమంత్రితో మాట్లాడ మన్నారు. దీనిపై అసెంబ్లీ సమావేశంలో చర్చిద్దామని ముఖ్యమంత్రి అన్నారని స్టాలిన్ వెల్లడించారు.

కలుషిత ఆహారం తిని

125 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలు

రాయ్‌పూర్: కలుషిత ఆహారం తిన్న 125 మంది స్కూలు విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. చత్తీగఢ్, సూరజ్‌పూర్ జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయలో ఈ ఘటన చోటు చేసుకుంది. అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ఎక్కువమంది 9, 11 తరగతులవారు ఉన్నారు. విద్యార్థులు 'దహీ వడ' తిన్నాక ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, తలనొప్పి, జ్వరంతో బాధపడుతుండడంతో వెంటనే వారిని ఆసుపత్రికి తరలించినట్టు సూరజ్‌పూర్ కలెక్టర్ కేసీ దేవ్‌సేనాపతి తెలిపారు. ఆసుప్రతి నుంచి ఇప్పటి వరకు 20 విద్యార్థులు డిశ్చార్జ్ కాగా మిగతా వారు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు. కాగా, మరో ఘటనలో బోరు నీళ్లు తాగిన 45 మంది అస్వస్థతకు గురయ్యారు. జంజ్‌గిర్ చంపా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఎత్తు పల్లాల బతుకు విజయం

ఆటో డ్రైవర్ బిడ్డ న్యాయమూర్తి

డెహ్రాడూన్ : ఆటో డ్రైవర్ ఏకైక కూతురు న్యాయమూర్తి కానున్నారు. ఉత్తరాఖండ్‌కు చెందిన పూనమ్ టోడీ ప్రొవిన్సియల్ సివిల్ సర్వీసెస్ జుడిషియల్ పరీక్షలలో ప్రథమ ర్యాంకు సాధించింది. పేదలకు న్యాయం చేయాలనే తపనతో పెరిగిన టోడీ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో న్యాయవిద్యను అభ్యసించింది. మధ్య తరగతి కుటుంబం, తండ్రి ఆటోనడిపితే వచ్చే డబ్బులతో సాగే జీవనం . ఒక్కతే కూతురు కావడంతో తల్లిదండ్రులు ఆమెను గారబం చేశారు. అయితే ఇదే సమయంలో బాధ్యతాయుతంగా ఉండటం కూడా నేర్పారు. బిఎ చేసి తరువాత ఎల్ఎల్‌బి తరువాత ఎల్ఎల్ఎం చేసిన టోడీ జుడిషియల్ పరీక్షకు రెండు సార్లు హాజరు అయింది, పాసైనా ఇంటర్వ్యూల స్థాయి వరకూ వెళ్లలేకపోయింది. అయితే ఓటమి పెంచిన పట్టుదలతో మూడో సారి పరీక్షకు వెళ్లి అన్నింటా విజయం సాధించింది. త్వరలోనే జడ్జి అయ్యేందుకు సిద్ధంగా ఉంది. ప్రజలకు సేవ చేయడానికి న్యాయమూర్తి పదవి కీలకం . ఇది తనకు వస్తున్నందుకు ఆనందంగా ఉంద టోడీ చెప్పింది.

భవిష్యత్తు గురించి ఆలోచించేదాన్ని

తెరపై అద్భుతంగా ప్రేమను పండించే కొన్ని జంటలు నిజ జీవితంలో కూడా ప్రేమలో పడి... విడిపోతుంటారు. సినీ లోకంలో ఇది సాధారణ విషయంగా మారింది. ప్రేమ విషాదం కొందరి సినీ జీవితాలనే కాకుండా వ్యక్తిగత జీవితాలపై సైతం తీవ్ర ప్రభావం చూపింది. బాలీవుడ్ హాట్ బ్యూటీ కత్రినాకైఫ్ సైతం ప్రేమలో విఫలమై చెప్పడానికి వీలుకాని బాధను అనుభవించిందట. ముందుగా కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌తో ప్రేమలో పడ్డ ఈ భామ... ఆ బంధం తెగిపోయాక ఆ బాధ నుంచి విముక్తి కావడానికి చాలా కష్టపడింది. అనంతరం మరో హీరో రణబీర్ కపూర్‌తో ప్రేమను పంచుకున్న కత్రినాకు... ఈ బంధం నుంచి కూడా విడిపోక తప్పలేదు. అయితే ఆ వేదన నుంచి బయటపడడానికి వ్యాయామాన్ని ఆసరాగా తీసుకున్నానని... ఒక్కోసారి అతిగా వ్యాయామం చేసేదాన్నని, అప్పుడే ఆ బాధను మరచిపోయేదాన్నని పేర్కొంది. రణబీర్‌తో తన బ్రేకప్... అనంతరం పరిణామాలు వంటి విషయాలపై కత్రినా ఇటీవల మాట్లాడింది. ''ప్రేమలో బ్రేకప్ తర్వాత ఎక్కువగా జిమ్‌కు వెళ్లేదాన్ని. ఒక్కోసారి పిచ్చిపట్టినట్టుగా అనిపించేది. దీంతో వ్యాయామంపై మరింత దృష్టి పెట్టేదాన్ని. అతిగా కసరత్తులు చేసేదాన్ని. నా కలల గురించి... భవిష్యత్తు గురించి తీవ్రంగా ఆలోచించేదాన్ని. వ్యాయామం వల్ల క్రమశిక్షణతో పాటు, మానసిక బలం కూడా పెరిగింది. క్రమంగా నేను ఆ బాధ నుంచి తేరుకొని కెరీర్‌పై తిరిగి దృష్టిపెట్టగలిగాను''అని కత్రినా వివరించింది.



రోజుకో ప్రత్యేకత
'ఛల్ మోహన్ రంగ'



నితిన్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ వారు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే 'గ ఘ మేఘ...' పాటను విడుదల చేసి శ్రోతలను మైమరపించిన చిత్రబృందం ఇప్పుడు 'వారం' గీతంను విడుదల చేసి వారిని అలరించింది. 'గ ఘ మేఘ' పాటతో ప్రేక్షకులకు మంచి మెలోడీని అందించిన తమన్ ఈసారి మంచి డాన్స్ నెంబర్‌తో వచ్చారు. ఆయన పాటల్లో ట్యూన్‌కి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో సంగీతవాయిద్యాలకు అంతే ప్రాముఖ్యత ఉంటుంది. చక్కటి సంగీతానికి మంచి సాహిత్యం తోడైతేనే ఆ పాట ప్రేక్షకుల హృదయాలలో ఎక్కువ రోజులు నిలుస్తుంది. వారంలో ఏడు రోజులు ఉంటే.. .ఒక్కో రోజుకి ఒక్కో ప్రత్యేకత ఉందంటూ తనదైన చమత్కారాన్ని వాడి కేదారనాథ్ ఈ పాటను అద్భుతంగా రాశారు. నాకాష్ అజీజ్ తన చక్కటి స్వరంతో ఈ పాటను శ్రోతలకు అందించారు. ఇక అద్భుతమైన సంగీత, సాహిత్యాల కలబోత ఈ చిత్రంలోని పాటలు అని అన్నారు దర్శకుడు కృష్ణచైతన్య. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు నిర్మాత ఎన్.సుధాకర్ రెడ్డి ప్రకటించారు. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య తదితరులు ఈ చిత్రంలోని ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి కెమెరాః ఎస్.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్ః ఎస్.ఆర్.శేఖర్, డ్యాన్స్ః శేఖర్ వి.జె, ఫైట్స్ః స్టంట్ సిల్వ, రవివర్మ.



రైతు బతకాలి ప్రపంచాన్ని బతికించాలి

స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై ఆర్.నారాయణమూర్తి రూపొందిస్తున్న చిత్రం 'అన్నదాతా సుఖీభవ'. ఈ చిత్రం గురించి హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ''ఉదయాన్నే నాగలిని భుజాన వేసుకొని పొలానికి వెళ్లి పనులు చేస్తూ అందరికీ అన్నం పెట్టే రైతు పరిస్థితి నేడు దయనీయంగా మారింది. రైతు తన ఉనికిని కోల్పోతున్నాడు. దేశానికి వెన్నెముక అయిన రైతు వెన్నెముక విరిగిపోతోంది. అన్నదాతా సుఖీభవ కాస్త... అన్నదాతా దుఃఖీభవ అయిపోయింది. కారణం ఏమిటంటే రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడమే. 2009 నుంచి నేటి వరకు మూడు లక్షల ఇరవై వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అది మన దౌర్భాగ్యం. రైతు బతకాలి... ప్రపంచాన్ని బతికించాలి. 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం స్వామినాథన్ కమీషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమీషన్ చేసిన సిఫార్స్ ఏమిటంటే... రైతు పంటకు ఉన్న ధర కంటే 50 శాతం అదనంగా ఇవ్వాలని చెప్పారు. అప్పుడే రైతు బావుంటాడని చెప్పినా అది అమలుకాలేదు. దాన్ని అమలు చేయాలని చెప్పడమే మా సినిమాలోని కాన్సెప్ట్. నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి అప్పట్లో రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించి వారిని ఆదుకున్నారు. కానీ నేడు ఎవరూ అలా చేయడం లేదు. వ్యవసాయం దండగ కాదు... పండుగ అని చెప్పే చిత్రమే 'అన్నదాతా సుఖీభవ'. ఈ సినిమాలో వంగపండు రాసిన పాటను బాలసుబ్రమణ్యం ఎంతో గొప్పగా పాడారు. గద్దరన్న, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమాను మా గురువు దాసరి నారాయణరావుకు అంకితమిస్తున్నాం''అని అన్నారు. ఇక థియేటర్ల బంద్ గురించి ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ''డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు వ్యతిరేకంగా నేడు దక్షిణాది సినిమా పరిశ్రమ చేస్తున్న పోరాటం చాలా గొప్పది. చాలాసార్లు వారితో చిత్రపరిశ్రమ వారు చేసిన చర్చలు విఫలమయ్యాయి. సినిమా పరిశ్రమలు ఎంతో దోపిడీకి గురవుతున్న నేపథ్యంలో చేస్తున్న పోరాటమిది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు అగ్రిమెంట్ ప్రకారం డిజిటల్ రేట్లు ఆపకపోగా పెంచుకుంటూ పోతున్నారు. హాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలలో లేని ఛార్జీలు మన ప్రాంతీయ భాషల సినిమాలపైనే ఎందుకు. థియేటర్ల బంద్‌కు ప్రజలు పూర్తిగా సహకరించాలి''అని చెప్పారు.

జూన్ 14న సవ్యసాచి

'ప్రేమమ్' వంటి సూపర్‌సక్సెస్ సినిమా అనంతరం అక్కినేని నాగచైతన్య, చందు మొండేటిల క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'సవ్యసాచి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మైత్రీ మూవీ మేకర్స్. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్‌లు మాట్లాడుతూ ''మా యూనిట్ సభ్యులందరికీ 'సవ్యసాచి' ఒక స్పెషల్ ఫిలిమ్. ప్రస్తుతం హైదరాబాద్‌లో నాగచైతన్య, భూమికలపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్ పూర్తి కాగానే నెక్స్ట్ షెడ్యూల్ కోసం అమెరికా వెళ్లనున్నాం. సినిమా ఫస్ట్‌లుక్‌ను ఈనెల 18న విడుదల చేయాలనుకుంటున్నాం. ఈ చిత్రాన్ని జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నాం. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే స్థాయిలో సినిమా ఉంటుంది. ఆర్.మాధవన్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇక 'బాహుబలి' తర్వాత కీరవాణి 'సవ్యసాచి'కి సంగీతాన్ని అందించారు''అని తెలిపారు. నాగచైతన్య, నిధి అగర్వాల్, ఆర్.మాధవన్, భూమిక చావ్లా, రావు రమేష్, వెన్నెల కిషోర్, సత్య, తాగుబోతు రమేష్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణంః యువరాజ్, కళః రామకృష్ణ, కూర్పుః కోటగిరి వెంకటేశ్వరరావు, పోరాటాలుః రామ్‌లక్ష్మణ్.



నాగచైతన్య

ఆన్‌లైన్‌లో 'ఏ మంత్రం వేశావే'

పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాలతో యూత్‌లో మంచి పాపులారిటీ సంపాదించుకున్నాడు యంగ్ హీరో విజయ్ దేవరకొండ. ఈ యువ కథానాయకుడు నటించిన తాజా చిత్రం 'ఏ మంత్రం వేశావే'. శివానీసింగ్ కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి. అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈనెల 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శక నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ ''నేడు అందరూ సోషల్ మీడియాకు బానిసలైపోయారు. ఈ కాన్సెప్ట్‌తో చేసిన సినిమాయే 'ఏ మంత్రం వేశావే'. కంప్యూటర్ గేమ్స్‌కు బానిసైన హీరోను ఆన్‌లైన్‌లో పరిచయమైన హీరోయిన్ ఎలా మార్చుకుంది... తనకు మానవ విలువలు, సంబంధాలను ఎలా తెలియజేసిందనేదే ఈ కథ. రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకొని క్లీన్ 'యు' సర్టిఫికెట్ పొందింది. మల్కాపురం శివకుమార్ సహకారంతో ఈ చిత్రాన్ని ఈనెల 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. దర్శకుడిగా నా తొలి చిత్రమిది. 'అర్జున్‌రెడ్డి' చిత్రం తర్వాత విజయ్ దేవరకొండ చేస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. ఆ అంచనాలను అందుకునేలా ఈ సినిమా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందింది. కుటుంబంలో అందరూ చూసేలా సినిమాను తెరకెక్కించాం''అని అన్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''ఎవడే సుబ్రమణ్యం, పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాలతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న విజయ్ దేవరకొండ నటించిన చిత్రమిది. నేను గత ఏడాది నవంబర్‌లో ఈ సినిమా చూశాను. నచ్చడంతో ఈ సినిమాను విడుదల చేయడానికి ముందుకు వచ్చాను. రెండు తెలుగు రాష్ట్రాలలో అత్యధిక థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం''అని చెప్పారు.



శ్రీధర్ మర్రి, మల్కాపురం శివకుమార్

ప్రాంతీయ భాషల సినిమాలకే ఎందుకు?



థియేటర్ల బంద్ గురించి మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''దీన్ని థియేటర్ల బంద్ అనడం కంటే నిరసన వ్యక్తం చేయడం అనవచ్చు. గతంలో థియేటర్లలో ప్రొజెక్టర్‌ను ఏర్పాటుచేయడానికి 4, 5 లక్షల రూపాయలు ఖర్చవుతుందని అన్నారు. ఎగ్జిబిటర్లు అందరూ అంత మొత్తాన్ని ఒకేసారి కట్టలేరని 104 వారాల్లో ఆ మొత్తాన్ని కట్టేలాగా, అది పూర్తయిన తర్వాత రెండు నుండి మూడు వేల వరకు సర్వీస్ ఛార్జీలు కడితే సరిపోతుందని ఒప్పందం కుదిరింది. వారి మాటలు నమ్మి ఎగ్జిబిటర్స్ అందరూ సంతకాలు పెట్టారు. ఆ మాట ప్రకారం ఓ సినిమాకు తొలి వారంలో 1012 వేలు, రెండో వారంలో 8 వేలు, మూడో వారంలో 6 వేల రూపాయలను వసూలు చేశారు. ఇప్పుడు చెప్పిన సమయం ముగిసినా కూడా ఛార్జీలు వసూలు చేయడం మానలేదు. వీరికి మన చిత్ర పరిశ్రమలోని కొందరి నుండి మద్దతు కూడా లభించింది. దీనివల్ల చిన్న నిర్మాతలు ఎంతో నష్టపోతున్నారు. హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలకు లేని డిజిటల్ ఛార్జీలు ప్రాంతీయ భాషల సినిమాలకే ఎందుకో అర్థం కావడం లేదు. దాంతో సర్వీస్ ప్రొవైడర్లకు వ్యతిరేకంగా దక్షిణాది చిత్రపరిశ్రమ నిరసన వ్యక్తంచేస్తోంది. ఈ నిరసనలో దాదాపు రెండు లక్షల మంది మాకు మద్దతునిస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య సమసిపోతుందని భావిస్తున్నాం''అని చెప్పారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో?

పుష్పక విమానం,ఆదిత్య 369 వంటి ప్రయోగాత్మక చిత్రాల తరహాలో మరో వినూత్న చిత్రం 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' రాబోతోంది. గణేష్ క్రియేషన్స్ సంస్థ నుండి నాలుగవ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో నాగ అన్వేష్ కథానాయకుడు. ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత లండన్ గణేష్ మాట్లాడుతూ ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' తెరకెక్కుతుంది. నాగఅన్వేష్ హీరోగా ఈ ప్రయోగాత్మక చిత్రాన్ని రూపొందిస్తున్నాం. నా స్నేహితుడు నాగేశ్వర రావు సహకారంతో దీన్ని నిర్మిస్తున్నాం''అని అన్నారు. మరో నిర్మాత వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ''మంచి కథ కావడంతో ఈ సినిమాలో నేను భాగస్వామిని అయ్యాను. ఫారిన్, సిటీ, ఫారెస్ట్ ఇలా మూడు షెడ్యూల్‌లో షూటింగ్ ఉంటుంది. కొత్త కథ కాబట్టి ప్రేక్షకులకు తప్పకుండా సినిమా నచ్చుతుంది''అని చెప్పారు. హీరో నాగ అన్వేష్ మాట్లాడుతూ ''చాలా ఆసక్తికరమైన సబ్జెక్ట్ ఇది. టైటిల్‌కు తగ్గట్టుగా ఏ నిమిషానికి ఏమి జరుగుతుందో అనే విధంగా ఉంటుంది ప్రతి సన్నివేశం. టాలీవుడ్‌లోనే డిఫరెంట్ సినిమాగా ఇది నిలుస్తుంది. అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను''అని తెలిపారు. దర్శకుడు శ్రీకృష్ణ గొర్లె మాట్లాడుతూ ''సైన్స్ ఫిక్షన్ మూవీగా ఈ చిత్రం తెరకెక్కనుంది. మూడు షెడ్యూళ్లలో షూటింగ్ పూర్తిచేస్తాము. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది''అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో నాగఅన్వేష్‌కు జోడీగా ఓ ప్రముఖ కథానాయిక నటించనుంది. ఈ చిత్రానికి కెమెరాః భాస్కర్ నమల.



ఏ నిమిషానికి ఏమి జరుగునో' ప్రారంభోత్సవ వేడుకలో నాగ అన్వేష్, లండన్ గణేష్, వి.నాగేశ్వరరావు, శ్రీకృష్ణ గొర్లె తదితరులు

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు మొండి వైఖరిని మానుకోవాలి



సాయివెంకట్, ప్రతాని రామకృష్ణగౌడ్

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిస్తూ శుక్రవారం నుండి ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా థియేటర్ల బంద్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. థియేటర్ల బంద్ విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ''శుక్రవారం నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలో థియేటర్ల బంద్ సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. దీనికి సహకరిస్తున్న ఐదు రాష్ట్రాల నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, ప్రజలకు మా ధన్యవాదాలు. మొదటి నుంచి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల విధానంపై మేము పోరాటం చేస్తూ వచ్చాం. ఇప్పుడు నాలుగు భాషల చిత్ర పరిశ్రమలు ఒక్క తాటిపైకి వచ్చి ఒక జెఏసిగా ఏర్పడి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఛార్జీలు తగ్గే వరకు న్యాయ పోరాటం చేయడం శుభ పరిణామం. మేము కూడా వారికి అన్ని విధాలుగా మద్దతు ప్రకటిస్తూ వారితో కలిసి ముందుకెళ్తున్నాం. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు దిగి వచ్చేవరకు అంతా కలిసికట్టుగా ఉండాలని కోరుకుంటున్నాం. థియేటర్ల బంద్ వరకు వచ్చారంటే డిజిటల్ ఛార్జీల వల్ల నిర్మాతలు ఎంత నష్టపోతున్నారో, ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. దీనివల్ల ఎన్నో చిత్రాలు విడుదలకు కూడా నోచుకోకుండా ఉన్నాయి. క్యూబ్, యుఎఫ్‌ఒ, పిఎక్స్‌డి వారు ఐదేళ్ల తర్వాత ఫ్రీ సర్వీస్ చేస్తామని చేసిన అగ్రిమెంట్‌కు కట్టుబడి ఉండాల్సిందే. లేదంటే ఛార్జీలు తగ్గించాలి. లేకపోతే మీరు పక్కకు తప్పుకుంటే మేము కొత్త కంపెనీలతో కలిసి ముందుకెళ్తాం. మా డిమాండ్లు తీరే వరకు థియేటర్ల బంద్ మాత్రం ఆగదు''అని అన్నారు. టిఎఫ్‌సిసి కార్యదర్శి సాయి వెంకట్ మాట్లాడుతూ ''థియేటర్ల బంద్‌కు సహకరిస్తున్న దక్షిణాది చిత్ర పరిశ్రమ వర్గాల వారికి మా కృతజ్ఞతలు. ఇకనైనా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు తమ మొండి వైఖరిని మానుకొని దిగివస్తే మంచిది. లేదంటే మా డిమాండ్లు తీరేవరకు థియేటర్ల బంద్ కొనసాగుతూనే ఉంటుంది''అని తెలిపారు.

నేటి ట్రెండ్‌కు అనుగుణంగా...



వర్ణిక, ఆయుష్

వ్యాంకిష్ మీడియా పతాకంపై ఆయుష్, వర్ణిక హీరోహీరోయిన్లుగా రవికుమార్ పొన్నగంటి దర్శకత్వంలో షేక్ గౌస్ నిర్మిస్తున్న నూతన చిత్రం గుంటూరులో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్లాప్‌నివ్వగా అడిషన్ ఎస్‌పి వై.టి.నాయుడు ఫస్ట్‌షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత షేక్ గౌస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత షేక్ గౌస్ మాట్లాడుతూ ''విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమది. కొత్తదనంతో కూడిన ఈ చిత్రం నేటి ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందిస్తాము. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేవిధంగా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. దర్శకుడు రవికుమార్ పొన్నగంటి చెప్పిన కథ నచ్చి ఈ సినిమాను నిర్మిస్తున్నాం. ఈనెల 24 వరకు నాన్‌స్టాప్‌గా సినిమా షూటింగ్ జరుగుతుంది. సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా చిత్రీకరణను పూర్తిచేస్తాము. పాటలను కోల్‌కతా, వైజాగ్, బ్యాంకాక్‌లో చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాము. ఏప్రిల్ చివరి వారంలో మే తొలి వారంలో సినిమాను విడుదల చేస్తాము''అని అన్నారు. దర్శకుడు రవికుమార్ పొన్నగంటి మాట్లాడుతూ ''కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమిది. అన్ని కమర్షియల్ అంశాలతో సినిమాను రూపొందిస్తాము''అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరాః దుర్గాప్రసాద్, సంగీత దర్శకుడుః అమ్మపండు.



సవరించిన పన్ను రిటర్నుల మోసంపై సిబిఐ దర్యాప్తు

బెంగళూరు: సవరించిన పన్ను రిటర్నుల మోసంలో భాగస్తులుగా ఉన్న అనేక మంది ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ ఉద్యోగులు, బెంగళూరుకు చెందిన ఐటి అధికారులు, ఓ నకిలీ సిఎపై సిబిఐ దర్యాప్తును చేపట్టింది. ఈ మోసాన్ని జనవరి చివర్లో ఐటి శాఖ కనుగొంది. ఈ కుంభకోణంలో ఉన్న వ్యక్తులు బెల్‌వెదర్ ఐటి కంపెనీల ఉద్యోగులకు ప్రయోజనం కలిగించాయి. వివిధ ప్రైవేట్ సంస్థల పన్ను చెల్లింపుదారుల పేరిట 250 ఫోర్జరీ చేసిన పత్రాలను ఉపయోగించి 1,010 సవరించిన పన్ను రిటర్నులను దాఖలు చేశారు. మూడు లెక్కింపు(అసెస్‌మెంట్) సంవత్సరాల కాలంలో ఈ అక్రమంగా ఈ రిఫండ్లను కోరారని వెల్లడైంది. విధానాలను తప్పించుకుని రిటర్నులు దాఖలు చేయడానికి, ఐటి అధికారుల ఆమోదం, ఇన్ఫోసిస్ సిబ్బంది సాయం పొందడానికి నకిలీ ఛార్టెడ్ అకౌంటెంట్ నగేశ్ శాస్త్రి ప్రయత్నించాడని తెలిపింది. తెలియని సిపిసి అధికారులు, ఐటి శాఖ, తెలియని ప్రైవేట్ వ్యక్తుల పేరిట తప్పుడు సమాచారాన్ని శాస్త్రి సమర్పించి, తప్పుడు రిటర్నులను దాఖలు చేసి మోసపూరితంగా రూ. 5 కోట్ల రిఫండ్లను పొందాడు. తర్వాత శాస్త్రి, తెలియని ఐటి శాఖ అధికారులు, ఇన్ఫోసిస్ టెక్నాలజీస్, ఇతరులు ఆ మొత్తాన్ని పంచుకున్నారని సిబిఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.



రేపు పిఎన్‌బి క్రెడిట్ క్యాంప్

మన తెలంగాణ / హైదరాబాద్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) క్రెడిట్ క్యాంప్‌ను హైదరాబాద్‌లో సోమవారం నిర్వహిస్తోంది. ఈ క్రెడిట్ క్యాంప్‌లో హౌసింగ్, ముద్ర, వీవర్స్, స్టాండ్ అప్ ఇండియా, తదితర రుణాలు పంపిణీ చేయనున్నట్లు పిఎన్‌బి ఒక ప్రకటనలో తెలిపింది. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి అధ్యక్షతన నిర్వహించే ఈ క్రెడిట్ క్యాంప్‌నకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.రామకృష్ణ రావు, ఆర్థిక, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎస్.కె.సుల్తానియా గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి ఇప్పటివరకు పిఎన్‌బి తెలంగాణ సర్కిల్ వివిధ రంగాలకు రూ.8,500 కోట్ల రుణాలు మంజూరు చేసింది. ముఖ్యంగా కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు, మిషన్ భగీరథ, తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్లకు రుణ సహాయం అందించింది. తెలంగాణ సర్కిల్ బ్యాంకు ఇప్పటివరకు ముద్ర పథకంలో భాగంగా రూ.65 కోట్లను, 2000 మంది వీవర్స్‌కు, 200 స్వయం సహాయక బృందాలకు సహాయం అందించారు.

యూ ట్యూబ్‌కు నెల వారీగా 220 మిలియన్ల యూజర్లు !

మన తెలంగాణ / హైదరాబాద్ : ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యూ ట్యూబ్‌కు భారీగా ఆదరణ లభిస్తోందని ఆ సంస్థ వినోద విభాగం హెడ్ సత్య రాఘవన్ తెలిపారు. 2017 గణాంకాల ప్రకారం దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో నెల వారీగా 220 మిలియన్ల యూజర్లు యూ ట్యూబ్‌లో వివిధ కంటెంట్‌ను వీక్షిస్తున్నారన్నారు. 330 మిలియన్ల మందికి పైగా తమ స్మార్ట్ ఫోన్ల ద్వారానే విద్యాభ్యాసం, వినోదం, సంగీతం, సినిమా పాటలు వంటి అంశాలకు యూ ట్యూబ్‌ను సందర్శిస్తున్నారన్నారు. యూ ట్యూబ్ తెలుగు కార్యక్రమాలైన తెలుగు వన్, మహాతల్లి, చాయ్ బిస్కెట్, వరంగల్ డైరీస్, మై విలేజ్ షో, కిరాక్ హైదరాబాదీస్ వంటి కార్యక్రమాల సృష్టి కర్తలను హైదరాబాద్‌లో తొలి సారిగా యూ టూబ్ ఫ్యాన్ ఫెస్ట్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించుకున్నట్లు తెలిపారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29220	31251.34	0.62%
ముంబై	29770	31839.57	0%
ఢిల్లీ	29600	31657.75	–0.17%
కోల్‌కతా	29930	32010.70	0%
కేరళ	28250	30213.90	0.36%
బెంగళూరు	28550	30534.76	0%
హైదరాబాద్	29220	31251.34	0.62%
గల్ఫ్	1402.97	1500.50	0.03%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	41700.00	41600.00	0.24
ముంబై	41700.00	41600.00	0.24
ఢిల్లీ	41700.00	41600.00	0.24
కోల్‌కతా	41700.00	41600.00	0.24
హైదరాబాద్	41700.00	41600.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	350
వరంగల్	347	చిత్తూరు	378
విజయవాడ	340	చెన్నై	385
గోదావరి	340	బెంగళూరు	375

పూర్వవైభవం తెస్తాం

- గుండ్లపోచంపల్లి అపెరల్ పార్కుపై మంత్రి కెటిఆర్
- టిఎస్ఐఐసికి 20 కోట్ల చెక్కు అందజేసిన టిఐఎఫ్



మన తెలంగాణ / హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలంలోని గుండ్ల పోచంపల్లి అప్పెరల్ పార్కుకు పూర్వ వైభవం తీసుకువస్తామని టెక్స్‌టైల్ శాఖ మంత్రి కె.టి. రామారావు తెలిపారు. ఈ మేరకు గుండ్లపోచంపల్లి అప్పెరల్ పార్కులో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్కులోని యూనిట్ల పనితీరు, ఉపాధి కల్పన, విస్తరణకు ఉన్న అవకాశాలపై టెక్స్‌టైల్స్ శాఖ, టిఎస్ ఐఐసి అధికారులతో మంత్రి చర్చించారు. పార్కులో అన్ని యూనిట్లు కచ్చితంగా అపెరల్ రంగానికి చెందినవే అయి ఉండాలని, ఈ పరిశ్రమలకు సంబంధం లేకుండా కార్యకలాపాలను నిర్వహిస్తున్న యూనిట్ల స్థలాలను వెంటనే రద్దు చేయాలని టిఎస్ఐఐసి ఎండి, ఇతర అధికారులకు కెటిఆర్ ఆదేశించారు. ఈ పార్కుతో అపెరల్ రంగానికి సంబంధం లేని ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పార్కులోని అన్ని యూనిట్లను తనిఖీ చేసి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ఒక్కో యూనిట్ అందిస్తున్న ఉపాధి, పెట్టుబడులు వంటి అంశాలపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పార్కులోని అన్ని యూనిట్లను తనిఖీ చేసి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ఒక్కో యూనిట్ అందిస్తున్న ఉపాధి, పెట్టుబడుల వంటి అంశాలపైన వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గుండ్లపోచంపల్లి అప్పెరల్ పార్కును పర్యవేక్షించేందుకు ముఖ్య కార్యనిర్వహణాధికారిని ప్రత్యేకంగా నియమించనున్నట్లు కెటిఆర్ తెలిపారు. అప్పెరల్ పార్కు నగరానికి అత్యంత దగ్గర ఉన్నందున అనేక కంపెనీలు ఇక్కడ యూనిట్లు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాంటి వారికి పారదర్శక పద్ధతిలో తిరిగి ఈ ప్లాట్లను కేటాయిస్తామని మంత్రి తెలిపారు. ఈ అప్పెరల్ పార్కులోని అన్ని యూనిట్లు పని చేస్తే కనీసం 15 వేల మందికి నేరుగా, అంతకు రెండు రెట్లు పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. పార్కు పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపి మల్లారెడ్డి, టెక్స్‌టైల్‌శాఖ ఉన్నతాధికారి శైలజా రామయ్యార్, టిఎస్ఐఐసి ఎండి వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పారిశ్రామికవేత్తల సంక్షేమ సమాఖ్య (టిఐఎఫ్) రూ.20 కోట్ల చెక్కును శనివారం టిఎస్ఐఐసికి అందజేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా దండు మల్కాపూర్‌లో ఎంఎస్ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కేటాయించిన భూములకు గాను మూడో విడత నిధుల నిమిత్తం ఈ మేరకు టిఎస్ఐఐసి ఛైర్మన్ గ్యాదరి బాలమల్లుకు టిఐఎఫ్ అధ్యక్షుడు కె.సుధీర్ రెడ్డి, కార్యవర్గ సభ్యుల బృందం టిఎస్ఐఐసి కార్యాలయంలో చెక్కును అందజేసింది. మొత్తంగా ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన భూములకు గాను మూడు విడతలు కలిపి రూ.55.11 కోట్లను టిఎస్ఐఐసికి టిఐఎఫ్ చెల్లించినట్లు అయ్యింది. ఈ సందర్భంగా ఛైర్మన్ బాలమల్లు మాట్లాడుతూ 377 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న దండుమల్కాపూర్ టిఐఎఫ్ పార్కుకు త్వరలోనే ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు శంకుస్థాపన చేయనున్నారని, వెయ్యి కోట్ల పెట్టుబడులు, 12 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనుబంధంగా మరో 200 ఎకరాల్లో ఇందులో పనిచేసే ఉద్యోగులకు 'రెసిడెన్సియల్ టౌన్ షిప్'లను అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కోసం ఏర్పాటు చేస్తున్న తొలి పార్కు దండు మల్కాపూర్ పార్కు అని బాలమల్లు తెలిపారు.

ట్రంప్‌ను వ్యతిరేకించిన ఐఎంఎఫ్

స్టీల్, అల్యూమినియంపై విధించే దిగుమతి సుంకాలపై హెచ్చరిక

వాషింగ్టన్: స్టీలు, అల్యూమినియంలపై భారీగా దిగుమతి సుంకాలను విధించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచనను అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) వ్యతిరేకించింది. అది అమెరికా బయటే కాకుండా, అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపి నష్టాన్ని కలిగించొచ్చని హెచ్చరించింది. స్టీలుపై 25 శాతం దిగుమతి సుంకాన్ని,అల్యూమినియంపై 10 శాతం సుంకాన్ని విధించి అమెరికా ఉత్పత్తిదార్లను కాపాడతామని ట్రంప్ గురువారం అన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన దిగుమతి ఆంక్షలు అమెరికా బయట నష్టాన్ని కలిగించడమేకాక, ఉత్పత్తి, నిర్మాణ రంగాలు సహా అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపగలదు' అని ట్రంప్ ప్రకటన వెలువడిన మరునాడే ఐఎంఎఫ్ ప్రతినిధి గెర్రీ రైస్ అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రతిపాదిత చర్యలపై ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది దిగుమతి ఆంక్షలు విధించి, తమ జాతీయ రక్షణాత్మకత విధానాన్ని దేశాలకు విస్తరించగలదని రైస్ అన్నారు. 'అమెరికా, దాని వాణిజ్య భాగస్వాములు కలసి నిర్మాణాత్మకంగా పనిచేయడాన్ని, వాణిజ్య అడ్డంకులను తగ్గించడాన్ని మేము ప్రోత్సాహిస్తాం. అయితే అత్యయిక విధానాలకు పాల్పడకుండా వాణిజ్య విభేదాలను, అడ్డంకులను పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నాం' అని రైస్ అభిప్రాయపడ్డారు. అమెరికా ఉత్పత్తి, నిర్మాణ రంగాలకు జీవనరేఖ(లైఫ్‌లైన్) అయిన స్టీలు, అల్యూమినియంలపై 25 శాతం, 10 శాతం దిగుమతి సుంకాలు పెను ప్రభావాన్ని చూపగలవు. అంతేకాక అమెరికా ఈ నిర్ణయం దాని మిత్రదేశాలైన కెనడా, యూరప్ యూనియన్(ఇయు), ఆస్ట్రేలియా, మెక్సికో, చైనాలకు ఆగ్రహం కలిగించింది. 'తమ బ్లాక్ కఠినంగా ప్రతిస్పందించగలదు' అని ఇయు చీఫ్ జీన్ క్లాడ్ జంకర్ అన్నారు. కెనడా, జర్మనీలు ఆ సుంకాలు 'ఆమోదకరం' కావన్నాయి. అయితే 'వాణిజ్య యుద్ధాలు మంచికే' అని ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. 'వాణిజ్యంలో కోట్లాది డాలర్లను అమెరికా కోల్పోతోంది, అందుకే వాణిజ్య యుద్ధం ద్వారా సునాయాసంగా గెలుస్తాం' అని ట్రంప్ ట్వీట్ చేశారు. దీనికి ముందు శుక్రవారం కూడా ఆయన తన ట్వీట్‌లో 'వాణిజ్య యుద్ధంలో పెద్ద గెలుపు సాధిస్తాం' అని పోస్ట్ చేశారు. దాని తర్వాత అదే భావంపై అనేక ట్వీట్లను ఆయన పోస్ట్ చేశారు. 'దేశాన్ని, తమ కార్మికులను కాపాడతాం' అని ఆయన చెప్పారు. 'వాణిజ్య లోటు కారణంగా తనకు సుంకాలపై వేరే మార్గం కనపడ్డంలేదు' అని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.



రేపటి నుంచి బిఎస్ఎన్ఎల్ మెగా మేళా

మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ నెల 5 నుండి 10 తేదీ వరకు మెగా మేళాను నిర్వహిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ మేళాను పురస్కరించుకుని వినియోగదారులకు ఉచిత 3 జి స్మార్ట్ సిమ్ కార్డులను ఇవ్వడంతో పాటు 351 ఎంబి ఉచిత డాటాను కూడా అందిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ సిజిఎం వి. సుందర్ ఆ ప్రకటనలో తెలిపారు. మెగా మేళా నిర్వహించే ఈ ఐదు రోజుల్లో రూ. 110 రీ ఛార్జ్‌పై ఫుల్ టాక్ టైంను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ రోజుల్లోనే రాయితీ ధరల్లో ల్యాండ్ లైన్ కనెక్షన్లను, బ్రాడ్ బాండ్ సేవలను, ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు బిఎస్ఎన్ఎల్ కస్టమర్ కేర్ నెంబర్ 18001801503కి కాల్ చేయవచ్చన్నారు.

పెరిగిన బంగారం ధర

న్యూఢిల్లీ: కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర శనివారం పెరిగింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం(ట్రేడ్ వార్) నేపథ్యంలో, డాలరు విలువ పతనం కావడంతో బంగారంకు డిమాండ్‌ను పెరిగింది. ముంబయిలో 10 గ్రాముల(24 క్యారట్ల) బంగారం ధర గరిష్టంగా రూ. 31,711ను తాకింది. స్థానిక నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు పెరగడంతో పాటు అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువ్వవ్వడంతో పది గ్రాముల పసిడి ధర రూ.140 పెరిగి రూ.31,500కి చేరింది. గత రెండు సెషన్లలో బంగారం ధర రూ.490 తగ్గిన సంగతి తెలిసిందే. పెళ్లిళ్ల సీజన్ కారణంగా స్థానిక నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు బాగా పెరిగినట్లు తెలుస్తోంది. బంగారం బాటలోనే వెండి ధర కూడా పెరిగింది. కిలో వెండి ధర నేడు రూ.320 పెరిగి రూ.39,530కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీ దారుల నుంచి వెండికి డిమాండ్ పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ధర పెరిగింది. న్యూయార్క్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 0.43 శాతం పెరిగి 1,322.60 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 0.27శాతం పెరిగి 16.51డాలర్లుగా ఉంది.

తిరుపతిలో సెట్ టాప్ బాక్స్‌ల పరిశ్రమ

తిరుపతి: దేశంలో తొలిసారి ఫైబర్‌గ్రిడ్ విధానాన్ని అతి తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం.. అందుకు అవసరమయ్యే సకల సదుపాయాల కల్పనకు స్థానిక పరిశ్రమలకు అవకాశం కల్పిస్తోంది. దేశంలో మొదటిసారిగా సెట్ టాప్ బాక్స్‌ల తయారీ తిరుపతిలో జరగబోతోంది. ఫైబర్‌గ్రిడ్ విధానం ద్వారా అతితక్కువ ధరకు ఇంటర్నెట్,టివి, టెలిఫోన్ సేవలను అందించేందుకు వినియోగించే అధునాతన సెట్ టాప్ బాక్స్ పరిశ్రమ తిరుపతిలో ఏర్పాటవుతోంది. దేశంలోనే తొలిసారిగా ఫైబర్ గ్రిడ్ విధానాన్ని అమలు చేసిన ఎపి రాష్ట్ర ప్రభుత్వం రూ.149లకే మూడు రకాల సేవలు అందించి ప్రత్యేకతను చాటుకుంది.

సెయిల్ ఉత్పత్తి వృద్ధి 9 %

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ఉత్పత్తిలో 9 శాతం వృద్ధిని సాధించింది. గత ఏడాదితో పోల్చినప్పుడు ఈ ఫిబ్రవరి నెలలో 1.272 మిలియన్ టన్నులు అధికంగా ఉత్పత్తి చేసింది. సెయిల్ ఛైర్మన్ పి.కె. సింగ్ ఈ విషయాన్ని చెప్పారు. ఆధునీకరణ, విస్తరణలో సెయిల్ తుది దశలో ఉంది. భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో కొన్ని పనులు ముగింపు దశకు వచ్చాయి. వేరే ప్రాంతంలోని కొత్త మిల్లులు వృద్ధిని సాధిస్తున్నాయి. పి.కె. సింగ్ ఇటీవల భిలాయ్ స్టీల్ పనితీరును సమీక్షించారు.

కొత్త క్రిప్టోకరెన్సీని ఆవిష్కరించిన ఉబెర్ సహ వ్యవస్థాపకుడు



న్యూయార్క్: ట్యాక్సీ, ఫుడ్ డెలివరి, రవాణా యంత్రాంగం కంపెనీ ఉబెర్ సహవ్యవస్థాపకుడు గారెట్ క్యాంప్ స్వంత క్రిప్టోకరెన్సీ 'ఎకో'ను ఆవిష్కరించారు. 'యాక్సిలరేటర్ ఫండ్ ఎక్స్‌పా' వ్యవస్థాపకుడు కూడా అయిన గారెట్ ప్రపంచవ్యాప్తంగా రోజువారీ కార్యకలాపాల్లో చెల్లింపులకు 'ఎకో' డిజిటల్ గ్లోబల్ కరెన్సీ కావాలని కోరుకుంటున్నారు. ఆదిలో ట్రిలియన్ టోకెన్ల ఎకోలు జారీ కానున్నాయని 'టెక్ క్రంచ్' తెలిపింది. దాంట్లో సగం మొదట సంతకాలు చేసిన వంద కోట్ల మందికి ఇవ్వనున్నారు. మిగతా సగంలో 20 శాతం విశ్వసనీయ సంస్థలు నడుపుతున్న విశ్వవిద్యాలయాలకు, 10 శాతం సలహాదారులకు, 10 శాతం వ్యూహాత్మక భాగస్వాములకు, 10 శాతం కొత్తగా ఏర్పాటు చేసిన ఎకో ఫౌండేషన్‌కు కేటాయించనున్నారు.

సీజన్‌లో పెరిగిన చక్కెర ఉత్పత్తి

చక్కెర ఉత్పత్తిని 10 శాతం పెంచి 29 మిలియన్ టన్నులు సాధించాలన్న అంచనా



ముంబయి: ఈ ఏడాది మహారాష్ట్రలో చెరుకు ఉత్పత్తి అనూహ్యంగా పెరిగినందున చక్కెర ఉత్పత్తి పెంపును సమీక్షించాలని భారతీయ చక్కెర మిల్లుల సంఘం(ఇస్మా) నిర్ణయించింది. 2017–18 సీజనులో చక్కెర ఉత్పత్తి 25.1 మిలియన్ టన్నులు కాగా, ఈ ఏడాది ఉత్పత్తిని 1 మిలియన్ టన్నులు పెంచి జనవరి 18 నాటికి 26.1 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసింది. మహారాష్ట్రలో చాలా మిల్లులకు ఈసారి సీజనులో చెరుకు ముందుగానే చేరుకుంది. నవంబర్ నుంచి డిసెంబర్ మధ్య అకాల వర్షం పడ్డంతో చెరుకు పూర్తి స్థాయిలో ఉత్పత్తి అయింది. మహారాష్ట్రలో రికార్డు స్థాయిలో చెరుకు ఉత్పత్తి అయినట్లు నిపుణులు భావిస్తున్నారు.

అఖిల భారత చెరుకు వాణిజ్య సంఘం ఇప్పటికే 2017–18 చక్కెర ఉత్పత్తి అంచనాను ఇదివరకు అంచనా వేసిన 26.4 మిలియన్ టన్నుల నుంచి 29 మిలియన్ టన్నులకు పెంచింది. మహారాష్ట్ర ఉత్పత్తి అంచనాను 8.5 మిలియన్ టన్నుల నుంచి 10 టన్నులకు, కర్నాటక ఉత్పత్తి అంచనాను 2.5 మిలియన్ టన్నుల నుంచి 3.5 మిలియన్ టన్నులకు పెంచింది. 'మార్చి 7న జరుగనున్న మా తదుపరి బోర్డు మీటింగ్‌లో మేము మా తుది నిర్ణయం తీసుకుంటాం. మేము ముందు అంచనా వేసుకున్నదానికంటే కూడా ఎక్కువగానే చెరుకు ఉత్పత్తి జరిగింది. దీంతో వచ్చే వారంలో చక్కెర ఉత్పత్తి అంచనాలు పెరుగనున్నాయి. ఇప్పుడు నడుస్తున్న మిల్లులు ఎంత ఉత్పత్తి చేయనున్నాయో మార్చి 5 నాటికి మాకు తెలియగలదు. దాంతో చక్కెర ఉత్పత్తిపై మా విశ్లేషణ ఉండగలదు' అని ఇస్మా డైరెక్టర్ జనరల్ అబినాశ్ వర్మ తెలిపారు.

తొలి అంచనాల ప్రకారం మహారాష్ట్రలో చక్కెర ఉత్పత్తి 8.2 నుంచి 8.5 టన్నులు ఉండగలదు. మహారాష్ట్రలో ఉన్న 185 చక్కెర మిల్లుల్లో ఈ సీజనులో 7 మూసేశారు. సీజను మొదలులో 65 మిలియన్ టన్నుల చెరుకు చక్కెర ఫ్యాక్టరీలకు లభ్యం అయినట్లు అంచనా. రాష్ట్రంలో దాదాపు 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఉంటుందని అంచనా. గమనించాల్సిన విషయమేమిటంటే చక్కెర మిల్లులు ఇప్పటికే 76.76 మిలియన్ టన్నులు క్రష్ చేసాయని సమాచారం. ఇప్పటికింకా మహారాష్ట్రలో కోత కోయని చెరుకు ఇంకా12 నుంచి 15 శాతం ఉంది. చక్కెర ఉత్పత్తిలో మహారాష్ట్ర 9 మిలియన్ టన్నులు సునాయాసంగా దాటేయగలదు. కానీ అది 10 మిలియన్ టన్నులకు కూడా పెరిగే అవకాశం ఉంది. మొత్తం భారత్ దేశమంతటా చూస్తే...చక్కెర ఉత్పత్తి 29 నుంచి 30 టన్నులు ఉండగలదు' అని మహారాష్ట్ర సహకార చక్కెర కర్మాగారాల రాష్ట్ర సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖతల్ చెప్పారు. భారత్‌లో చక్కెర వినియోగం 254 మిలియన్ టన్నులు కాగా ఈ కరెంటు సీజన్‌లో 33 నుంచి 34 మిలియన్ టన్నులు ఉండగలదు.

వచ్చే సీజన్ నాటికి చక్కెర ఉత్పత్తి మిగులు స్థాయిలో ఉండనుంది. ఈ సీజనులో 1.5 మిలియన్ టన్నుల తెల్ల చక్కెర, 4 మిలియన్ టన్నుల ముతక చక్కెర ఎగుమతి సాధ్యం కాగలదు. దీంతో స్టాక్ పరిమితిని తొలగించి, ఎగుమతికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిపుణులు కోరుతున్నారు. అంతేకాక ఎగుమతి కోటా కనీస సూచిక(ఎంఐఇక్యు)ను ఈ సీజనుకు, వచ్చే సీజనుకు ప్రవేశపెట్టాలని కోరుతున్నారు.

అమిత్ షా పిజి... రాహుల్ నర్సరీ స్టూడెంట్ : హిమంత



అగర్తలా : త్రిపుర బిజెపి విజయం సాధించడంతో అసోం మంత్రి హిమంత బిస్వా సార్మ ఫలితాలపై స్పందించారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షాలకు రాజకీయాల్లో ఉన్న శక్తి సామర్థ్యాల గురించి వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో అమిత్ షా పిజి విద్యార్థి అయితే, రాహుల్ నర్సరీ విద్యార్థి అని ఎద్దేవా చేశారు. శనివారం హిమంత బిస్వా ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో రాహుల్, షా పనితీరుపై విలేకరులు ప్రశ్నించగా ఆయన పై విధంగా బదులిచ్చారు. అమిత్ షా రాజకీయాల్లో ఆరితేరి ఉన్నారని, రాహుల్ ఇంకా ఓనమాలు నేర్చుకుంటారని చెప్పారు. కాగా, హిమంత బిస్వా దాదాపు రెండు దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉన్నారు. 2015లో ఆయన బిజెపిలో చేరడానికి ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని తరుణ్ గొగోయ్ ప్రభుత్వ హయాంలో సుమారు 15 ఏళ్ల పాటు మంత్రిగా పనిచేశారు. 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిజెపి నేతృత్వంలో ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ మంత్రిమండలిలో విద్య, ఆరోగ్యశాఖమంత్రిగా సేవలందిస్తున్నారు. అయితే గతంలోనూ రాహుల్‌గాంధీ పనితీరుపై హిమంత బిస్వా పలు విమర్శలు చేశారు. ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడం లేదన్నారు.

డబ్బు, అధికారాన్ని ఉపయోగించి గెలిచారు : సిపిఐ(ఎం)



మన తెలంగాణ/న్యూఢిల్లీ : త్రిపుర రాష్ట్రంలో బిజెపి భారీ స్థాయిలో డబ్బు , ఇతర వనరులను ఉపయోగించిందని, గతంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ స్థానాన్ని లాగేసుకోవడం ద్వారా వామపక్ష వ్యతిరేక ఓట్లను కూడగట్టిందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ఈ మేరకు శనివారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. బిజెపి–ఐపిఎఫ్‌టి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు తీర్పు ను ఇచ్చారని, 25 సంవత్సరాల తరువాత వామపక్ష సంఘటన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని పేర్కొంది. సిపిఐ(ఎం), వామపక్ష సంఘటనకు మద్దతిచ్చిన 45 శాతం ఓటర్లకు సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో కృతజ్ఞతలు తెలియజేసింది. ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను జాగ్రత్తగా పరిశీలించి, వాటిని సరిచేసేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామని వివరించింది. త్రిపురలో అన్ని రంగాల శ్రామిక వర్గ ప్రజల సమస్యలపై పోరాటాన్ని, గిరిజన–గిరిజనేతర ఐక్యత పరిరక్షణకు తమ వంతు కృషిని కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

నాగాలాండ్‌లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం : కిరెన్ రిజిజు

న్యూఢిల్లీ : ఇతర పార్టీల మద్దతుతో బిజెపి నాగాలాండ్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జి కిరెన్ రిజిజు తెలిపారు. ఆయన వ్యాఖ్యలు దీర్ఘకాలిక భాగస్వామి అయిన ఎన్‌పిఎఫ్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామన్న సంకేతాలు ఇస్తున్నాయి. నాగాలాండ్ ఎన్నికల సమయంలో రిజిజు బిజెపి, దాని భాగస్వామి అయిన నేషనల్ డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) తరపున ప్రత్యేకంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సందర్భంలో ఆయన 60 స్థానాలు కలిగిన శాసనసభలో కనీసం ఒక్క సీటును కూడా కాంగ్రెస్ గెల్చుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. కాగా, ఇప్పుడు ఇతర పార్టీలతో కలిసి నాగాలాండ్‌లో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. బిజెపి, ఎన్‌డిపిపిలు సరైన స్థితిలో ఉంటే అత్యధిక స్థానాలు గెల్చుకున్న పార్టీ చిరకాల భాగస్వామి నాగా పీపుల్స్ పార్టీ (ఎన్‌పిఎఫ్) సహకారం లేకుండానే తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించగా..బిజెపితో భాగస్వామ్యంపై ఇప్పటికే ఎన్‌పిఎఫ్ తీర్మానం చేసిందన్నారు. నాగాలాండ్‌లో బిజెపి విజయం చారిత్రకమైందని, ప్రజలను బిజెపిపై ప్రేమాభిమానాలను కురిపించారని వ్యాఖ్యానించారు. బిజెపి అభివృద్ధే అజెండా పనిచేస్తుందని, ఇప్పుడు నాగాలాండ్‌లో కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తుందని చెప్పారు.

రెండు చోట్లా గెలిచిన మేఘాలయ సిఎం




షిల్లాంగ్ : మేఘాలయ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి ముకుల్ సంగ్మా అంపటి, సంగ్‌సక్ శాసనసభ నియోజకవర్గ స్థానాల నుంచి గెలుపొందారు. 20 10 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్న సంగ్మా తన సమీప బిజెపి అభ్యర్థి బాకుల్ హజాంగ్‌ను ఆరు వేల ఓట్ల మెజార్టీతో అంపటి స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు. అలాగే, సంగ్‌సక్ స్థానంలో ఆయన నేషనల్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి నిహిమ్ డి శిరపై 1300 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఈ రాష్ట్రంలోని ఎన్నికల ఫలితాల్లో బిజెపి మూడవ స్థానంలో నిలిచింది. కాగా, ముఖ్యమంత్రి సతీమణి దిక్కంచి శిర మహేంద్రగంజ్ స్థానంలో బిజెపి అభ్యర్థి ప్రేమానంద కోచ్‌పై ఆరు వేల మెజార్టీతో గెలుపొందారు.

మేఘాలయలో కాంగ్రెస్ మంతనాలు

న్యూఢిల్లీ : మేఘాలయలో శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను అన్వేషించేందుకు పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు హుటాహుటిన ఆ రాష్ట్రానికి తరలి వెళ్లారు. ఎన్నికల్లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులతో చర్చలు జరిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ సీనియర్ నాయకులు అహ్మద్ పటేల్, కమల్‌నాథ్‌లు శనివారం ఉదయం మేఘాలయకు తరలివెళ్లినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. వీరు ప్రస్తుత ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మాతో సహా వివిధ పార్టీల నేతలతో వారు చర్చలు జరపనున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలిత ఐదు రాష్ట్రాల్లో మేఘాలయ ఒకటి. రాష్ట్రంలో ఇప్పుడు అధికారంలో ఉండగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించింది.

ఆసుపత్రిలో చేరిన కేరళ సిఎం



చెన్నై : సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తమిళనాడు రాజధాని చెన్నైలోని అపో లో ఆసుపత్రిలో చేరారు. అన్ని పరీక్షలు చేసిన అనంత రం ఆయనను ఆదివారం డిశ్చార్జ్ చేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. 73 ఏళ్ల విజయన్ వైద్యపరీక్షలను చేయించుకునేందుకు శుక్రవారం ఉద యం 11.55 గంటలకు ఆసుపత్రి లో చేరినట్లు శనివారం విడుదల చేసిన బులిటెన్‌లో ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి ఆదివారం డిశ్చార్జ్ కానున్నట్లు తిరువనంతపురంలోని సిఎం కార్యాలయంలో వెల్లడించింది.

ఐఎఫ్‌ఎస్ అధికారిని చంపిన ఏనుగు

బెంగళూరు: నాగర్‌హోల్ టైగర్ రిజర్వులో సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి ఎస్ మణికందన్‌పై శనివారం ఓ అడవీ ఏనుగు దాడి చేసి చంపేసింది. కంకనాకొట్ సమీపంలో డిబి కుప్పేలోని తాటిగుండు కెరె వద్ద ఘటన చోటు చేసుకుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. సల్ప అగ్ని ప్రమాదంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఫీల్డ్ డైరెక్టర్ మణికందన్ నాగర్‌హోల్ రిజర్వు ఫారెస్ట్‌కు వెళ్లారన్నారు. ఆయనతో పాటు ఇతర అటవీశాఖ అధికారులు కూడా వెళ్లారని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పునతి శ్రీధర్ తెలిపారు. అడవిలో జీపు దిగి కొంత దూరం నడుస్తున్న వారిపై ఏనుగు వెనుక నుంచి దాడి చేసిందన్నారు. మిగతా వారు తప్పించుకుని పారిపోగా, మణికందన్‌పై ఏనుగు దాడి చేసి చంపేసిందన్నారు.

శత్రుఘ్న సిన్హాకు పురస్కారం

లండన్: నటుడు, రాజకీయ వేత్త అయిన శత్రుఘ్న సిన్హాకు కళలు, రాజకీయ రంగంలో విశేష కృషి చేసినందుకు యుకె పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఆయనను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. బ్రిటన్స్ ఆసియా వాయిస్ వీక్లీ 12వ వార్షికోత్సవం సందర్భంగా 'వార్షిక, ప్రజా జీవిత బహుమతులు' ప్రదానం చేశారు. హౌజ్ ఆఫ్ కామన్స్‌లో గురువారం సభ్యుల భోజన శాలలో జరిగిన కార్యక్రమంలో శత్రుఘ్న సిన్హా మాట్లాడుతూ విశ్వాసం ద్వారా నిబద్ధత వస్తుందని, నిబద్ధతతో నిశ్చయం వస్తుందని ఆయన పేర్కొన్నారు.

పాతికేళ్ల పాలనకు బ్రేక్

- **త్రిపురలో వామపక్ష సర్కార్‌కు ఎదురుదెబ్బ**
- **రాష్ట్రాన్ని ఇరవై ఏళ్లు పాలించిన మాణిక్**



అగర్తలా : త్రిపురలో 25 ఏళ్ల తిరుగులేని వామపక్ష విజయ కవాతు నిలిచిపోయింది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయం దక్కించుకుంది. రాష్ట్రంలో ఏకబిగిన సాగిన సిపిఎం పాతికేళ్ల పాలన, ఇందులో 20 ఏళ్లుగా సాగిన మాణిక్ అధికారానికి ఇప్పుడు బ్రేక్ పడింది. బిజెపి సవాలు ఇస్తుందని, ఎన్నికలలో గట్టిపోటీగా మారుతుందని సర్కార్ అంచనా వేయలేదని తేటతెల్లం అయింది. జనవరిలో పత్రికల వారికి మాణిక్ సర్కా ర్ గంటకు పైగా ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో తమకు బిజెపి ప్రత్యామ్నాయం అయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బిజెపి నుంచి సవాలు, బిజెపి అధికార స్థాపన వంటి మాటలు నవ్వు తెప్పిస్తున్నాయని , ప్రజల వద్దకు వెళ్లి నిజాలు తెలుసుకుంటే వారే జవాబు చెపుతారని విలేకరులకు అప్పట్లో ఆయన స్పష్టం చేశారు. శనివారం వెలువడ్డ ఫలితాలలో త్రిపుర వామపక్షాల చేజారింది. ఓ వైపు పశ్చిమ బెంగాల్‌లో రెండుసార్లు ఓడిపోయి, సిద్ధాంతపరంగా ప్రత్యర్థి బిజెపితో తలపడుతూ వస్తున్న దశలో త్రిపుర అపజయం మరో అపదశగా మారింది. వివిధ రాష్ట్రాలలో బిజెపి పాగా వేసుకుంటూ వెళ్లుతున్న దశలో వామపక్షాలు సర్కారు ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు వమ్ము అయ్యాయి. భారతీయ వామపక్షాల చరిత్రలో సర్కారు గణనీయ నేతగా నిలుస్తారు. కీలకమైన ఈశాన్యంలో శాంతిభద్రతలకు పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తూ , సామాన్యుడికి శాంతి భద్రతల కల్పన కీలకంగా పేర్కొంటూ ఆయన పాలన సాగింది. విస్తృత కూటమిని ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ ప్రజల సంస్కృతి వ్యవహారాలు ఆర్థిక స్థితిగతులతో సమాన ప్రాధాన్యత వహిస్తాయని, కేవలం వర్గపు సమీకరణనే కాకుండా ప్రజల ఉనికి, గుర్తింపు కీలకంగా విశ్వసించారు.

పలు సంక్లిష్ట సమస్యల నడుమ : బెంగాలీలు, ఆదివాసీల సమస్యల నడుమ 1998లో సర్కారు అధికారం చేపట్టారు. మరో వైపు బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదార్ల జటిల సమస్య కూడా తీవ్రంగా ఉండేది. బంగ్లాదేశ్‌లో తిష్టవేసుకుని ఉన్న తీవ్రవాదులు రాష్ట్రంలో చొరబడి హింసాకాండకు పాల్పడేవారు. ఈ దశలో సర్కార్ సర్కారు చేపట్టిన తీవ్రస్థాయి అణచివేత చర్యలు, సీమాంతర చొరబాట్లను కట్టడి చేయడంతో ఈ సమస్య తగ్గింది. ఆ తరువాత ఆయన రాష్ట్రంలో రాజకీయ పటిష్టతను సాధించుకోవడానికి, రాజకీయ శూన్యత భర్తీకి యత్నిస్తూ వచ్చారు. ఆయన బెంగాలీ గుర్తింపు రాష్ట్రంలో మెజార్టీలలో పలుకుబడికి, ఇదే సమయంలో గిరిజనులలో ఆదరణకు వీలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఆయన హయాంలో పూర్తి స్థాయిలో మొత్తం 20 గిరిజన ప్రాంతపు సీట్లు వామపక్షాల కైవసం అవుతూ వచ్చాయి. సామాజిక అభివృద్ధి సూచీలపైనే ఆయన ఎక్కువగా దృష్టి కేంద్రీకరించడం ఆయన బలానికి దారితీసింది. ఎన్నికలకు చాలా రోజుల ముందు నుంచే అగర్తలా ఇతర చోట్ల వీధులలో, గిరిజన పల్లెల్లో ఎన్నికల నాడి స్పష్టం అయింది. సిఎం సర్కారు ఉత్తముడే అయితే పాలనలోనే మార్పు రావాల్సి ఉందని , ఇప్పుడు ఇది మార్పుల సమయం అని ప్రజలు చెపుతూ వచ్చారు. రాష్ట్ర చరిత్రలో క్లిష్ట సమయంలో సమర్థవంతంగా వ్యవహరించిన నేతకు ఇన్నేళ్లకు త్రిపురవాసులు అధికార వీడ్కోలు పలికారు.

ఉద్యోగుల అసంతృప్తి బిజెపికి ఆయుధమైంది

ప్రభుత్వోద్యోగులలో అత్యధికులు సిపిఎం అభిమానులు, సిపిఎం కేడర్ వారే అయినా వేతనపరంగా అసంతృప్తితో ఉన్నారు. వారికి ఇప్పటికీ నాలుగవ వేతన సంఘం జీతాలు దక్కుతున్నా యి.వారి వేతనాల పెంపుదలకు, వేతన సంఘం సిఫార్సుల వర్తింపునకు బిజెపి వాగ్దానం చేయడం కీలకంగా మారాయి. ఇక రాష్ట్రంలో యువత అసంతృప్తితో ఉండటం, రాష్ట్రంలో ఆధునికత జాడలు లేకపోవడం, ఐటి అవకాశాలు రాకపోవడం, ఉద్యోగాలకు సరైన పరిస్థితులు లేకపోవడం వంటివి వారిని ఇక్కట్లకు గురి చేశాయని విశ్లేషించారు.వచ్చే ఉద్యోగాలు ఎక్కువగా సిపిఎం కేడర్‌కు వస్తున్నాయని, జాతీయ స్థాయిలో వచ్చే ఉద్యోగాలు ఉపాధి అవకాశాల ఉనికి త్రిపుర లో లేదనే అభిప్రాయం యువతలో ఉండటం వారు ఓటర్లుగా మార దం కీలకంగా మారిందని వెల్లడైంది. తాము కోరుకున్న వికాసాన్ని తెస్తామని బిజెపిచెప్పడం ఓటర్లను ఆకట్టుకుందని భావిస్తున్నారు. సిపిఎం నేత మాణిక్ నిరాడంబర, పొదుపు వ్యవహార శైలి, అన్నింటికి మించి మచ్చకు తావులేని క్లీన్ ఇమేజ్ ఆయనకు గుర్తింపు తెచ్చాయి. కానీ ఈ ప్రతిష్టను దెబ్బతీసేందుకు బిజెపి చిట్‌ఫండ్ స్కామ్ తీసుకువచ్చింది, బురద చల్లడంలో విజయం సాధించింది. సర్కారు బెంగాలీ ట్రైబల్ సమీకరణం కూడా దెబ్బతినడం విజయానికి గండిగా మారింది. ఆయన బెంగాలీ పక్షపాతి అని ప్రచారం చేయడం, గిరిజనులకు సరైన విధంగా అధికారం దక్కలేదని అన్యాయం జరుగుతోందని బిజెపి వాదించడం జనం వద్దకు వెళ్లింది.

సున్నా నుంచి శిఖరానికి : త్రిపుర విజయంపై మోడీ



న్యూఢిల్లీ : త్రిపురలో బిజెపి విజయం 'శూన్యం నుంచి శిఖర' స్థాయి ప్రయాణం అని ప్రధాని నరేంద్ర మోడీ అభివర్ణించారు. త్రిపురతో పాటు నాగాలాండ్‌లలో పార్టీ విజయం పట్ల శనివారం ఆయన స్పందించారు. పార్టీ పటిష్ట అభివృద్ధి మంత్రం, సంస్థాగత బలోపేతం వల్లనే ఈ గెలుపు సాధ్యం అయిందని తెలిపారు. దశాబ్దాలుగా త్రిపురలో సాగుతోన్న వామపక్ష కూటమి అధికారానికి గండిపడింది. ఇది కేవలం ప్రతి బిజెపి కార్యకర్త క్షేత్రస్థాయిలో సంవత్సరాలుగా సాగిస్తున్న నిరంతర శ్రమకు ఫలితం అని మోడీ స్పష్టం చేశారు. ప్రజలు పార్టీ విధానాలను, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను విశ్వసించారు. ఆదరించారని వ్యాఖ్యానించారు. ప్రతికూల, అసహేతుక రాజకీయాలు చెల్లనేరవని ప్రజా తీర్పు రుజువు చేసిందని అన్నారు. ఈ విజయం అందించిన ప్రతి బిజెపి కార్యకర్తకు తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు స్పందించారు. ప్రతి ఎన్నికలలోనూ బిజెపి పట్ల ప్రజానీకం విశ్వాసం ఇనుమడిస్తోందని ఫలితాలు వెల్లడిస్తున్నాయని , ప్రతికూల ప్రచారానికి, విద్వేష రాజకీయాలకు ప్రజలు ప్రభావితం కాబోరని వెల్లడైందని మోడీ పేర్కొన్నారు. వాస్తవాలకు అనుసంధానం కాని రాజకీయాలను ప్రజలు తిప్పికొడుతారని ఇప్పు డూ అదే జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. త్రిపుర విజ యం గురించి ప్రస్తావిస్తూ ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం అని, అణచివేతలు, బెదిరింపులు, విచ్ఛిన్నకర శక్తులపై దక్కిన గెలుపు అని అభివర్ణించారు. నాగాలాండ్‌లో బిజెపి మిత్రపక్షాలను ఓటర్లు ఆదరించినందుకు వారికి కృతజ్ఞతలు అని తెలిపారు. త్రిపుర, నాగాలాండ్‌తో పాటు మేఘాలయాల సంక్షేమం తమకు కీలకం అన్నారు. త్రిపురలో విజయం కీలకంగా సైద్ధాంతికమైదని తెలిపారు. ఇది చారిత్రాత్మక గెలుపు అని, అన్ని ప్రాంతాల సోదరసోదరీలందరి తరపున పాటుపడుతామని వెల్లడించారు.

మోడీ నాయకత్వానికి ఈశాన్యపు ఆమోదం : త్రిపుర, నాగాలాండ్‌లలో బిజెపి విజయం పట్ల పార్టీ అధ్యక్షులు అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ నాయకత్వాన్ని ఈశాన్యభారతపు ప్రజలు ఆమోదించరన డానికి ఈ తీర్పు నిదర్శనం అన్నారు. ఈ విజయాలతోనే పార్టీ సంతృప్తి చెందడం లేదని, పశ్చిమ బెంగాల్, ఒడిషా, కర్నాటకలలోని ప్రతిపక్ష ప్రభుత్వాలను ఓడిస్తే పార్టీ స్వర్ణయుగం సాధించినట్లు అవుతుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత గెలుపు తనకు కోట్లాది మంది బిజెపి కార్యకర్తలకు పండుగ వంటిదని , కేంద్రం చేపడుతున్న ప్రగతియుత కార్యక్రమాలకు ఈశాన్యం ఆమోదం దక్కిందని దీమా వ్యక్తం చేశారు.

త్రిపుర సిఎం ఎవరు?


- **రేసులో బిప్లబ్, రామ్‌పద, అతుల్ పేర్లు**
- **పార్టీ అదేశిస్తే సిఎం పదవి చేపడతా : బిప్లబ్**
- **గిరిజనుడినే ముఖ్యమంత్రిని చేస్తామని ఎన్నికల ముందు బిజెపి హామీ**



అగర్తల : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఇప్పుడు అక్కడ తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది చర్చనీయాంశమైంది. పలువురు నేతలు తమను తాము సిఎం అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారు. ముఖ్యమంత్రి పోస్టుకు బిప్లబ్ కుమార్ దేవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఈయన రాష్ట్ర బిజెపి చీఫ్‌గా పనిచేస్తున్నారు. అంతేకాకుండా చాలా కాలం నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్నారు. త్రిపురలోని గోమతి జిల్లాలోగల అక్రాబన్ అనే గ్రామంలో జన్మించిన బిప్లాబ్ 15ఏళ్ల పాటు ఢిల్లీలోనే ఉన్నారు. ఆ సమయంలో ఆయన జిమ్ ట్రైనర్‌గా పనిచేశారు. తొలిసారి 2016లో పూర్తిస్థాయిలో త్రిపుర పార్టీ పగ్గాలు అందుకున్నారు. ఆయనకు కేంద్ర నాయకత్వం దీవెనలు కూడా మెండుగా ఉన్నాయి. పైగా ఈయన ముందు నుంచి కూడా బిజెపితోనే ఉన్న వ్యక్తి కావడంతో సిఎం అభ్యర్థిగా ఆయనే సరైన వాడు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, పార్టీ ఎన్నికల ప్రచార సమయంలో ఓ గిరిజన వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించింది. మరోవైపు త్రిపురలో విజయం పట్ల బిప్లబ్ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అదేశిస్తే ముఖ్యమంత్రి పదవిని అధిష్టించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అయితే తుది నిర్ణయం మాత్రం బిజెపి పార్లమెంటరీ పార్టీదేనని, వారు ఏ నిర్ణయం తీసుకున్నా శిరసా వహిస్తానని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం నాపై నమ్మకముంచి రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిందని, దానిని సమర్థవంతంగా నిర్వహించాననే భావిస్తున్నానని బిప్లబ్ అన్నారు.

తెరపైకి గిరిజన నేతల పేర్లు :ఇక సిఎం రేసులో రెండో వరుసలో వినిపిస్తున్న ప్రముఖ పేరు రామ్‌పద జమాతియా. ప్రస్తుతం జమాతియా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నా రు. గత రెండేళ్లుగా విహెచ్‌పిలో చేరి పనిచేస్తున్న ఈయన గిరిజన తెగకు చెందినవారు. బిజెపి మొదటి నుంచి ముఖ్యమంత్రి పై ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటే మాత్రం తొలుత అదృష్టం వరించేది జమాతియానే. గిరిజనుడిని సిఎం చేయాలనుకుంటే ఈయనకే ఆ అవకాశం దక్కుతుంది. త్రిపుర సిఎం అభ్యర్థిగా మరో వ్యక్తి డాక్టర్ అతుల్ దెబ్బార్మా పేరు వినిపిస్తోంది. ఈయన సంసృతంలో స్కాలర్, వేదశాస్త్రాలపై పూర్తి పట్టున్నవారు. నాగ్‌పూర్‌లో ఉన్నప్పుడు వైద్యుడిగా కూడా పనిచేసి అనంతరం ఆరెస్సెస్ పంపించడంతో రాష్ట్రానికి వచ్చి పార్టీలో పనిచేశారు. గిరిజన అభ్యర్థిని బిజెపి పెడితే ఈయన రెండో వరుసలో ఉన్నారు.

నాగాలాండ్ సిఎంగా నైపూ?



నాగాలాండ్‌లో నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) సారథ్యంలోని బిజెపి కూటమి అధికారంలోకి రావడం దాదాపు ఖాయం కావడంతో ఇక్కడ మాజీ ముఖ్యమంత్రి నైపూ రియా కొత్త ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నారని ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌డిపిపి 40 స్థానాల్లో, ఆ పార్టీకి భాగస్వామిగా ఉన్న బిజెపి 20 స్థానాల్లో పోటీ చేశాయి. ఇరువురు కలిసి 30స్థానాల్లో గెలుపొందారు. నాగాలాండ్‌ను 11 ఏళ్ల పాటు పరిపాలించిన అనుభవం 67 ఏళ్ల నైపూ రియోకు ఉంది. నాగా పీపుల్స్ పార్టీ నుంచి గెలిచిన రియో 2003లో తొలిసారి ముఖ్యమంత్రిగా పగ్గా లు చేపట్టారు. 2008, 2013 లోనూ ఆయన గెలిచారు. అయితే ఈ ఏడాది జనవరిలో ఆయన అధికార ఎన్‌పిఎఫ్ నుంచి తెగతెంపులు చేసుకుని ఎన్‌డిపిపి ఏర్పాటు చేశారు.

లెఫ్ట్ ఫ్రంట్‌కు దెబ్బే : సురవరం

హైదరాబాద్ : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వామపక్ష ఫ్రంట్‌కు దెబ్బేనని, కనీసం తక్కువ మెజార్టీతో అయినా తిరిగి రాష్ట్రంలో అధికారంలో వస్తామని అనుకున్నామని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. గత 25 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న సిపిఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష ఫ్రంట్‌కు ఈ ఎన్నికల ఫలితాలు నిరాశ కలిగించాయని చెప్పారు. త్రిపురలో ఇలాంటి ఫలితాలు వస్తాయని తాము ఊహించలేదని, కనీసం తక్కువ మెజార్టీతో అయినా వామపక్ష ఫ్రంట్ అధికారాన్ని నిలబెట్టుకుంటుందని భావించామని శనివారం ఆయన పిటిఐతో మాట్లాడుతూ చెప్పారు. మొత్తానికి బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, ఇది అత్యంత దురదృష్టకమని వ్యాఖ్యానించారు. పోలింగ్ రోజున 11 శాతం ఇవిఎంలు పని చేయలేదని, ఇది అనేక అనుమానాలను లేవనెత్తుతోందన్నారు. సుదీర్ఘకాలంగా అధికారంలో వున్న వామపక్ష ఫ్రంట్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత కూడా ఈ ఫలితాలకు కారణం కావచ్చని తెలిపారు. ఏదేమైనా ఈ ఫలితాలు వామపక్ష ఫ్రంట్‌కు నష్టమేనని, ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటామని చెప్పారు.

ఎన్నికల్లో ఏదైనా కానీయ్ అన్న రీతిలో ఎన్నికల్లో బిజెపి ధనాన్ని వెచ్చించిందని, చిన్న రాష్ట్రంలో వారు పెద్ద ఎత్తున ప్రచారం సాగించారని, కాంగ్రెస్ మొత్తం బిజెపికి వైపుకు వెళ్లిపోయిందని, బిజెపి తనకు ఎలాంటి ఆధారం లేని చోట (త్రిపుర)లో కార్యకలాపాలు సాగించిందని అన్నారు. ఈ పరిణామాలు శాశ్వతంగా ఉంటాయని తాము భావించడం లేదని, ఇది కేవలం తాత్కాలిక దశ (వామపక్షాలకు ఓట్లు తగ్గడం), రాజకీయాలకంటే అధికార దుర్వినియోగమే ఇక్కడ (ఎన్నికల్లో) ఎక్కువగా పనిచేసిందని అన్నారు. ఇదే సమయంలో ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని, పేదరికం పెరిగిపోతోందని, దీంతో ప్రజలకు ప్రభుత్వం పట్ల అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు.



శనివారంనాడు త్రిపుర ఎన్నికల విజయాన్ని కార్యకర్తలతో కలిసి జరుపుకుంటున్న బిజెపి రాష్ట్రశాఖ అధ్యక్షుడు బిప్లబ్‌దేవ్ కుమార్, రాంమాధవ్

కాంగ్రెస్ బలానికి బిజెపి గాలం

- **మందకొడి ప్రచారంతో దెబ్బతిన్న హస్తం పార్టీ**

న్యూఢిల్లీ/అగర్తలా: ఈశాన్యపు మెరుపు రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండ్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా ఎదగడంలో కాంగ్రెస్ చతికిలపడింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ త్రిపుర, నాగాలాండ్‌లలో రాజకీయ లబ్ధిని పొందలేకపోతోంది. ఇప్పుడు త్రిపుర, నాగాలాండ్, మేఘలాయాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో త్రిపుర, నాగాలాండ్‌లలో కాంగ్రెస్ ఒక్క సీటు దక్కించుకోలేదు. ఈ విధంగా అసెంబ్లీలో ఖాతాలు తెరవలేని స్థితిలో ఈ శాన్యంలో కాంగ్రెస్ రాజకీయంగా కనుమరుగు అయ్యే పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో నాయకత్వ లోపం, మందకొడి ప్రచారం, వామపక్షాలతో ఊగిసలాటల పొత్తు వంటివి కాంగ్రెస్‌ను పూర్తిగా దెబ్బతీశాయి. విచిత్రంగా త్రిపురలో అధికార వామపక్ష కూటమి పట్ల వ్యతిరేకత అంతా బిజెపికి అనుకూలంగా మారింది. ఇంతకు ముందటి కాంగ్రెస్ ఓటు బ్యాంకులు అన్నీ ఇప్పుడు బిజెపికి దారిమళ్లాయి. కాంగ్రెస్ ఓటును చేజిక్కుంచుకోవడంలో బిజెపి విజయం సాధించడం చివరికి అక్కడ వామపక్షాలకు దెబ్బగా మారింది. శూన్యం నుంచి శిఖరస్థాయికి బిజెపి చేరుకోవ డానికి కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అనుసరించిన అసమర్థ వైఖరి కారణం అని విశ్లేషిస్తున్నారు.2013 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓట్ల శాతం దాదాపు 37 శాతంగా ఉంది. అప్పుడు 48 సీట్లకు పోటీ చేసి పది సీట్లు దక్కించుకుంది. అయితే పార్టీ 1.8% ఓట్లు, సున్నా సీట్ల స్థాయికి చేరింది. ఇదే సమయంలో ఈ ఓట్లశాతం సీట్ల సంఖ్య బిజెపి ఖాతాలో చేరాయి.

త్రిపురలో రాహుల్ ఏక సభ : త్రిపురను దక్కించుకోవాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదని, అందుకే ప్రచార స్థాయి కుదించారని బిజెపి బలంగా ప్రజలకు నచ్చచెప్పగలిగింది. దీనితో ఓటర్లు తమకు బిజెపినే ప్రత్యామ్నాయం అనుకుని ఆదరించినట్లు వెల్లడైంది. వామపక్ష వ్యతిరేక ఓటును అనుకూలంగా మలుచుకోవడంలో బిజెపి చాకచక్యంగా వ్యవహరించింది. సిపిఎంకు తాము ప్రత్యామ్నాయం కాగలమనే విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రదర్శించకపోవడం బిజెపి గెలుపునకు దారితీసింది. ఇక కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ త్రిపురలో కేవలం ఒకే ఒక్క ఎన్నికల సభలో పాల్గొన్నారు. అది కూడా ఎన్కిల ప్రచారం చివరి తేదీ అయిన ఫిబ్రవరి 16న నిర్వహించారు. ఇక పార్టీ కేంద్ర అధినాయకత్వం త్రిపురలో విజయం కోసం కాకపోయినా కనీసం ఉనికి చాటుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఈ విషయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలే తెలిపారు. ప్రత్యేకించి ఈశాన్య పార్టీ పర్యవేక్షకులు సిపి జోషి పెద్దగా త్రిపురపై ఆసక్తి చూపలేదని విమర్శించారు.



నాగాలాండ్‌లో ఆటలోనే లేదు: నాగాలాండ్‌లో కాంగ్రెస్ ఎప్పుడూ పోటీ పందెంలో లేనట్లుగానే ఉంది. కొన్ని సందర్భాలలో అభ్యర్థుల ఎంపిక కూడా కష్టం అయింది. ఇక ఎన్నికలలో నిధులు కూడా సరిగ్గా సమకూరలేదు. నిధుల కొరతతో కాంగ్రెస్ చివరి దశలో పోటీ నుంచి కొందరు అభ్యర్థులను ఉపసంహరించుకుంది. దీనితో పోటీలో 18 మంది రంగంలో మిగిలారు. 2013 ఎన్నికలలో కాంగ్రెస్ 56 స్థానాలకు పోటీ చేయగా ఎనిమిది సీట్లు గెల్చుకుంది. దాదాపు పాతిక శాతం ఓట్లు తెచ్చుకుంది. ఈశాన్య రాష్ట్రాల కాంగ్రెస్ పర్యవేక్షకులు జోషి సరిగ్గా వ్యవహరించకపోవడం వల్లనే అపజయం ఎదురయిందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు కెవీ ఖాపే థేరీ నిందించారు. నాగాలాండ్‌లో బిజెపి పూర్తిగా దెబ్బతినడానికి జోషి బాధ్యత వహించాలని ఈ విధంగా ఈశాన్యంలో కాంగ్రెస్‌కు ఇబ్బంది ఏర్పడిందని అన్నారు.



కేంద్రం ఇచ్చింది ఐదు శాతమే : పవన్

హైదరాబాద్ : నాలుగేళ్లలో ఎపికి కేంద్రం ఐదు శాతం నిధులు మాత్రమే ఇచ్చిందని జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ విద్యా సంస్థలకు కేంద్రం ఇచ్చింది నామమాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఎపికి పూర్తి నిధులు ఇచ్చేందుకు కేంద్రానికి ఎన్ని ఏళ్లు పడుతుందని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం ఖర్చు కేంద్రమే భరించాలని విభజన చట్టంలో ఉందని, పోలవరం వంటి జాతీయ ప్రాజెక్టు బాధ్యతను ఎపి సర్కారు తీసుకోకుండా ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని పవన్ తేల్చి చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక ప్యాకేజీ అంటే పాచిపోయిన లడ్డూలని తాను చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. అరకొర నిధులు ఇస్తున్న కేంద్రాన్ని నిలదీయడంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్రం నుంచి ఎపికి రూ.74,542 కోట్లు రావాల్సి ఉందని లోక్ సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్‌నారాయణ పేర్కొన్నారు. జెఎఫ్‌సి నివేదికపై ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని 11 రాష్ట్రాల్లో ప్రత్యేక హోదా అమలులో ఉందని ఆయన చెప్పారు.


హెచ్1బి వీసాదారులకు ఊరట

భాగస్వాములను ఉద్యోగం నుంచి తొలగించడంపై జరగని నిర్ణయం



వాషింగ్టన్: హెచ్1బీ వీసాదారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ యంత్రాగం వెల్లడించింది. దీంతో పెద్ద సంఖ్యలో అక్కడ పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఊరట లభించినట్లయ్యింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్) ప్రకటించింది. 'హెచ్4 వీసాల మీద వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్1బీ వీసా దారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే నిర్ణయంపై జూన్ వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోబోం. వాళ్లని తొలగించాలని తీసుకునే నిర్ణయం దేశంపై ఆర్థికంగా ఎటువంటి ప్రభావం చూపుతుందనే దాన్ని పరిశీలించాల్సి ఉంది. అందువల్ల అప్పటి వరకు హెచ్1బీ భాగస్వాముల ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు' అని డీహెచ్‌ఎస్ వెల్లడించింది. 2015లో అప్పటి ఒబామా ప్రభుత్వం హెచ్1బీ వీసాదారుల భాగస్వాములు, గ్రీన్‌కార్డు కోసం ఎదురు చూసే వారి భార్య/భర్తలు యూఎస్‌లోని వివిధ కంపెనీల్లో హెచ్4 డిపెండెంట్ వీసాల కింద పనిచేసేందుకు అవకాశం కల్పిస్తూ ఓ విధానాన్ని తీసుకొచ్చారు. అయితే.. దాన్ని ఫిబ్రవరి 28 నుంచి తొలగిస్తామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇప్పుడు హెచ్4వీసాదారుల తొలగింపుపై సరైన నిర్ణయం తీసుకోలేదని అందుకు కొద్దిగా సమయం పడుతుందని అక్కడి ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ విధానంలో మార్పులు చే యాల్సి ఉందని.. వాటిని ఆర్థికపరంగా కూడా పూర్తిగా విశ్లేషించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని డీహెచ్‌ఎస్ పేర్కొంది.

రాహుల్‌పై మంత్రి గిరిరాజ్ సెటైర్లు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అత్యంత కీలక సమయంలో ఆ పార్టీ కార్యకర్తలను వదిలిపెట్టి, అదృశ్యమైపోయారని కేం ద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల ఫలితాలు వెలువడే సమయానికి ఆయన విదేశీ పర్యటనకు వెళ్ళారని ఎద్దేవా చేశారు. 'ఇలాంటి సమయంలో కార్యకర్తలను వదిలేసి ఏ నాయకుడూ ఇలా పారిపోడు. రాహుల్ గాంధీ శ్రద్ధ లేని (కాంగ్రెస్) అధ్యక్షుడు' అని పేర్కొన్నారు. రాహుల్ అంతకుముందు ఓసారి 56 రోజులపాటు అదృశ్యమైపోయారని గిరిరాజ్ సింగ్ అన్నారు. ఇప్పుడు మరోసారి మాయమైపోయారన్నారు. ఇలాంటి సమయాల్లో తనవారికి ఈ విధంగా ఎవరూ చెయ్యి ఇవ్వరని, వారితోనే కలిసి ఉంటారని అన్నారు. ఆయన ఒత్తిడిని ఎదుర్కొనలేరని, ఒత్తిడి సమయాల్లో ఎలా వ్యవహరించాలో ఆయనకు తెలియదని అన్నారు. ఆయనకు ఎప్పుడు పారిపోవాలో బాగా తెలుసునని ఎగతాళి చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దళితుల హత్య

జైపూర్ : రాజస్థాన్‌లోని భరత్‌పూర్, అల్వార్ జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఓ బాలుడు సహా ఇద్దరు దళితులు హత్యకు గురయ్యారు. జస్వంత్ జాతవ్ (26) దళిత కార్మికుడు. అతనిపై కొందరు దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. అనంతరం అతని ఇంటికి నిప్పంటించారు. ఈ ఘటన కుంహెర్‌లోని జరిగింది. జాతవ్ అంతర్గత గాయాలతో చనిపోయినట్టు పోస్టుమార్టంలో తేలిందని పోలీసు అధికారి సీతారాం మీనా తెలిపారు. కాగా, అల్వార్ జిల్లాలోని భీవడిలో జరిగిన మరో ఘటనలో నీరజ్ జాతవ్ (16) ఇతర కులాల వారితో హోలీ ఆడుతుండగా, కొందరు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు అదనపు పోలీసు సూపరింటెండెంట్ పుష్పేంద్ర సోలంకి తెలిపారు.

ప్రేరణకు ఘన నివాళి

మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రముఖ రచయి త జక్కం నాగేశ్వర రావు (60) శనివారం మధ్యా హ్నం భద్రాద్రి జిల్లా పాల్వంచలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఖమ్మం, భద్రాద్రి జిల్లా ల తెలంగాణ రచయితల వేదిక (తెరవే) అధ్యక్షులు యన్.తిర్మల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆయన ప్రజా రచయితల సమాఖ్యబాధ్యుడిగా పని చేశారు. స్పందన కవితా సంకలనం వెలువరించారు. దళిత ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారు. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన బ్యాంకు ఎంప్లాయిగా ఉంటూనే ప్రజాఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచారు. ఆయన కుటుంబానికి తెరవే ప్రగాఢ సంతాపం తెలుపుతుంది.

రైల్వే స్టేషన్‌లో బంగారం స్వాధీనం

గుంటూరు: తెనాలి రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న 3.5 కేజీల బంగారాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున రైల్వే పోలీసుల రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తుల నుంచి ఈ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రికి చెందిన ఇద్దరు వ్యక్తులు చెన్నయ్‌లో బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితులను అదుపులోకి తీసుకున్నామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు రైల్వే ఎస్‌పి మోహన్‌రావు తెలిపారు.

వైసిపి నేతల ఛలో ఢిల్లీ యాత్ర

ప్రకాశం : వైసిపి నేతల ఛలో ఢిల్లీ యాత్రను ఆ పార్టీ చీఫ్ జగన్ శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వైసిపి ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఢిల్లీ బాట పట్టారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారు ఈ యాత్ర చేబట్టారు. ప్రకాశం జిల్లా తాళ్లూరులో పాదయాత్ర చేస్తున్న జగన్‌ను పార్టీ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు శనివారం కలిశారు.

లంకేశ్ హత్య కేసులో ఒకరికి కస్టడీ

బెంగళూరు: జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం ఒకరిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నట్లు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసుతోపాటు మరో కేసులో నిందితుడుగా ఉన్న టి నవీన్ కుమార్ అలియాస్ హొట్టె మంజాను విచారించేందుకు 8 రోజులపాటు కస్టడీకి తీసుకున్నట్లు బెంగళూరు (పశ్చిమ) డిప్యూటీ కమిషనర్, ఇన్వేస్టిగేటింగ్ ఆఫీసర్ ఎంఎన్ అనుచేత్ తెలిపారు. ఇందుకు సంబంధించి మరింత సమాచారం వెల్లడించేందుకు డిసిపి నిరాకరించారు. లంకేశ్ (55) ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. రైట్ వింగ్ వ్యతిరేక భావజాలం కలిగి ఉండటంతో దుండగులు ఆమెను సమీప నుంచి కాల్చి చంపారు. అక్రమంగా బుల్లెట్లను కలిగి ఉన్నారన్న ఆరోపణలకు ఫిబ్రవరి 19న ఆయనను కస్టడీలోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అప్పట్లో లంకేశ్ హత్య సంచలం సృష్టించింది.

వడదెబ్బతో ఒకరు మృతి



జనగామ: మార్చి ప్రారంభంలోనే ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. వాతావరణంలో మార్పు కారణంగా పగలు తీవ్ర ఎండ కాస్తుండగా, రాత్రి వేళల్లో మాత్రం చలి వణికిస్తోంది. మార్చి మొదటి వారంలోనే ఎండలు భగ్గుమంటుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా శనివారం వడదెబ్బతో నర్మెట్ట మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మ య్య (60) అనే వ్యక్తి చనిపోయాడు. లక్ష్మ య్య కుటుంబాన్ని ఆదుకోవాలని ఆ గ్రామ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

16న ట్యాంక్ బండ్‌పై మిలియన్ మార్చ్

- స్ఫూర్తి సభకు అనుమతి ఇవ్వకపోతే టిఆర్‌ఎస్‌కు ఉద్యమ స్ఫూర్తి లేనట్టే



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో మిలియన్‌మార్చ్ ఒక చరిత్రాత్మక ఘట్టమ ని, ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని కలిగించిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో ఈ నెల 10న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పైన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను నిర్వహించాలని మిలియన్ మార్చ్ స్ఫూర్తి కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యా లీ, బహిరంగ సభ, ఆట, మాట కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మార్చ్ జరిగి ఆరేళ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా 'మిలియన్‌మార్చ్ స్ఫూర్తిని గుర్తు చేసుకుందాం' అనే పేరుతో చేపడుతున్న కా ర్యక్రమానికి అందరూ తరలిరావాలని కమిటీ పి లుపునిచ్చింది. స్ఫూర్తి సభకు అనుమతి నిరాకరిస్తే టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉద్యమ స్ఫూర్తి లేనట్టేనని కమిటీ నాయకులు తెలిపారు. అనుమతి ఇవ్వకపోయినా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో శనివారం మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ ఏర్పాటుపై సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ జెఎసి ఛైర్మ న్ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్, సిపిఐ–ఎంఎల్ (న్యూ డెమోక్రసి) నాయకులు కె.గోవర్ధన్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నేత రవిచంద్, ఫార్వర్డ్‌బ్లాక్ ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి, తెలంగాణ జెఎసి కో ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిలినియం స్ఫూర్తి కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ఆధ్వర్యంలో మిలియన్‌మార్చ్ సభ, ట్యాంక్‌బండ్ ఆరంభం నుంచి చివరి వరకు మూడున్నర కిలోమీటర్ల వరకుమార్చ్ నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. అనంతరం మీడి యా సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడు తూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం తన పాలనకాలంలో ఉ ద్యమ ఆకాంక్షలను పట్టించుకోలేదని విమర్శించా రు. మిలియన్ మా ర్చ్‌ను గుర్తు చేసుకుంటూ మ గ్ధుం విగ్రహం దగ్గర స్ఫూర్తిసభను నిర్వహిస్తామన్నారు. మిలియన్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకే ఈ సభను నిర్వహి స్తున్నామన్నారు. కోదండ రామ్ మాట్లాడుతూ ఉద్యమ శక్తులను ఏకం చేసిన ఘనత మిలియన్‌మార్చ్‌దే అన్నారు. ఉద్యమ ఆ కాంక్షలను వి స్మరించిన ప్రభుత్వానికి మరోసారి ఉద్యమ స్ఫూ ర్తిని గుర్తు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలతో సంబంధం లేకుండా అంద రూ పాల్గొనాలన్నారు. డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌తో పాటు జిల్లాలో కూ డా మిలియన్‌మార్చ్ స్ఫూర్తిగా అమరుల విగ్రహాల దగ్గర స్ఫూర్తి సభలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ స్ఫూర్తి సభలకు టిఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా పాల్గొనవచ్చన్నారు. ఆంధ్రాకు చెందిన నాటి సిపి ఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ తెలంగాణ ఉద్యమానికి మద్దతు పలికారని గుర్తు చేశారు. కె.గోవర్ధన్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను మరోసారి చాటేందుకు తెలంగాణ వాదులందరూ మిలియన్‌మార్చ్ స్ఫూర్తి సభకు తరలిరావాలని కోరారు.

బంగారు లక్ష్మణ్ సతీమణి మృతి



మన తెలంగాణ/ హైదరాబాద్: బిజెపి జాతీయ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మ ణ్ సతీమణి, మాజీ ఎంపి బంగారు సుశీల(68) శనివారం మరణించారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమె శనివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీలో ఆర్.నాగయ్య, లీలావతి దంపతులకు 1948లో సుశీల జన్మించారు. 1971 లో బంగారు లక్ష్మ ణ్‌తో ఆమె వివాహమైంది. హిందీ పండిట్‌గా పని చేసిన ఆమె 2004లో రాజస్థాన్‌లోని జాలోర్ స్థానం నుండి మాజీ కేంద్ర మంత్రి బూటా సింగ్‌పై గెలుపొంది సంచలనం సృష్టించారు. బంగారు సుశీల మృతి పట్ల బిజెపి నాయకులు సంతాపం తెలియజేశారు. ఆమె మరణం సామాజిక, ఆర్థిక వెనుకబడిన వర్గాలకు, బిజెపికి తీరని లోటని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్, ఎంపి బండారు దత్తాత్రేయ వేర్వేరు సంతాప సందేశాల్లో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

నాగర్‌కర్నూల్ : పెంట్లవెల్లి మండల కేంద్రంలో శనివారం ఉదయం రాఘవేందర్ (20) అనే విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇంట్లో విద్యుత్ తీగలు తాకి అతడు మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. రాఘవేందర్ కుటుంబాన్ని ఆదుకుంటామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రవాణా శాఖను వదలని అవినీతి జాడ్యం

- సేవలు ఆన్‌లైన్ అయినా తప్పని దళారుల బెడద
- ఒక రూపంలో అరికడితే మరో రూపంలో విభృంభిస్తున్న దళారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : రవాణ శాఖను అవినీతి జాడ్యం పట్టిపీడిస్తునే ఉంది. శాఖను అవినీతి రహిత శాఖగా మార్చేందుకు ప్రభుత్వం, రవాణ శాఖకు చెందిన అధికారులు చేస్తున్న ప్రయత్నాలు బూడిదలో పోయిన పన్నీరుగా మారి పోతున్నాయి. రవాణ శాఖ పారదర్శకతతో పాటు మధ్య దళారుల ప్రమేయాన్ని తగ్గించేందుకు 2016 ఆగస్టు నుంచి గత రెండేళ్లుగా సుమారు 60 సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తున్నప్పటికీ ఆర్‌టిఎ కార్యాలయాల్లో దళారుల సంఖ్య తగ్గడం లేదు సరి కదా వారి బెడద తప్పడం లేదు. ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టినా నేటికీ దళారులు అధికారుల సహాయంతో పెద్దఎత్తున తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు ఇటీవల కాలంలో రవాణ శాఖ కార్యాలయాల్లో జోరందుకున్నాయి. ఆన్‌లైన్ సేవల పట్ల అవగాహన లేని వాహనదారులు, ప్రజలను లక్ష్యంగా చేసుకుని దళారులు, సిబ్బంది చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శలున్నాయి. డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల రిజిస్ట్రేషన్ సేవలకు స్లాట్ బుకింగ్ మొదలు అన్ని రకాల సేవలను దళారులు అందిస్తుండడం గమనార్హం. ఖైరతాబాద్, ఉప్పల్, నాగోల్ లాంటి ప్రధానమైన ఆర్‌టిఎ కార్యాలయాల్లో వందల సంఖ్యలో ఏజెంట్లు లాప్‌టాప్‌లను ఏర్పాటు చేసుకుని రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తూ వాహనదారులకు కావాల్సిన ఆన్‌లైన్ స్లాట్‌లను బుక్ చేస్తుండడం పరిస్థితికి అద్దం పడుతుంది. డ్రైవింగ్ రాకపోయినా, మెడికల్ సర్టిఫికేట్ లేకపోయినా వేల రూపాయలను వసూలు చేసి టూ వీలర్, ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసేందుకు ప్రక్రియను తాము చేసి పెడతామని, కేవలం కంప్యూటర్ ముందు కూర్చుంటే చాలు మిగిలిన పనంతా తాము చూసుకుంటామని దళారులు వాహనదారులకు హామీ ఇస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



మరోవైపు వాహనదారులు తమకు అవసరమైన సేవలను పొందడంలో తీవ్రమైన జాప్యం జరుగుతూ సమయం వృధా అవుతుందని, అన్ని పత్రాలు ఉన్నా సిబ్బంది ఏదో ఒక కొర్రి పెడుతూ దళారులును ఆశ్రయించే విధంగా ప్రేరేపిస్తున్నారని, ఫలితంగా దళారులను ఆశ్రయించక తప్పడం లేదని పలువురు వాహనదారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో వాహనదారులకు కేటాయించిన సమయం కంటే ముందే దళారులు పని పూర్తి చేసి పంపించేస్తుండడం గమనార్హం. ఏజెంట్లను సంప్రదిస్తే పని సులువుగా అయిపోతుందని కొంత మంది అధికారులే సలహాలిస్తున్నారని పలువురు వాహనదారులు చెబుతున్నారు. వాహనదారులు, ప్రజలు రవాణ శాఖ సేవల కోసం దళారులను ఆశ్రయించవద్దని, రవాణ శాఖ అధికారులు, సిబ్బందితోనే సేవలను పొందాలని రవాణ శాఖ ఉన్నతాధికారులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రావడం లేదు. దళారులతో అంటకాగుతున్న కొంత మంది అధికారులు వారికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఆర్‌టిఎ అధికారులు ఒకరిద్దరు చెప్పారు. రవాణ శాఖలో అవినీతి కార్యకలాపాలు కిందిస్థాయి వరకు విస్తరించాయని, అధికారులు, సిబ్బంది చేతులను దళారులు తడుపుతున్నంత కాలం అది కొనసాగుతూనే ఉంటుందంటున్నారు.

నిరంతర కృషితోనే గెలుపు తథ్యం

ఎన్‌టిఆర్ ట్రస్ట్ 20వ వార్షికోత్సవంతో ఎపి సిఎం చంద్రబాబు నాయుడు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తాను పదకొండవ తరగతి చదువుతున్నప్పుడే తమ హెడ్‌మాస్టర్ నాలో నాయకత్వ లక్షణాలను ఉన్నట్లు గుర్తించారని, విద్యార్థుల నైపుణ్యాలను అదే విధంగా ఉపాధ్యాయులు గుర్తించాలని టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గండిపేటలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ 20వ వార్షికోత్సం, ఎన్‌టిఆర్ స్కూల్, కాలేజ్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్‌టిఆర్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఎపి పంచాయతీరాజ్,ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్, ఎన్‌టిఆర్ ట్రస్ట్ ట్రస్టీ బ్రాహ్మణి, నారా దేవాన్షులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పేరుతో శాశ్వతంగా సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఎన్‌టిఆర్ ట్రస్టును ప్రారంభించామని తెలిపారు. గతంలో రాజకీయ పాఠాలు చెబుతుండే ఈ ప్రాంగణంలో ప్రస్తుతం పిల్లలకు పాఠాలు చెబుతుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గతంలో తాను టిడిపి ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు ఇక్కడకు ప్రతి రోజూ సాయంత్రం వచ్చి పని చేసేవాళ్ళమని గుర్తు చేసుకున్నారు. స్కూలు వార్షికోత్సవానికి రావడం తీపిజ్ఞాపకంగా మిగిలిపోతుందని, ఈ పాఠశాలను జూనియర్, డిగ్రీ కాలేజీగా నారా లోకేశ్ విస్తరించారని తెలిపారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్, ఎన్‌టిఆర్ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబం నుండి వచ్చిన వారేనని, లక్ష్య సాధన కోసం నిరంతర కృషే వారిని అలా చేసిందన్నారు. ఇక్కడి చదివే వారిలో 75 శాతం బాలికలు, 25 శాతం బాలురు ఉన్నారని చెప్పారు. మనిషి తలుచుకుంటే ఏమైనా సాధించగలరని భువనేశ్వరి నిరూపించారని, ఇంటి విషయాలతో పాటు హెరిటేజ్ కంపెనీ, ట్రస్‌ట బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. పిల్లలు చదువును ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. కృష్ణా నది వరదలు, ఉత్తరాఖండ్ వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయాలలో ప్రభుత్వం చేయలేని పనులను ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా చేయగలిగామని చంద్రబాబు అన్నారు. నారా భువనేశ్వరి మాట్లాడుతూ సామాజిక దృక్పధంతో ఎన్‌టిఆర్ ట్రస్ట్‌ను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ట్రస్టు సిఇఒ టి.విష్ణువర్ధన్, సిఒఒ వై.మోహన్‌రావు, డైరెక్టర్ ఎన్.ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్‌టిఆర్ మోడల్ జూనియర్ , డిగ్రీ కాలేజ్ ప్రిన్స్‌పాల్ పి.శ్రీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ ఎస్.జె.రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇండో పసిఫిక్‌కు సంయుక్త కృషి



న్యూఢిల్లీ: ఇండియా, వియత్నాంలు శనివారం అణు సహకార ఒప్పందంతో సహా మొత్తం మూడు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. అణు సహకారం, వాణిజ్యం, వ్యవసాయ రంగాలలో సహకారానికి ఇరు దేశాలు నిర్ణయించాయి. బహిరంగ ఇండో, ఫసిఫిక్ అంశాల పరిష్కా రానికి సంయుక్తంగా కృషి చేయడంతోపాటు ఒక నియామాళి ఆధారిత ప్రాంతీయ నిర్మాణం కోసం పిలుపునిచ్చాయి. శనివారం ప్రధాని నరేంద్ర మోడీ, వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డై క్వాంగ్‌లు రక్షణ, చమురు, గ్యాస్, వ్యవసాయ వంటి పలు కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారానికి విస్తృత పరచనున్నట్లు తెలిపారు. బహిరంగ, స్వతంత్ర, సంపన్న ఇండో, పసిఫిక్ ప్రాంతం కోసం సంయుక్తంగా పని చేస్తామని,సార్వభౌమత్వం, అంతర్జాతీయ చట్టాలను గౌరవించడం, చర్చల ద్వారా విభేదాలు పరిష్కరించుకోనున్నట్లు వియత్నాం అధ్యక్షుడి ముందు మోడీ మీడియాకు తెలిపారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు



- నేడు జాతీయ భద్రత దినోత్సవం

మనతెలంగాణ/ సిటీబ్యూరో : సమాజానికి ఒక నిర్దేశిత సందేశము ఇవ్వడానికి దినోత్సవాలు చేస్తూ ఉంటాము. సాంప్రదాయాలు కాపాడుకోవడం కోసం పండుగలు చేస్తాము. ఏది చేసినా ఎక్కడ చేసిన ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసమే నిర్దేశించబడుతుంది. పుట్టిన రోజు, పెళ్లిరోజు, అమ్మల రోజు, నాన్నల రోజు, ప్రేమికుల రోజు లను ఈ రోజుల్లో మనం వారి గురించి ఆలోచించి, వాళ్లను కొనియాడి, మన బాధ్యతను గుర్తు చేసుకుంటాం. మరి మార్చి4న జాతీయ భద్రత దినోత్సవం గురించి కూడా మన బాధ్యతలేమిటో తెలుసుకుందాం...పని చేసే ప్రదేశంలో భద్రతను పెంపొందించడానికి ప్రతి ఏటా మార్చి4న జాతీయ భద్రత దినోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నేషనల్ ఆక్యూపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ క్యాంపెన్ వారం రోజులపాటు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది. ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ జీవనవిధానంలో, వృత్తుల్లో భద్రత, ఆరోగ్య రక్షణను ఒక అంతర్గత భాగంగా మలుచుకునేలా చేయడం ఈ క్యాంపెన్ లక్ష్యం. భారత ప్రభుత్వం, శ్రామిక మంత్రిత్వ శాఖ 1966 మార్చి4న జాతీయ భద్రత మండలి ని స్థాపించింది. భద్రత, ఆరోగ్యం పర్యావరణాలపై అవగాహన పెంపొందించడం ఈ మండలి లక్ష్యం. సమావేశాలు, సెమినార్లతో పాటు సేఫ్టీ ఆడిట్లు వంటి కార్యక్రమాలను ఈ మండలి నిర్వహిస్తుంది. భద్రత మండలి ఆధ్వర్యంలోనే రహదారి భద్రత దినోత్సవాలు, అగ్నిమాపక వారోత్సవాలు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాలు నిర్వహిస్తారు.

జాగ్రత్తలతో ప్రమాదాలు సంభవించవు..

మన దేశంలో ప్రతిఏటా దాదాపు లక్ష మంది వరకు రోడ్డు ప్రమాదాల్లో మరణించడం, ఇంకొందరు తీవ్ర గాయాల పాలవుతున్నారు. ఈ రోడ్డు ప్రమాదాల్లో అత్యధికం మానవ తప్పిదాలవల్ల జరుగుతున్నవే. వాహనాదారులు వాహనాన్ని అతివేగంగా నడపడం, రహదారుల మీద నడిచేవారు చూపే నిర్లక్ష్యం వంటివి ఈ ప్రమాదాల్లో సృష్టిస్తున్నాయి. వీటితో పాటు పారిశ్రామిక కర్మాగారాలలో జరిగే ప్రమాదాలు,అగ్ని ప్రమాదాలు వంటివి నిత్యం సంభవిస్తున్నాయి. పని చేసేందుకు వెళ్లినవారు తిరిగి క్షేమంగా ఇంటికి వస్తారో...రారో అన్న ఆందోళనతో కుటుంబ సభ్యులు బతకాల్సివస్తోంది. కుటుంబ పెద్దకు ప్రమాదము జరిగినా, ప్రమాదములో మరిణించినా ఇక ఆ కుటుంబం మొత్తం కోలుకోని విధంగా దెబ్బతింటుంది. అందుకే ప్రతి ఒక్కరూ తమవంతు భద్రతను పాటించాలి. ప్రతి కార్మికుడు తాను తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే, సూచించిన పద్ధతులను పాటిస్తే ప్రమాదాలు సంభవించవు. స్వాతంత్రం రాకముందు మన దేశంలో పారిశ్రామికీకరణ అంతంత మాత్రమే, ఆ తరువాత పెరిగిన పరిశ్రమలతో పాటు ప్రమాదాలు కూడా అలాగే పెరిగాయి. ఈ ప్రమాదాలను గుర్తించిన అప్పటి ప్రభుత్వం భద్రతపట్ల అవగాహన పెంచేందుకు ప్రభుత్వ పరంగా ఓ సంస్థ అవసరమని గుర్తించింది. ఆ తరువాత భద్రత మీద తొలి సమావేశం డిసెంబర్ 1965 ఢిల్లీలో నిర్వహించింది. మార్చి4,1966లో జాతీయ భద్రత మండలి రూపుదిద్దుకుంది. అదే రోజును జాతీయ భద్రత దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. నాటి నుంచి ఈ మండలి ప్రజలకు భద్రత పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

జిమ్నాస్ట్ అరుణకు ఘన సత్కారం

రూ.20 లక్షల నజరానా



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రపంచ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం, జిమ్నాస్టిక్ యువ సంచలనం బుద్ధా అరుణా రెడ్డికి శనివారం ఘనంగా సన్మానించారు. అరుణతో పాటు ఆమె కోచ్ బ్రిజ్‌కిశోర్‌ను సత్కరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్.బి.స్టేడియంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల మంత్రి పద్మారావు, శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, శాట్స్ ఎండి దినకర్ బాబు, ఒలింపిక్స్ సంఘం కార్యదర్శి ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అరుణా రెడ్డికి 20 లక్షల రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ మేరకు మంత్రి పద్మారావు దీనికి సంబంధించిన చెక్కును అరుణకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరస్మరణీయ ప్రదర్శనతో భారత ఖ్యాతిని ఇనుమడింప చేసిన అరుణ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. మరోవైపు హైదరాబాద్ జిమ్నాస్టిక్స్ సంఘం అధ్యక్షుడు, సువర్ణ సిటీ యజమాని సురేందర్ కుమార్ జిమ్నాస్ట్ అరుణకు రూ.50 లక్షల విలువైన విల్లాను బహుమతిగా ప్రకటించారు. అంతేగాక ఆమెను తమ సంస్థ సువర్ణ సిటీకి ప్రచారకర్తగా నియమిస్తున్నట్టు వెల్లడించారు.

ఇంగ్లాండ్ ఉత్కంఠ గెలుపు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన మూడో వన్డేలో 4 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1 ఆధిక్యాన్ని అందుకుంది. చివరి ఓవర్‌ను క్రిస్ పొదుపుగా వేయడంతో ఇంగ్లాండ్ అద్భుత గెలుపును దక్కించుకుంది. కివీస్ కెప్టెన్ కానె విలియమ్సన్ అజేయ శతకం సాధించినా జట్టును గెలిపించలేక పోయాడు. చివరి ఓవర్లో విజయం కోసం 15 పరుగులు అవసరం కాగా కివీస్ పది పరుగులు మాత్రమే చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 235 పరుగుల స్కోరును కాపాడుకొని విజయాన్ని అందుకుంది. స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆతిథ్య కివీస్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 230 పరుగులు మాత్రమే చేసి పరాజయం చవిచూసింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన విలియమ్సన్ 143 బంతుల్లో ఆరు ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఓపెనర్ కొలిన్ మున్రో (49), సాంట్నర్ (41) తప్ప మిగతా వారు విఫలం కావడంతో న్యూజిలాండ్‌కు ఓటమి తప్పలేదు. మొయిన్ అలీ ఆల్ రౌండ్ ప్రతిభతో ఇంగ్లాండ్ విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. బ్యాటింగ్‌లో 23 పరుగులు చేసిన మొయిన్ బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. అతనికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఆదిల్ రషీద్, వోక్స్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. కాగా, ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను కెప్టెన్ మోర్గాన్ (48), బెన్ స్టోక్స్ (39) ఆదుకున్నారు.

భజరంగ్, వినోద్‌లకు పతకాలు



న్యూఢిల్లీ: కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరుగుతున్న ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు పురుషుల విభాగంలో రెండు కాంస్య పతకాలు లభించాయి. పురుషుల 65 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో భజరంగ్ పూనియా కాంస్య పతకం సాధించాడు. 2017లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా రెజ్లింగ్‌లో స్వర్ణం సాధించిన భజరంగ్ ఈసారి కాంస్యంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. జపాన్ రెజ్లర్ దైచి టకాటానితో జరిగిన క్వార్టర్ ఫైనల్లో భజరంగ్ ఓటమి పాలయ్యాడు. కానీ, రిపెచెజ్ విభాగంలో గెలవడంతో భజరంగ్‌కు కాంస్య పతకం దక్కింది. ఇరాన్ రెజ్లర్ అలిబాకర్‌ను ఓడించి భజరంగ్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. ఇదిలావుండగా పురుషుల 70 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో వినోద్ కుమార్‌కు కాంస్యం దక్కింది. అతను కూడా రిపెచెజ్ పద్ధతిలో కాంస్యం సాధించాడు. కాగా, శుక్రవారం జరిగిన మహిళల పోటీల్లో నవోజ్యోత్ కౌర్ స్వర్ణ పతకం సాధించిన విషయం తెలిసిందే.

పోరాడి ఓడిన భారత్



ఇఫో(మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో భారత్ పోరాడి ఓడింది. శనివారం నువ్వానేనా అన్నట్టు సాగిన మ్యాచ్‌లో ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనా 3–2 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. చివరి వరకు ఇరు జట్లు విజయం కోసం సర్వం ఒడ్డి పోరాడాయి. అయితే కీలక సమయంలో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భారత్ విఫలమైంది. అయితే భారీ వర్షం కూడా భారత్ ఓటమికి ఒక కారణంగా చెప్పవచ్చు. వర్షం వల్ల మ్యాచ్‌ను మధ్యలో నిలిపి వేయాల్సి వచ్చింది. దీంతో అప్పటి వరకు దూకుడు మీదున్న భారత్ ఆ తర్వాత జోరును కొనసాగించలేక పోయింది. అంతేగాక సుమీత్ ఎల్లో కార్డుకు గురి కావడంతో పది మందితోనే భారత్ ఆడాల్సి వచ్చింది. ఇది కూడా ఓటమికి కారణంగా చెప్పవచ్చు. కాగా, స్టార్ ఆటగాడు, పెనాల్టీ కార్నర్ నిపుణుడు గొంజాలో పిలట్ హ్యాట్రిక్‌తో సహా మూడు గోల్స్ సాధించి అర్జెంటీనా విజయంలో కీలక పాత్ర పోషించాడు. గొంజాలో 13వ, 23వ నిమిషాల్లో గోల్స్ సాధించాడు. అంతేగాక 33వ నిమిషంలో మూడో గోల్‌ను అందించాడు. మరోవైపు భారత జట్టులో అమిత్ రోహిదాస్ 24వ, 32వ నిమిషాల్లో గోల్స్ చేశాడు. అయితే ఇతర ఆటగాళ్లు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యారు. దీంతో భారత్ గట్టి పోటీ ఇచ్చినా ఓటమి చవిచూడక తప్పలేదు.

పట్టుబిగించిన ఆస్ట్రేలియా



డర్బన్: దక్షిణాఫ్రికాతో డర్బన్‌లో జరుగుతున్న మొదటి టెస్టులో ఆస్ట్రేలియా పట్టు బిగించింది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని దక్కించుకున్న ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. ఇప్పటికే కంగారూలకు 402 పరుగుల ఆధిక్యం లభించింది. బంతి అనూహ్యంగా టర్న్ అవుతున్న పరిస్థితుల్లో ఇంత భారీ స్కోరును ఛేదించడం ఆతిథ్య సౌతాఫ్రికాకు కష్టమేనని చెప్పాలి. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 351 పరుగులు చేసింది. జవాబుగా బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. అయితే ఫాలోఆన్ ఆడించే అవకాశం ఉన్నా ఆసీస్ బ్యాటింగ్‌కే మొగ్గు చూపింది. మూడో రోజు బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాను సౌతాఫ్రికా బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. అయితే ఓపెనర్ కామెరన్ బాన్‌క్రాఫ్ట్ పది ఫోర్లతో 53 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. కెప్టెన్ స్మిత్ (38), షాన్ మార్ష్ (33) తమవంతు సహకారం అందించారు. ఆట ముగిసే సమయానికి పాట్ కమిన్స్ 17(బ్యాటింగ్), హాజిల్‌వుడ్ 4 (బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సౌతాఫ్రికా బౌలర్లలో మోర్కెల్, కేశవ్ మహారాజ్ మూడేసి వికెట్లు పడగొట్టారు. రబడాకు రెండు వికెట్లు లభించాయి.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.